TPLA125B139

సోరాజ్జెం

1801

1947

ఆగస్టు.

సాయింత్రం నాలు గ్గంటలయ్యుంటుంది. కాని, ఏ ఆరేడు గంటలో అయినట్టుగావుంది. ఆకాశమంతా కారుమబ్బుల్తో నిండి.

"మూల్లంక" సీమతుమ్మ చెట్లదగ్గిర, ఆ రోజు పోగుచేసిన ముళ్ళకంప పెద్దమోపుగాకట్టి నెత్తిమీది కెత్తుకోలేక ఎత్తడానికి ఎవరన్నా సాయందొరుకుతారేమో అని ఇటూ అటూ చూస్తున్నాడు. "ఎంకడు".

మనిషనేవాడు కనబడ్డంలేదు ఎంకడికి. చుట్టూ ఎక్కడ సూసినా దట్టంగా చెట్లు.

పెద్దపెద్దతాడిచెట్లూ, భూమంతటిన్నీ కొమ్మల్తోకప్పేస్తామన్నట్టున్న సీమతుమ్మచెట్లూ, తుమ్మచెట్లూ, నలు మూలలకీ విస్తరిస్తున్న రావి, గంగరావి, మర్రి... వీటన్నిటితో ఆ 'మూల్లంకం'తా పట్టపగలే కటిక చీకటిగా వుంది.

నేలమీదంతా అడ్డదిడ్డంగా మొలిచినగడ్డి. ఎప్పుడూ నీడ వుండడంమూలంగా ఆ గడ్డికి గోధుమరంగూ. ఎత్తుగా, ఏపుగా

నవలల పోటీలో ప్రథమ బహుమతి

రు. 2,000/- పొందిన నవల

పెరిగి నిలవలేక అటూ ఇటూ పడి అడుగుతీసి అడుగువెయ్యా లంటే వేసిన అడుగునే అల్లుకుపోయేట్టుందా గడ్డి.

తుమ్మముళ్ళూ, సీమతుమ్మముళ్ళూ కాలెవరెస్తారో కస్సు మందామన్నట్టు ప్రతిక్షణం కాచుక్కూచుంటాయి.

ఈ మూల్లంక ఓ చిన్నపాటి అడివిలావుంటుంది. అక్కడ పెద్దపాములు పట్టపగలే పడగవిప్పి పచార్లు చేస్తుంటాయి.

అలాంటి మూల్లంకలో, ఆ సాయంత్రపువేళ ఎవరన్నా అటువైపు వస్తూ కనబడరా అని చూస్తున్నాడు ఎంకడు.

అంతలో దూరంగా కొంచెం అస్పష్టంగా కేకలు వినబడ్తున్నాయి. ఆ కేకలేసిన మనిషి దగ్గరవుతున్నకొద్దీ ఎంకడికి పరిచయమున్న కంఠం వినబడింది. అది "ఎంకటేసిగాడ"ని అర్థమైపోయింది.

"...అరేయ్యేంకా! య్యేంకా!" అన్న ఎంకటేసిగాడి పిలుపుకి

"ఆ, యేంటిరా? ఇక్కడుండా గారా! ఇక్కడుండారా!" అని జవాబిచ్చాడు ఎంకడు, మూల్లంక చెట్లల్లోంచీ.

ఎంకటేసిగాడు ఆదరా బాదరా అరిచేస్తున్నాడు— "అరే య్యేంకా! పద్దక్కకి నొప్పులొత్తన్నాయిరా! కానుపు సాలా కస్టం అయ్యేతట్టుందంట. ఈరమ్మ కూడా వూళ్ళో లేదు. గుడివాడ అవిరికనాసపటాలకి తీసికెళ్ళాలేవో అంటన్నార్రా"

ఎంకడి గుండె దడదడలాడింది.

"తొందర్రారా! మోపెత్తి నెత్తిని పెట్టు"– అని మోపుకింద రెండుచేతులూ వుంచి ఎత్తుకోడానికి సిద్ధంఅయ్యాడు ఎంకడు.

"ఈ అడావుళ్ళో నువ్వేం మోత్తావ్‌లేవాస్సే. నా నెత్తిమీద కెత్తి నువ్వు లగెత్తుకెళ్ళు... పద్దక్కెట్టావుందో ఏంటో..."

ఎంకజేసు నెత్తిమీదికి మోపెత్తి గునుకెయ్యడం మొదలెట్టాడు ఎంకడు

"పద్దాలికెట్టుందో ఏంటో మాయదారిది. ఎళ్ళేసరికి పెస మయ్యిపోయుంటే గొంతమ్మకి కోడిని తెగేద్దును. ఏ ఆస్పటలకి తీసికెళ్ళాలి. ఎట్టా తీసికెళ్ళాలి. పైగా వూరు సూత్తే పల్లకాడు నసుమనిపిత్తాంది. ఈ వానలకి వూబిలాగా తయారైంది. కాలు తీసి కాలేత్తానికి తాతలు దిగొత్తన్నారు. ఇట్టావుంటె ఎట్టా తీసి కెళ్ళాలి. ఇంతాజేసి తీసికెళ్తే మాత్తరం అక్కడ ఏం మాబాగా సూత్తారో తెలంద? వూళ్ళో వుంటేనే నయం, కాత్త ఇరుగూ, పొరుగూ అన్నా సాయపడతారు ఏదొచ్చినా. ఆయాస్పటలకి

[illegible]
సూసినట్టు సూసి డిక్కూదివానం లేకుండా సేత్తారు...అయినా సమయానికి ఈరమ్మ ఎక్కడికిపోయిందో ?"— అనుకుంటూ ఆదరాబాదరా నడుస్తున్నాడు ఎంకడు.

ఈరమ్మ మంగలి మనిషి. ఆమె ఇప్పటికి ముప్ఫయ్ ఏళ్ళకి పైగా ఆ వూళ్లో కాన్పులుచేస్తూ వొచ్చింది కష్టమైన కాన్పులే కాకుండా మామూలుగా జరిగే కాన్పులకికూడా ఆమె హాజరు కావల్సిందే. ఆ వూరు కంతటికీ ఆమే డాక్టరూ. ఆమే నర్సూ. ఆమే కాంపౌండరూ. చివరికి మందుల ఉత్పత్తిదారు కూడా ఆమే.

ఆకాశమంతా వర్షానికి సిద్ధమవుతోంది, కారు మబ్బుల్తో భయంకరంగా.

మూల్లంక నుంచీ బైటపడి ఎంకడు పరుగులాంటి నడకతో తూరుపొలాల్లోకి అడుగుపెట్టాడు. భూషయ్యగారి ఎనిమిదెకరాలూ, దేవేంద్రగారి పన్నెండెకరాలూ, సావి పరబ్రహ్మంగారి ఎకరంన్నరా, దేవుడిమాన్యమూ, వీరవెంకట సత్యనారాయణ గారి మూడెకరాలూ,నర్సయ్యగారి రెండెకరాలూ దాటుకుంటూ కోడూరు రోడ్డెక్కాడు.

ఎంకడు రోడ్డుమీద గునుకేస్తున్నాడు.

నర్సయ్య ఎదురుపడ్డాడు— "యారా! యెంకా! యేంటా వురుకుడూ ?"— అన్నాడు.

"మా అడదానికి పెసమయ్యే రోజులుండే. మూల్లంకలో కంపేరతావుంటే ఎంకటేసిగాడొచ్చినొప్పులొత్తన్నయ్యని సెప్పాడండే... నువ్వెప్పుడెళతన్నావేంటుండే పొలానికి?"

"పొద్దున మా చిన్నమ్మాయికేదో సంబంద ముండంటే ముదినేపల్లి ఎల్లారా, అందుకనీ..."

"వానొచ్చే తట్టుందుండే... నే నెళ్తన్నానుండే..."

"ఊఁ... ఊఁ... ఎళ్ళెళ్ళు... దానికెట్టుందో సూడు"

నర్సయ్యతో మాట్లాడింది అరనిమిషమే అయినా చాలా ఆలస్యమయిపోయినట్టు పరుగు మొదలెట్టాడు ఎంకడు.

పాతమిల్లు దగ్గిర కొచ్చేసరికి డొంకలోనుంచి పచ్చగడ్డి మోపులెత్తుకొనివొస్తూ ఈరేశం,నల్లెంకడూ, దేవుఁడూ,యాకోబూ, నాగేశూ కలిశారు ఎంకడికి.

... అందరూ కట్టకట్టుకుని బైలెళ్ళారు" అన్నాడు ఎంకడు.

మాంచి దట్టమైన పచ్చగడ్డి మోపులెత్తుకున్న ఆ అయిదు గురూ కళ్ళ కడ్డంపడుతోన్న పచ్చగడ్డినీ, తలకి కట్టుకున్న తుండునీ కొంచెం పైకి జరుపుకుని గునుకుని ఆపకుండానే వెళ్తున్నారు.

"యారా, దేవుడుగా! అంతా వొక్కసారే బైలెళ్ళారు?" అన్నాడు మళ్ళీ ఎంకడు తనూ గునుకేస్తూ.

"ఏవీలేదురా మావయ్యా. రోజూ అయిదుగురుం కలిసి కోసి మోపులెత్తుకెళ్ళాల్లే" అన్నాడు దేముడు.

"మా ఆసాములు కలిసి గడ్డిపాట పాట్టంకాదుగానీ మా దుంపత్తెంచుతున్నార్రా బాబాయ్. అయిదుగురం ఒక్కసారే వొచ్చి కోసుకెళ్ళాలి ఎవరెక్కువ కోసుకెళ్తారో అని ఆళ్ళకి బయం" అన్నాడు నల్లెంకడు.

ఎంకడు వాళ్ళ అయిదు మోపులూ చూశాడు. అయిదూ అయిదు పర్వతాల్లా వున్నాయి.

"కొంచెంసిన్నమోపులెత్తేమిా బాబుగాడి ముల్లేంబోయిందిరా?"

ఈసారి నాగేసు జవాబిచ్చాడు.

"ఇట్టా తీసికెళ్తేంటేనే మా దొర 'సిన్నదెత్తావేరా' అని గొణుగుతాడు. ఈళ్ళుకలిసి పాట్టంకాదు గానీ, ఈళ్ళెమ్మ మా పాణాలు తోడేతన్నారులె ఎవడికాడు నాలుగు పరకలు ఎక్కువ కొట్టేద్దామనేగాని మెమెట్టా మొయ్యాలో తెలవదు"

"మాబాగా సెప్పావ్రా. మా దొర అంతేనెహె. 'ఏరా, నువ్వేనా. ఆళ్ళుకూడా యిట్టాసిన్నయ్యే తీసికెళ్తన్నారా?' అంటాడు పెతీసారీ" అన్నాడు యాకోబు.

"నువ్వేవన్నా మరి?"

"నిన్న నాకు సిర్రెత్తంది మాటనగానే సరిగ్గాడుండే, ఈ మోపు నీ నెతిమిాదెత్తుకని సావిట్లో నుంచి అదిగో, ఆ తొట్టి దాకా తీసికెళ్ళండే... రేపు నేను దీనికి యింకా యింత కట్టుకు రాకపోతే నీకిస్టమొచ్చిన పేరెట్టి పిలవండే, పలుకుతానన్నా"

"ఏవంటాడు?"

"యేంటనేదీ... ముసిముసి నవ్వులు నవ్వుతా— 'యారో యేంటి మాంచి యెగిమిాదుంది యవ్వారం' అనుకుంటా లోనకి బోయాడు. నాకొప్పమొత్తే మణిసినికాదని తెలుసుతే"

మాటల్లోబడి [illegible]

అక్కడినుంచీ నాగేశూ, యాకోబూ కాలవగట్టు దారిబట్టారు.

ఎంకడు మిగిలిన ముగ్గుర్నీదాటుకుంటూ 'పద్దాలెట్టుందో' అనుకుంటూ మళ్ళీ పరుగు మొదలెట్టాడు. తూరుపు చెరువు గట్టుమీదికొచ్చాడు. చెరువు గట్టంటపడి పరిగెత్తాడు. "ఆంజనేయులవారి" గుడిదగ్గర కొందరు "దొరల"పిల్లలు ఆటలాడుతున్నారు. పూజారి పిచ్చయ్యగారిల్లు దాటాడు. అక్కమ్మగుడి దగ్గరకొచ్చాడు.

అక్కమ్మ గుడి అంటే అక్కమ్మగారు కట్టించినగుడి అని. అక్కమ్మ ఓ భక్తురాలు. చందాలుపోగుచేసి షిర్డీసాయిబాబాకి ఒక గుడి కట్టించింది. ఆ గుడిని సాయిబాబాగుడి అని ఎవరూ పిలవరు. ఎందుకనంటె, ఆ అక్కమ్మగారు చందాలు పోగు చెయ్యటంఅనే ఉద్యమాన్ని పదిసంవత్సరాలపాటు ఏకైకంగా నిలబడి, నడిపి, చివరికి ఆగుడికట్టడం పూర్తవుతూంటెగానె చచ్చిపోయింది. అందుకనేదాన్నిఅక్కమ్మగుడిఅనేఅంటారంతా.

అక్కమ్మ గుడి దాటుకుంటూ మర్రిచెట్టు దగ్గర కెళ్ళిన ఎంకడికి—

"యారా, ఎంకా? పేళ్ళేసి పెట్టడానికొస్తానని రాకుండానే మాయమయ్యావేరా" అంటూ కోదండయ్యగారుఎదురయ్యాడు.

"వొత్తానుండే. పొయ్యిలోకేమీ లేవంటేనూ ముళ్ళకంపపోగుసేద్దామని మూల్లం కెళ్ళానుండే. ఇంతలో మా ఆడదానికి బాగుండలేదని ఎంకటేసిగాడొచ్చి సెప్పాడు. అందుకునే ఆదరా, బాదరా లగెత్తుతున్నానుండే. దానికొకత్త నెమ్మదిత్తే రేపొత్తానుండే."

"అరేయ్. నువ్వొస్తానన్నావుగదాని, నేనెవరికి చెప్పలా మాపెద్దమ్మాయి యిందాక పేళ్ళులేవనిఒకటేగోల... నువ్వేవో వొస్తానంటావేగాని రావు..."

"వత్తానుండే. రేపు తప్పకుండా వొత్తా" నని చెప్పి ఎంకడు మళ్ళీ పరుగందుకున్నాడు.

"పేళ్ళెయ్యాలంట పేళ్ళు. ఎన్ని పనులయినా వూరికినే చేయించుకుంటానికి మారాజు" అనుకుంటూ క్రిష్టారావుగారిల్లు దాటి మాలరేవు దగ్గరికి వొచ్చాడు.

ఆ వూరికి రెండు పెద్దచెరువులున్నాయి. ఒకటి తూర్పు చెరువు. రెండోది పడమటిచెరువు. రెండు చెరువుల్లోనూ రెండు

దానికి లేదు మాలవాళ్ళు.

రెండు చెరువులకి మధ్యగానూ, ఉత్తర దక్షిణాలకి విస్తరించి వుంది వూరు. ఉత్తరంగా కొంచెం ఎడంగా మాలపల్లి వుంది. పడమటి చెరువుగట్టుమీదుగా 'బడి' వుంది. బడికిరెండో వైపుగా చాకలి చెరువుంది అక్కడ చాకలివాళ్ళు గుడ్డలుతుకుతారు. దాని తరవాత 'బైనకోడు' అని ఒక మురుగు నీటి చెరువుంది. దాన్నిండానూ, మిగిలిన చెరువుల్నిండానూ కలువపూలూ. తామరపూలూ చూడ్డానికి చాలా అందంగానూ, పిల్లలకి స్నానాలకెళ్ళినప్పుడల్లా కాయలూ, పువ్వులూ తినడానికి సరదాగానూ వుంటుంది. తూర్పుచెరువు మాలరేవుకి, పడమటి చెరువు మాలరేవుకి పక్కగా బైనకోడుకి ఆనుకునివుంది మాలపల్లి. బైనకోడు గట్లవెంట పుష్కలంగా పందులు విహరిస్తుంటాయ్. బైనకోడులోని 'బుడబుడ'లకీ,'గుడగుడ' లకి అన్నిటికీ కారణం పందులే.

పద్దాలి కెట్టుందో—అనే ఆలోచనే ఎంకడికి. పదే పదే ఆ ఆలోచనరావడం అతను మరోఅడుగు ఎక్కువెయ్యడం...

మాలగుడిసెలు కొన్ని దాటి ముందుకెళ్ళగానే రోడ్డు మధ్యలో అభయమిస్తూన్నట్టుగా 'మాలరాములోరిగుడి' ఎదురైంది ఎంకడికి.

ఆ వూళ్ళో మూడు రామమందిరాలున్నాయి. ఒకటి వూరు దొరలకి మిగిలిన అగ్రకులజులకి,రెండోది 'సాలిపేట రాముడి గుడి'గా పేరొందింది. సాలిపేటలో సాలివారికేగాక యింకా మిగిలిన– అటు అగ్రకులంగానూ, యిటు అధముకులంగానూ కాకుండావున్న– అన్ని కులాలవారికీ. మూడోది యిది మాలరాములోరి గుడిగా ప్రసిద్ధిపొందింది.

మాలరాములోరి గుడి దాటగానే యిక ఆగలేక తలగుడ్డ తీసి నోటికర్చుకుని ఎవరో తరుముకొస్తున్నట్టు పరుగు లంకించుకుని మరో నాలుగు నిమిషాల్లో గుడిసెకి జేరాడు.

ఎంకడు గుడిసె దగ్గరకొచ్చేసరికి గుడిసెచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న పందులు ఒకపక్కగా చెదిరి నుంచున్నాయి. అక్కడి వాతావరణం నిండా పందిపెంటల వాసనా, అదొకరకమైన మురుగు కంపూ, బండ బండ ఈగలూ, చిన్న చిన్న మురిగ్గుంటలనిండా మూగివున్న పెద్ద పెద్ద దోమలు. ఆవాతా

వరణం ఎంత అపరిశుభ్రంగా వుండడానికి వీలుందో అంత అపరిశుభ్రంగానూ వుంది.

గుడిసెలో కెళ్దామనుకున్న ఎంకడికి వీలుకుదరలేదు. లోన యిరుగుపొరుగు ఆడవాళ్ళున్నారు. అది ఎంకడికి, పద్దాలుకీ సంబంధించిన గుడిసెగాని, పుష్పకవిమానమూ కాదు, కనీసం పుష్పకవిమానంలాంటి భవనమూ కాదు.

అయిదుగురులోనకెళ్తే ముగ్గురుబైటకురావాల్సిన గుడిసెఅది.

ఎంకడు బైటేనుంచుని "ఎట్టుందే రాములత్తా" అన్నాడు.

రాములత్త మాట్లాడలేదుగాని 'లచ్చిమత్త' లోన్నుంచే మాట్లాడింది.

"వొచ్చావా అల్లుడా! బాగానే వుండలే" 'బాగానే వుండి' అనే మాటకన్నా పద్దాలు మూలుగులే బాగా విన్పిస్తున్నాయి

ఎంకడు పక్కకు తిరిగాడు—ఒక పందిపిల్లతోక పుచ్చుకుని పరుగు తీస్తున్న బుడ్డోడొకణ్ణి చూసి, అక్కడున్న ఐదారుగురు పిల్లలు సంతోషంతో గంతులేస్తున్నారు. ఆ పంది పిల్ల కంగారుగా, మురిగ్గుంటల్లో అటూ,ఇటూ ఘోరంగా ఘుర్ఘురిస్తూ పరుగులు తీస్తుంటే ఈ బుడ్డాడు కూడా మొకంనిండా, ఒంటినిండా మురుగునీళ్ళు చిందించుకుంటూ, పందిపెంటల్ని కసాబిసా తొక్కుతూ-మిగిలినపిల్లలు ఆనందంగాగోలచేస్తోంటే గుడిసెల చుట్టూ పరుగులు తీస్తూ గోలగోలగా అరుస్తున్నారు.

ఇంతలో ఎంకడి గుడిసెకి నాలుగుగుడిసెలవతలుంటున్న 'ఈశ్వరుడి' గుడిసె ముందునుంచీ "సత్యన్నారాయణ గారి" కేకలు విన్పించినాయి ఎంకడికి.

ఎంకడులోనకి తొంగిచూస్తూ "లచ్చత్తా!ఏమన్నాకావాలా?" అన్నాడు.

"ఏం సంగనాసి మాటలాడతన్నాడే. కావాల్సిందీ, అక్కర్లేందీ అప్పుడేచేశావుగా అల్లుడా. ఇప్పుడేమో ఆళ్ళల్లో పేణాలెట్టుకున్నట్టు మాట్టాడతన్నా, ఏవన్నా కావాలా అనీ..."— సాగదీస్తూమాట్లాడింది 'లచ్చిమత్త'. లోపలున్న ఆడవాళ్ళంతా పద్దాలు మూలుగులు వినబడకుండా నవ్వారు పెద్దపెట్టున.

బైటనుంచునివున్న ఎంకడు బాగా బాధపడ్డాడు. పద్దాలంత బాదపడతాంటే ఈళ్ళందరికీ నవ్వులాటగా వుందా' అట్టా నవ్వటానికిదేనా సమయం అనుకుని కాసేపు అక్కడే నుంచున్నాడు.

లోనకెళ్ళడానికి వీల్లేదు. బైట ఎంతసేపు నుంచుంటాడు. సత్యన్నారాయణగారి కేకలు ఎక్కువైనాయి.

"యేంటీయనగోల? ఈశ్వరుడు జొరంవొచ్చి మంచాన పడ్డాడన్నారు పొద్దున్నుంచీ"అనుకుంటూ అటు దారి తీశాడు.

ఈశ్వరుడి భార్య "సావిత్రి" బైట నుంచుని 'సత్తెన్నారాయణ' గారికి నచ్చజెప్తోంది. సత్తెన్నారాయణగోరు ససేమిరా అంటున్నాడు.

"యేంటి దొరా?" అన్నాడెంకడు

"యేంటేంటిరా ఎంకా? ఈ ఈశ్వరుడుగాడు నా ప్రాణాలు తీస్తన్నాడురా. నేను మూడురోజులైంది మేడూరెళ్ళి. ఇవ్వాళొచ్చిచూస్తే గొడ్డసావిడి, గొడ్డసావిడిలాగ లేదు. ఇంటో చుక్క నీళ్ళులేవు. గేదలూ,ఎడ్లూ నన్ను చూడగానే 'అంబా! అంబా!' అని ఒకటే అవిటెల్లిపొయినయ్. ఆటిసగ్గిర వక్కపరక తింటానికి లేదు.ఇల్లు ఇల్లులాగా లేదు.వల్లకాడులాగావుంది."యేంటే?" అంటే 'ఈశ్వరుడు రాలేదు, నేనెంజెయ్యను' అంటందది. మా పెద్దాడేమో పరీక్షలయ్యేదాకా రానని గుడివాడలోనే వుంటన్నాడు. చిన్నాడికి దగ్గూ, పడిశెవూ. ఈడిదగ్గరకొత్తే, ఈడు నన్ను చూసి ముసుగెట్టాడు"

"మీరెల్లిన కాణ్ణుంచి వొకటే జొరం అక్కడికీ ఎళ్ళొద్దురా అంటే యింటేనా? దొరకూడా ఊళ్ళో లేడు, ఎల్లపోవ్తే ఎట్టా? అని మొన్నా, నిన్నా ఎల్లనే ఎల్లాడు. ఇవ్వాళ్ళకూడా ఎల్తానని, బజార్లోకొచ్చి కళ్ళుతిరిగి కిందడ్డాడు. ఒంటిమీద చెయ్యేసి చూడు దొరా. వొళ్ళు పేలాలెగుత్తాంది. ఆడు సావు బతుకులమీదుండాడు రోగంలేంది ఎప్పుడన్నా ఎగ్గొట్టాడా?" అంది సావిత్రి.

"ఆడి సావుబతుకులుకాదే నాకు వొచ్చింది సావుకి. అక్కడికీ, నే నెళ్ళేటప్పుడు చిలక్కి చెప్పినట్టు చెప్పా- 'వురే, నేనిట్టా యెల్తన్నా ఇల్లూ పసువులూ జాగర్త' అని సన్నాసి ఎళ్ళనిచ్చి ఈడిట్టా మారంకేస్తాడని నేనెట్టా అనుకుంటాను, అక్కడికీ నీయమ్మ మంద... మిమ్మల్ని సమ్మగూడదనుకుంటానే వుంటా..."

"వుండు దొరా! నేను సూసొత్తా"అని ఎంకడు గుడిసెలోకెళ్ళి ఈశ్వరుడి వొంటిమీద చెయ్యేశాడు. ఈశ్వరుడు కళ్ళు తెరిచి నెమ్మదిగా ఎంకడివంక చూసి ఏదో మాట్లాడ బోయాడు

గానీ, మాట బైటకిరాలా. వళ్ళు మండిపోతోంది.

"యీడసలు బతుకుతాడా. సావుకళ పడింది మొకాన" అనుకుంటూ బైటికొచ్చి "దొరా, ఆడికనిజంగానే రోగమొచ్చింది. వొళ్ళు ముట్టుకుంటే మండిపోతాంది. మాటకూడా రాటల్లా. వుసే సాయిత్రీ మీ అన్నకక్కబురెట్టవే. ఆడొచ్చి గుడివాడన్నా తీసుకెళ్తాడేమో" అన్నాడు.

"అదే సూత్తన్నా బావయ్య. పిల్లలెవరూ పలకటల్లా. యీణ్ణిట్టా యిక్కడొదిలి దెంటుకూరెట్టా యెల్లాలి నేనూ" అని సాయిత్రి కళ్ళు నీళ్ళెట్టుకుంట.

"ఛీ, నీయమ్మ దొంగ నాయాళ్ళురా మీరంతా" అని ఛీత్కరించి సత్తెన్నారాయణగారు వెనక్కితిరిగాడు.

"కాదుండే. నిజవే. నేను జూశాగా" అన్నాడు ఎంకడు.

"మీరంతా వొకటి గాదంటలే" అని వెళ్ళిపోయాడు సత్తెన్నారాయణగారు.

"దొరలంటే యీళ్ళూ దొరలు. సచ్చిన సెవంకూడా ఎల్లి పని జెయ్యాల్సిందే" అనుకుంటూ "మీ అక్కకి నొప్పులొత్తన్నయ్యే. లేకపోతే నేనన్నాయెళ్ళి వొక కేకేసొద్దును" అన్నాడు ఎంకడు.

"వొద్దులే బావయ్యా! వుప్పుడే మార్తమ్మ యెళ్ళిందిలే కొడుకునిపంపుతానని. నాతిప్పలేన్నుపడతాలే. అక్క కెట్టుందో సూడు"— అంది సాయిత్రి.

ఎంకడు మళ్ళీ తనగుడిసెకేసితిరిగాడు. పద్దాలుమూలుగులింకా పెరిగినయ్.

దూరంగా వెళ్తూమంత్రసాని ఈరమ్మ కనబడింది. వరమిచ్చే దేవత ప్రత్యక్షమైనంతగా సంబరపడ్డాడు.

"యీరమ్మగోరో, యీరమ్మగోరో" అంటూ కేకలు వేస్తూ ఈరమ్మవైపు పరిగెత్తాడు. ఈరమ్మకి పాతికపుట్ల చెముడు. గునగున నడుస్తూ తలూపుకుంటూ వెళ్ళిపోతూనేవుంది ఈరమ్మ కేకలు వేసుకుంటూ వెంటబడ్డ ఎంకడు ఈరమ్మ ముందుకెళ్ళి అరుస్తూ తన భార్య పరిస్థితి చెప్పాడు.

ఈరమ్మ వెంటనే వెనక్కి తిరిగింది. చకచకా నడిచి పద్దాలువున్న గుడిసెలో దూరింది. దూరుతూనే చూసింది గుడిసెంతా. పద్దాలు పడుకుని వున్న నులకమంచం కుక్కి కుక్కి అయివుంది. అక్కడున్న యీవన్నిండీనీ పేరుపేరునా తిట్టింది.

తిట్టిన తరవాత కింద చాపముక్కలూ, పాతబట్టలూ పరిచి పద్దాల్ని దాని మీద పడుకోబెడ్తూ— "ఒక్క లంజెకీ తెలవదు మళ్ళీ ఒక్కొక్కళ్ళూ డజినుమందిని గంటారు. ఈ కుక్కలో పడుకునుంటే యింకా పది సంవత్సరాలయినా ఈ లంజి పెనమించలేదు" అని అరిచింది.

ఈరమ్మ తనకు చెవుడనుకోదు. ప్రపంచానికే చెవుడనుకుంటుంది. అందుకే ఆమె ఏమిచెప్పవలసివచ్చినా అరుస్తుంది.

వాన జోరుగా కురవడం మొదలైంది. కాసేపట్లోనే గుడిసె లోపలా కురవడం మొదలెట్టింద.

ఎంకటేసిగాడు ముళ్ళకంపతెచ్చి, నీళ్ళు కారుతూ, గుడిసె వెనక్కివెళ్ళి కంప అక్కడ పడేసి, ముందుకొచ్చాడు.

గుడిసె లోపలున్నవాళ్ళూ తడుస్తున్నారు—బైటవున్నవాళ్ళు తడుస్తున్నట్టుగానే.

ఆ వానలో, చలిలో పద్దాలు పెద్దకేకతో ఓ పిల్లనికన్నది. ఈరమ్మ అపిల్ల ఏడవటంలేదని ఓ చిన్నదెబ్బ వేసింది. కాళ్ళు పట్టుకుని తిరగేసింది. తలకిందులుగా వేళ్ళాడేసింది. పిల్ల గుక్కపెట్టి ఏడ్చింద.

తూరుపు తెల్లవారుతోంది.

వాన తెరిపిచ్చింది.

• • •

పొద్దున్నే ఊరంతా బురదగానూ, కోలాహలంగానూ వుంది.

మైకొచ్చింది వూళ్ళోకి. దాన్తోపాటు "స్వాతంత్ర్యమే మా జన్మహక్కని చాటండీ..." "వందెమాతరం, వందెమాతరం" మొదలైన పాటలూ, మూడురంగుల జెండాలూ వూరంతా సందడి సందడిగా.

ఆ వూరి మధ్యలోవున్న భవనంనుంచీ "బ్రహ్మంగారు" బైల్దేరి కొందరు పెద్దమనుషులు అనుసరిస్తుండగా మాలపల్లికి దర్శనం ఇచ్చి, దాన్ని పావనంచేసి—

"సొతంత్రమంటే ఏమిటి?" అని అక్కడున్న జనాన్ని ప్రశ్నించాడు.

సొతంత్రమంటే ఏమిటో చెప్పడానికి అక్కడిమాలవాళ్ళు మొహమాట పడ్డారు. బ్రహ్మంగారు పక్కకిచూశాడు. అక్కడ నారాయణరావనే యువకుడున్నాడు. అతను బ్రహ్మంగారిని చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఏవంయ్యా, నారాయణరావూ! చదువుకుంటున్న వాడివి నువ్వైనా చెప్పు — సొతంత్రమంటే ఏమిటో" అన్నాడు బ్రహ్మంగారు.

నారాయణరావు సవరించుకున్న కంఠంతో చెప్పాడు— "సొతంత్రమంటే పూర్తిగా సొతంత్రమన్నమాట. తెల్లవాళ్ళ పాలన అంతమైంది. ఇప్పుడు మన పాలన. మన బాగోగులు మనమే చూసుకుంటాం. మనం సొతంత్రులమయ్యాం" అన్నాడు.

బ్రహ్మంగారు చాలా సంతోషపడ్డాడు సొతంత్రం అంటే అర్థం తెలిసినందుకు.."శెబాష్. అదన్నమాట... అయితే తెల్లదొరలపాలన దానంతట అదే అంతమైందా? లేదు దాన్ని మనందరమూ కలిసి అంత మొందించాం. గాంధీగారు... మన పండిత నెహ్రూగారు...మన పటేలు గారు...మన ప్రకాశం పంతులుగారు...ఒకళేమిటి ఎందరో మహానుభావులు... వాళ్ళంతా మనని నడిపి ముందుండి వాళ్ళు నడిచి, తెల్లవాళ్ళతో పోట్లాడి, యుద్ధంచేసి, కత్తిలేకుండా యుద్ధంచేసి, అహింస... నిరాహారదీక్ష... లాంటి కనబడని ఆయుధాలతో తెల్లవాళ్ళకి బెదురుపుట్టించి మనరాజ్యం మనం లాక్కున్నాం. దోపిడీచేశారు. మన దేశంలో వున్న సంపదలన్నిటినీ తెల్లాడు తన దేశం తీసుకుపోయాడు. ఈ రైళ్ళేసింది అందుకే. అందుకే మనం మోటూరెళ్ళి రైలుపట్టాలు పీకేశాం... ఇక మన నాయకులు...మహా గొప్పవాళ్ళు వాళ్ళేది చెపితే మనమంతా అదే చేశాం ఆ దెబ్బతో తెల్లాడు జంఝా పీకేసి "సరే బాబూ! మీ దేశం మీ కిస్తన్నాం మీకెట్టా యిష్టమయితే అట్టా చేసుకోండి" అని ఎళ్ళిపోయాడన్న మాట...మన మహాత్మ గాంధీగార్ని మన అంగలూరు ఎళ్ళి అందరం చూసొచ్చాం.అదంతా మీకు తెలుసు. ఆయన మనిషికాదు దేముడు. మన కష్టాలు చూసి మన్ని రక్షిస్తానికి మనలో పుట్టాడన్నమాట...అందువల్లమనం సొతంత్రులమయ్యాం. మనమంతా అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసుండాలి. అన్నొకమాటన్నా ఒక దెబ్బేసినా తమ్ముడు ఎదురు తిరుగుతాడా? తిరగడు అట్టాగే మనమంతా కలిసి మెలిసి ఒకళ్ళ కష్టసుకాలు ఇంకొకడయిగా చూసుకుని అయికమత్యంతో మెలగాలి...ఇప్పుడు గడ్డి చూడండి. గడ్డి పరక— దాన్ని తుంపులు చేసేత్తాడు అడిగో ఆ చీమిడిముక్కు బుడ్డా

డయినా సరే" అని పెద్దవాళ్ళ కాళ్ళ సందుల్లో నుంచీ చీమిడి కారుకుంటూ మడ్డిగా వున్న ఒక బుడ్డాణ్ని చూపించగానే జనమంతా వాడెంక తిరిగి నవ్వారు.

వాళ్ళ నవ్వులు విని బ్రహ్మంగారు వుత్తేజితుడయ్యాడు. "అదే పంకలు పదిపన్నెండేసి తాడుపేనతాడు మన ఎంకడు. ఇక ఆ తాడుపెట్టి ఏనుగును కట్టేసినా... ఏనుక్కూడా తెంప లేదన్నమాట అదే అయికమత్యమంటే అందువల్ల... మరి అందుకే... మనం అంగరం అయికమత్యంతో...... అయిక మత్యమే మహాబలం అన్నారు పెద్దలు. ఆ విధంగా మనం తెల్లాళ్ళని ఎళ్ళగొట్టేశామన్నమాట. కాబట్టి, మన రాజ్జం మన కొచ్చేసింది. తెల్లాళ్ళు పరాయివాళ్ళు మన రాజ్జాన్ని పరాయి రాజ్యంచేశారు ఇప్పుడు మన రాజ్జాన్ని మనం లాగేసుకున్నాం. అందువల్ల మనద సొరాజ్జమన్నమాట యిప్పుడు. ఈ సుబసం దర్బంలో మన ఎంకడు బాతురు...... రాత్రి పుట్టింది మన సొరాజ్జంలాగే...అందుకే దానికి 'సొరాజ్జెం' అని పేరు పెడు తున్నా అనగానే అందరూ 'సొరాజ్జానికీ జై' అన్నారు బ్రహ్మం గారు "బోలో సొతంత్రభారత్‌కీ" అన్నాడు. జనమంతా "జై" అన్నారు.

"మహాత్మాగాంధీకి..."

"జై!"

"జవహర్‌లాల్ నెహురూకీ..."

"జై!"

నారాయణరావు "బ్రహ్మంగారికీ..." అన్నాడు. "జై" అన్నారు జనం.

బ్రహ్మంగారు అక్కడున్న పిల్లలందరికీ పంచదారబిళ్ళలు పంచాడు. ఆ బిళ్ళలకోసం పిల్లలు ఎగబడ్డారు, కిందబడ్డారు.

ఆనాడుపుట్టిన పిల్లలందరి పేర్లూ ఇవే. స్వరాజ్యం,స్వరాజ్య లక్ష్మి, గాంధీ, నెహ్రూ, బాపూజీ అయితే ఈ పేర్లు పెట్టి వూరు కోకుండా ఎవరి కులాలు వాళ్ళు కలిపారు. బాపూజీచౌదరి, సుభాష్ చంద్రరెడ్డి. మరికొందరింకాస్త ముందుకెళ్ళి ఆంధ్ర రెడ్డి, భరత్‌కుమార్...ఇలా.

సభ అయిపోయాక కూడా మాలపల్లిలో మైకు మోగుతోనే వుంది. జెండాలు కట్టారు వానసలేదుగాని వాతావరణం చల్లగా వుంది. గుడిసెలో సొరాజ్జెం నిద్రపోతోంది తడిసిన కంపలో

పుల్లలు మండకపొగతో కళ్ళనీళ్ళు కారుతూ పద్దాలు పొయ్యి వూదుతోంది కళ్ళు మండుతున్నాయి. కడుపూ మండుతోంది.

ఎంకడు అక్కడే ఓ రాయిమీద గొంతుక్కూర్చుని ఆలో చిస్తున్నాడు

'సొతంత్రం, సొతంత్రం అంటాడేంటి బెమ్మం గారు. మొన్నొకరోజు మోటూరుకాడ రైలుపట్టాలు పీకేశాం. అప్పుడూ ఇట్లాగే 'వందేమాతరం' అని కేకలేశాం. తెల్లోడిరాజ్యం పోవాలని కేకలేశాం. అయితే అంతమాత్రానికే తెల్లోడిరాజ్జెం పోయిందా ఆడు పెద్ద తెలివైనవోడంటారుగందా. అంతా తెలివైన బుర్ర పరారయ్యిందా. ఈ సూత్తరం రైలుపట్టాలు పీకి కేకలెయ్యటమే అయితే, ఏనాడో చేసేపని గందా? మరి యిన్నేళ్ళు ఎందు కూరుకున్నట్టు... ఆఁ... అప్పుడు రైళ్ళు లేవుగదా" ఓ కేళ అందుకనేవోఁ, మనకి సొరాజ్జెం రాటానికి కుదర్లా. తెల్లోడు మొత్తానికి ఎర్రోడిలాగున్నాడు. ఆడు, ఆ రైలు పట్టాలు యాంచకపోతే, యింక మనదేశానికి సొతంత్రం యివ్వాల్సిన పనుండేదికాదు. అదికన్ను ఆడేల్తోనే పొడుసుకున్నాడన్నమాట.

మరి బెమ్మంగారు 'మనందరం సమానులం, అన్నదమ్ములం అంటాడేంటి? అయనసూత్తే కమ్మదొర మేముసూత్తే మాలోళ్ల వఁయ్యే. 'మాలాళ్ళు' అని అనొద్దంటాడంట గాంధీగోరు 'అరిజనులు' అనమన్నాడంట. అన్నదమ్ములెట్టవుతాం. ఏంటో మేళం.

ఆలోచనల్లో మునిగిన ఎంకడికి నెలరోజులకింద బాడవ పొలం కాడ జరిగిన విషయం గుర్తొచ్చింది. రావుఁలుగాడు పెసాదుబాబుమీద తిరగబడితే, బెమ్మంగారొచ్చి రావుఁల్ని పట్టుకుని "వూరుకోండి, వూరుకోండి" అంటున్నాడు అదిఅసరాగా తీసుకుని పెసాదుబాబు రావుఁలుగాణ్ణి ఆ దవడా ఈదవడా పగలగొట్టాడు. రాఁవులుగాడికి వుక్రోసం వొచ్చి బెమ్మంగారిని వొదిలించుకోబోతే 'బెమ్మంగారినే యిదిలిత్తావా' అన్నారు కమ్మదొరలు. అన్నదమ్ములం అనె బాబు పెసాదుబాబునే దూరంగా తీసికెల్లొచ్చుగా. ఎందుకట్టాజేశాడు?

రైలుపట్టాలు పీకినప్పుడు... అప్పుడూ అట్టాగే... జైల్లో పెట్టారు అందర్నీ. బెమ్మంగారు నానాశాకిరీచేయించుకున్నాడు అందరిశాతా. జైల్లో బాబుల్తో ఆ మాటా ఈ మాటా జెప్పి బైటి

నించీ గారెలు తెప్పించుకు తిన్నాడు. దాసుకుని దాసుకుని తినేవాడు. అందరికీ నోరూరేది.

"'ఎదవల్లారా! అట్టా చూత్తారేరా?' అని పురుగుల్ని చూసినట్టు చూసేవాడేగాని చిన్న టుంపుకూడా యిసిరేవాడు కాదు యివ్వాళేవోఁ, మనవంతా అన్నదమ్ములం అంటన్నాడు. అన్నదమ్ములైతే యిట్టానే వుంటారా?" అనుకున్నాడు ఎంకడు.

"బెమ్మంగారు మనమందరం అన్నదమ్ములం అంటన్నాడుగందా! నిజంగానె అందరూ అట్టా అయిపోతారంటావా?" అంది పద్దాలు.

"ఓసి పిచ్చిదానా. మనమందరం ఒక్కటేఅనగానే కమ్మదొరలు మాలాళ్ళవుతారా, మాలెదవలు కమ్మదొరలవుతారా?"

"మరాయిన అట్టెందుకంటన్నాడు?"

"అట్టాగెఅంటాడు...రేపెళ్ళి ఆయనముందు కూచ్చున్నేవ్ అన్నదమ్ములమేగదా అని."

"నడేలే నంబడం... మనకేవన్నా పొలం యిత్తారేవోఁ అనుకున్నా యింకా..."

"ఆఁ ఇత్తారు. మా అన్నేగా ఆబెమ్మంగారు. ఆయన మడిలోది కాత్తిచీలిచి నీ పేరెడతాడులే"

"నాకొక్క దానికేనేంటి. ఆమాటకొత్తే నీకూ అన్నే. అందరం అన్నదమ్ములమే నన్నాడు."

"అళ్ళకేంటే మా రాజులు. ఎన్నన్నా అంటారు; ఏదన్నా చేత్తారు."

"అయితే, తెల్లాడెల్లినా మన బతుకు లింతేనంటా"

"కాక?"

"ఏవోఁలేరా గాంధీగారూ, అళ్ళూఅంటన్నారంటగా 'అరిజనులు' బాగు పడేట్టు చేత్తారని"

"ఏవోఁలే. అదీ సూద్దాం"

"కూత్తి మడిసెక్కేదన్నా దొరుకుతే..."

"అ దొరుకుద్ది..." అని ఎంకడు మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు

ఆ ఆలోచనల్లో-వాకిట్లో మంచంమీద కూచ్చొన్న బెమ్మంగారు...యిద్దరు ముగ్గురు మాలవాళ్ళు దూరంగా చేతులు కట్టుకుని నిలబడి వుండటం... వాళ్ళల్లో ఒకడికి దాహమైతే, దూరంగా వుండమనే హెచ్చరికల్తో, దోసిట్లో ఎత్తుగా పెట్టిన

[illegible]
కలిసిమెలిసి వుంటారా? పెళ్ళిళ్ళకి, పండగలకి అందరి భోజ
నాలూ అయ్యినాక' ఆకరిబంతిలో కూచోమనకుండా కలిసి
మెలిసి తింటారా? మాలాళ్ళి కమ్మ రాములోరి గుళ్ళోకి రాని
త్తారా? కమ్మ దొరలు మాలపిల్లల్ని పెళ్ళిళ్ళు జేసుకుంటారా?
మాలాడికి కమ్మదొరలు పిల్లల్నిత్తారా? ఇయ్యన్ని జరిగేయేనా?

* * *

"సాలిపేటనిండా సాలెవాళ్ళూ, చాకలిపేటనిండా చాకలి వాళ్ళూ, ఏ పేరూలేని పేటనిండా కమ్మ 'దొర'లూ, మాలపల్లె నిండా మాలమాదిగలూ... అలాగే... తరతరాలుగా ఎలా వుందో అలాగేవుంది చౌటపల్లి

పడమటి చెరువుకు కాస్త దూరంగా చాకలి చెరువు.చుట్టూ పొలాలు. చాకలిచెరువుకి పడమటి చెరువుకి మధ్యలో ఆవూరి పెద్ద బడి. దాన్లో ఎనిమిదోతరగతివరకూ వుంది.

చాకలి చెరువులో చాకలివాళ్ళూ, పెద్దబడిలో పిల్లలూ ఒకేసారి పనుల్లోకి చదువుల్లోకి ప్రవేశిస్తారు.

పిల్లలు "తల్లీ, నిన్ను దలంచి పుస్తకం చేతంబూనితిన్ అంటూండగానే—

చాకలివాళ్ళంతా ఎవర్నీ తలంచకుండానే బట్టలు చేతం బూని బండకేసి బాదడం మొదలెడతార. ఆ శబ్దాలచ్చే ఉత్సా హంతో శరీరశ్రమమర్చిపోవడానికి 'ఇష్ష'అనీ, 'య్యోయ్యో'అనీ, 'ఆహ్వా' అని దెబ్బ దెబ్బకి రకరకాల శబ్దాలు చేస్తుంటారు. స్కూలు కిటికీలనీ చాకలి చెరువులోకి తెరుచుకొని వుండడం మూలాన స్కూల్లో చాకలివాళ్ళ శబ్దాలు ప్రతిధ్వనించి అటు చాకలి వాళ్ళనూ ఇటు పిల్లలనూ ఉత్సాహోద్రేకాల్తో నింపు తాయి.

టీచర్లు కొయ్యకుర్చీల్లో దిగుళ్ళతోకూర్చుని, ఇరవై ఏళ్ళు దాటినా, కుదరని కూతురి సంబంధం గురించో, మనియార్డరు చెయ్యమనితప్ప వుత్తరంరాయనికొడుకుగురించో, రెండేళ్ళల్లో అయిపోయే రిటైర్మెంట్ గురించో, ఏదో నాలుగు రాళ్ళు వెనకేద్దామని మొదలెట్టిన వ్యవసాయం గురించో, మొన్నొచ్చి వెళ్ళిన స్కూళ్ళ ఇనస్పెక్టరు తనమీద రాయబోయే రిపోర్టు గురించో ఆలోచిస్తూ వుంటారు.

ఈ మోతలూ, కోలాహలాలూ, పిల్లల రాకపోకలూ, పం

[illegible] డిప్పుడే. పడమటి చెరువు మాలరేవు దగ్గరకొస్తే అన్నీ కన బడతాయి.

సౌరాజ్జెం తండ్రి ఎంకడు అప్పుడప్పుడు తగిలే కూలికి పోతుంటాడు. తల్లి పొలాలకెళ్ళే గేదెల వెంట ఆశగా తిరుగుతూ వుంటుంది. పేడ తెచ్చి పిడకలుచేసి అమ్ముకుంటుంది ఎంకడికి పెద్దగా పనులు దొరకవు. అప్పుడు అతను మాల రాములోరి గుడికాడ వెయ్యబోయే నాటకాల్లో కృష్ణుడి వేషం కోసం పద్యాలు దంచుతూ వుంటాడు.

సౌరాజ్జెంఎప్పుడన్నాఏడుస్తూ కనబడితేఎంకడు, "చెలియో చెలకో" మొదలుపెట్టి–అభినయంతోసహా–'అబ్బూరి' తీసినట్టు "అ(......ఆఆఆ......" అని రాగం తీస్తాడు. ఆ రాగానికి జడుసుకుని మొదట్లోనూ, అలవాటయ్యే దరిమిలానూ సౌరాజ్జెం ఏడవటం మానేసేది.

సౌరాజ్జానికో అన్న వున్నాడు "తిరపతిగాడు" పుటుగ్గల మనిషి, పధ్నాలుగేళ్ళవాడు, వాడికీ, ఇంటికి సంబంధం కాస్త తక్కువే.

తెల్లారగట్టే లేచి నాగభూషణంగారింటి కెళ్తాడు. అక్కడ అతను చిన్న పాలేరు. గేదెలకి కుడితెలెట్టడం, పడమటి చెర్లో నీళ్ళు కడవల కావిడితోమోసి మూడు పెద్దతొట్లెలు నింపడం, గేదెల్ని పొలాలకు తోలుకెళ్ళి మళ్లీతోలుకురావటం, గొడ్లచావిడి బాగుచెయ్యడం, రాయబారాలూ— అంటే- "మాదొరసానమ్మ గారు గుడివాడెల్తాందంట. నువ్వొత్తావేంవో కనుక్కురమ్మంది". అని దొరసాని మాటలు ఇంకోదొరసానికి చెప్పిరావడం. పెసాదుబాబుని మా దొర ఒకమాటిని ఎల్లమంటన్నారండే. అర్జెంటండీ" అని దొర మాటలు ఇంకో దొరకి చెప్పి రావడం...ఇలాంటివి, కోమటింటికి వెళ్ళి సరుకులు తేవడం, ఆ ఇంటికి ఈ ఇంటికి వెళ్ళి కరివేపాకో, బదుళ్ళో తేవడం... ఇలా పనులన్నీ ముగించుకుని కొంపకొచ్చేసరికి రాత్రి ఏడెనిమిదవుతుంది. పల్లెటూళ్ళలో ఏడెనిమిదంటే అంతా సగం నిద్దల్లోవుంటారు– మాలపల్లెల్లోతప్ప. అప్పుడప్పుడే పనులు ముగించుకుని ఇళ్ళకు చేరుకుంటూంటారు కాబట్టి నలుగురూ బజారుల్లో ఎదురుపడుతూ"మంచీసెబ్బరా" మాట్లాడుకుంటూంటారు. చిన్నపాలేళ్ళు పగలంతా పన్జేసి అలిసిపోయుండటం

మూలాన నడుస్తూన్న సగం సగం నిద్ర ...

వీధికటూ యిటూ వున్న దొరల యిళ్ళల్లోనించీ "తిండి తినగానే బండలాగ నిదరోతే చదువెట్టా వస్తుందీ... లే, లే!... కాసేపు దీపం దగ్గర కూచుని చదువు" అనే హెచ్చరికలూ, క,కా;కి,కీ అని గుణింతాలూ వినబడుతూంటాయి. "అశోకుడు అ... అశోకుడు చెట్లను... చెట్లను నాటించెను...... నాటించెను. అశోకుడు చెట్లను నాటించెను ..." అని పిల్లలు భట్టీ లేస్తుంటారు.

తిరపతిగాడూ, అతనినావాసగాళ్ళూ దొరలపిల్లల్ని అనుకరిస్తూ ఒకర్నొకరు వెక్కిరించుకుంటూ నడుస్తూంటారు.

"ఆచార్లవారింటోనుంచీ "యదువంశ సుధాంబుధిచంద్ర" విన్పిస్తూవుంటుంది. అక్కడకాసేపాగి "యదువంశ సుదాంబుద చంద్ర" పాడుకుంటూ నడుస్తూవుంటారు.

అంతలో కిష్టారావుగారి యింటోంచీ మాటలు వినబడుతూ వుంటాయి– "ఉచ్చబోసుకు పడుకో. రాత్రిలాగా మంచమంతా తడిపిబెడితే కుక్కపక్కలో పాడుకోబెడతా" అనే తల్లీ, ఉచ్చబోసుకో మంటున్నందుకు ఏడుస్తున్న పిల్లడూ...

ఇవన్నీ సరిగ్గా గమనించీ గమనించకుండా జోగుతూ, నడుస్తూ, నవ్వుతూ, దొరా, దొరసానీ తిట్టినతిట్లూ, వేసినదెబ్బలూ గుర్తొచ్చి బిక్కమొగాలేసుకుని ఇళ్ళకు తిరిగొస్తుంటారు. తిరపతీ, అతనికన్నా చిన్నా, పెద్దా పాలేళ్ళూ.

తిరపతి గుడిశకు చేరేనరికి సొరాజ్జెం నిద్రోతూ వుంటుంది తిరపతికి చెల్లెలంటే చాలా యిష్టం. వాడి తర్వాత ఆ యింట్లో ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారు. చాలాకాలానికి సొరాజ్జెం పుట్టింది.

వీళ్ళ గుడిసెకు రెండు గుడిసెలవతల "మాదిగ మేరీ" ఇల్లు. ఆమె సారావ్యాపారం చేస్తూంటూంది. మేరీమాత సారా యాపారం!

సొరాజ్జానికి ఆవాసనలుఅలవాటే పందులన్నా అలవాటే. పందిపిల్లలు దగ్గరకొస్తే తోకపట్టుకు లాగుతుంది.

పక్కగుడిసెలోంచి 'బోడిది'వస్తుంది. సొరాజ్జాన్ని బోడికి అప్పజెప్పి పద్దాలు పేడకెళ్తుంది.

సొరాజ్జెమూ, బోడిదీ, మరో నలుగురైదుగురు పిల్లలూ కలిసి మాదిగ మేరీ సారా దుకాణం దగ్గరకెళ్ళినించుంటారు.

...ంటుంటారు, ఆపమూస్తారు. ఇంతల్లో అటూగా "మరమరాలు... బటానీలు...ఏడిశనక్కాగ్ లు... నిమ్మతొనలు...జీళ్ళుప్వ్వాయ్"అంటూ ఓమునలామె బుట్టనెత్తిన పెట్టుకుని వస్తుంది. ఈ పిల్లలంతా ఆ మునలమ్మ వెనక బైల్దేరతారు. ఏ పిల్లగోలపడలేని తల్లో బుట్టదింపిస్తుంది. ఈ పిల్లలంతా ఆ బుట్టచుట్టూ నుంచుంటారు. ఆ మునలమ్మా, ఆ తల్లీ, ఆ పిల్లా— ఈ పిల్లల్ని "ఛీ! పొండవతలకి" అనో; "జరగండెహె... కొన్నివ్వరు, తిన్నివ్వరు" అనో కసురుతారు. వీళ్ళు మూడడుగులు వెనక్కేసి, నాలుగడుగులు ముందు కేస్తారు. మళ్ళీ మొదలు.

అంతలో వీళ్ళల్లో ఏ పెద్దపిల్లనో వాళ్ళమ్మ పిలిచి "ఎంకట్రామయ్యగారి కొట్టుకెళ్ళి వో అద్దణా చింతపాండెట్టించుకు రాయే" అంటుంది. ముందు వెళ్ళనని మారాంచేసి, రెండు తగల్నిచ్చాక 'అద్దణా' పుచ్చుకుని, వీళ్ళ దగ్గరకొచ్చి "కోంటి కొట్టుకెళ్దారి వత్తారేంటే" అంటుంది.

ఇంతకుముందొకసారి తను రమ్మంటే ఎందుకు రాలేదని ఓ పిల్ల అడుగుతుంది.

"అబ్బో! శానాదూరం" అంటుంది ఇంకో పిల్ల.

"మీరు రాకపోతే నాకు బయమేంటి? నేను యెల్లలేనేంటి?" అంటుంది రమ్మని అడిగిన పిల్ల.

'నేనొత్తా' నంటుందిలోపు ఒక పిల్ల. మరో ఇద్దరు అటు వూగుతారు.

రమ్మన్నపిల్ల "కోంటాయన కొంచెపె(వన్నా పెడతాడ్లే రాయే. నక్కగా తిందాం" అంటుంది.

ఇక ఆలోచనలూ, వూగుళ్ళాటలూ మానేసి అంతా బైల్దేరతారు. వాళ్ళలో కొందరు పరుగుతీస్తారు...మొత్తానికి జేరతారు

"అద్దణా చింతపాండెట్టండే"

"అణా మంచినూనియ్యండే"

"ముక్కానీ ఉల్లిపాయలియ్యండే"

"కానీకి బెల్లమియ్యండే" అంటూ "వెంకట్రామయ్యగారి" దుంప తెంచుతూ, అరుస్తూ వుంటారు. అతను వీళ్ళవైపన్నా చూడక ఒకటొకటే కడుతుంటాడు.

"కూత్తేమన్నా పెట్టండే"అని చింతపండమ్మాయి అనగానే మిగతాపిల్లలంతా చేతులుజాపుతారు. వెంకట్రామయ్యగారు తన

మానసిక పరిస్థితినిబట్టి అందరికో,కొందరికో నాలుగు నాలుగు మరమరాలో శనగపప్పో పెడతాడు.

బైటకొచ్చి ఇక అవి పంచుకుని ఒక్కటొక్కటే తింటూ ఒకటి కిందబడితే "భూదేవి కోగుళుంది తియ్యకూడదని" ఒక రంటే, "తీసి కళ్ళకద్దుకొని తినొచ్చని" ఒకరంటారు.

అరేళ్ళమ్మాయి చంకలో చేరిన సంవత్సరంన్నర పిల్ల యింకా కావాలని ఏడుస్తుంది. ఆ పిల్లనూరుకోబెట్టడానికి అందరూ తలొక మరమరాలగింజా ఇవ్వాలని ఒకరంటే, ఒకరు 'దాని చెల్లికి దాన్నే ఇచ్చుకో'మంటారు. చివరికి కొందరిస్తారు. ఇవ్వనివాళ్ళని తరవాత రోజుల్లో వాళ్ళ కవసరమైనప్పుడు సహాయపడనని 'అక్క' బెదిరిస్తుంది.

ఇంటినుంచి బైల్దేరిన అరగంటకో, గంటకో ఇంటికిజేరిన పిల్లని ఆ తల్లి "నిన్నే గొంతెమ్మ ఎత్తుకుపోయిందే" అనే కేకతో మొదలుపెట్టి, "ఏ జాముస ఎళ్ళా...... ఎప్పుడు డకెయ్యాలి. ఎప్పుడు మీ అయ్యకి తీసికెళ్ళాలి" అసి గద్దించి రెండు దరువుల్తో ఆపుతుంది.

ఆపిల్ల ఏడుస్తూ ఈ పిల్లల దగ్గరకొస్తుంది. మళ్ళీ మొదలు.

♦ ♦ ♦

సొరాజ్జెం పుట్టాక, పెరుగుతూ చాలా మంది మనుషుల్ని రకరకాలవాళ్ళని చూస్తూనేవుంట. కాని ఈ మధ్య దాని నోరు ఆశ్చర్యంతో మూతపడడం మానేసింది.

కాకి బట్టల్లో, కాలిబూట్లతో, ఎర్రటోపీల్తో, ఎర్ర కళ్ళతో, బుర్రమీసాల్తో, గిన్నెటోపీల్తో, లాఠీల్తో, తుపాకుల్తో,తూటాల్తో, కవాతుచేసుకుంటూ దడదడ చప్పుళ్ళతో త్వరత్వరగా వస్తూ పోతూ ఆవూరి వాతావరణాన్ని కొత్త గాలితో నింపేస్తున్నారు. వాళ్ళు ప్రభుత్వరక్షకభటులనీ, ప్రజల్ని భక్షించడంలో మహా చతురులనీ, పేరొందిన మలబార్ పోలీసులనీ సొరాజ్జానికి తెలీదు.

సొరాజ్జెం తనతోటి స్నేహితుల్తో, మట్టిలోనో, బురదలోనో పంది పిల్లల్తోనో, కుక్క పిల్లల్తోనో, మాదిగ మేరీ ఇంటిదగ్గరో, యాకోబు గుడిసె వెనకో ఆటలాడుకుంటున్న సమయంలో దూరంనించీ గుర్రాలడెక్కల చప్పుళ్ళలా అడుగులచప్పుళ్ళు దగ్గరవుతూండడం, గాలిధూళినిలేపితీసుకురావడంచూడగానే "మలబారాళ్ళు! పోలీసాళ్ళు" అనే హెచ్చరికల్తో ఆ వూరు

వాళ్ళంతా ఖాళీచేసి వెళ్ళిపోయారా అన్నట్టు నిశ్శబ్దం అయి పోతుంది.

సౌరాజ్జెంకూడా చిరుగుల గుడిశలోని ఓ చిన్న చిరుగు కంతలోంచీ భయపడుతున్న చిన్న కళ్ళతో, తత్తరపడుతున్న శ్వాసతో, జిడ్డోడుతున్న మొహంతో, ఆ మలబార్ పోలీసుల్ని చూస్తుండేది.

ఓ రోజు అర్ధరాత్రి సౌరాజ్జెం అకస్మాత్తుగా నిద్రలేచేసరికి గుడిసెంతానూ, గుడిసెముందూ,వూరంతా గోలగోలగా వుంది. గుడిసెలో ఆ టోపీలాళ్ళున్నారు. పెద్దపెద్ద కళ్ళుజేసి ఎంకడిని ఏంటో అడుగుతున్నారు. ఎంకడేమో "మాలముండా కొడుకుని, నాకేం తెలుసు దొరా! నాకుతెలవద్దొరా!" అని బతిమాలుతున్నాడు.

"ఈ లంజాకొడుకు ఇట్టెందుకు చెబుతాడండీ" అంటూ ఓ టోపీమనిషి కర్రబెట్టి ఎంకడి నెత్తిమీదొకటేశాడు.

సౌరాజ్జెం"అయ్యో!"అని బాఘరుమంది.పద్దాలు అప్పటికే ఓమూల నిలబడిఏడుస్తోంది.అప్పుడు బ్రహ్మంగారు ఆ గుంపులోంచీ లోనకొచ్చి "కొట్టమాకండి ఇనస్పెక్టరుగారూ. ఆడు మంచాడే. నేనడిగితే చెబుతాడుంతండి"అని ఎంకడివేపు తిరిగి "ఏరా, ఎంకా! సుబ్బారావు ఇందాక మాలపల్లెలోకే పారిపో యొచ్చాడు గందరా. చాలామంది చూశారు. ఎక్కడికెళ్ళాడో చెప్పరా. ఇనస్పెక్టరుగారు చాలా మంచాడు మనందర్నీ రక్షిస్తానికే వచ్చారు. నువ్వు చెప్తే నీకు బహుమతి కూడా ఇస్తాడు నీ ఫొటో పేపర్లో కూడా పడతంది..."

"చుబ్బారావు, చుబ్బారావని నన్నిట్టా పట్టించారేంటండీ. ఆ చుబ్బారావెవరో నాకేం తెలుత్తుంది."

"సుబ్బారావు తెలవకపోవటమేంటిరా, ఘాటూరు నించీ అప్పుడప్పుడు వచ్చేవాడుకాదూ సుబ్బారావూ, రామ్మూర్తీ, ఎంకయ్యా ఇంకెవరో ముగ్గురునలుగురు అప్పుడప్పుడూ మనూరొచ్చి రెండుమూడుసార్లు ఇక్కడ మీటింగులు కూడా చేశారు గదరా ? బుగ్గమీద మచ్చుంటంది. నీకు తెలవకపోవటం ఏంటి ? ఊళ్లో చిన్నపిల్లాణ్ణడిగినా చెబుతాడు."

"అట్టయితే, ఆళ్లనే అడగరాదుండే" అంది పద్దాలు.

"నువ్వు నోరుముయ్యవే. అవతల పెద్దాళ్ళతోపని నాకేం టిలే అని నేనవతలకెళితే అప్పుడు మొగుడూ పెళ్ళాల్ని గుద్ద

లూడదీయించి గుడిచుట్టూ తిప్పుతారు జాగ్రత్త. ఇన్నా. ఎల మర్రులో ఏం చేశారో...

“అయ్యన్నీ మాకెందుకు తెగండి బెమ్మంగారో! నిజంగా నాకేమీతెలవదుండే నీకుతెలవందేవుంది సెప్పండి. నేనుపార్టీ లెంటా, ఆంటెటా తిరిగేవాణ్ణా!...నేనసలు చూళ్ళా నేన్నిద్దరో ళ్లాంటి లేపి నన్నడిగితే నాకేం తెలుస్తుందండే. నువ్వే దిక్కు. నన్నూ, నా ఆలుబిడ్డల్ని రచ్చించాల” అంటూ బ్రహ్మంగారి కాళ్ళు పట్టుకున్నంత పన్జేశాడు ఎంకడు.

సారాజ్జెం అప్పటికే ‘అయ్య’ దగ్గరజేరి కాళ్ళకి అడ్డం పడుతూ బ్రహ్మంగారొంకా, పోలీసులెంకా బిక్కమొగమేసుకు చూస్తోంది. బ్రహ్మంగారికి బ్రహ్మాండమైన ఆలోచనవచ్చింది గబుక్కున సారాజ్జాన్ని లాగిపట్టుకుని, “దీని మీద వొట్టె య్యరా—‘నాకు తెలవదూ. నేను సుబ్బారావుని చూళ్ళేదని’—అన్నాడు.

‘నిజం దొరా. నాపిల్లదానిమీద ఒట్టు. నేను అసలికే చూళ్ళేద్దొరా” అన్నాడు ఎంకడు.

“సరే అయితే...సుబ్బారావుని రేపీపాటికి నేను పట్టిత్తా రండి ఇనస్పెక్టరుగారూ” అన్నాడు బ్రహ్మంగారు.

అంతా వెళ్ళిపోయారు.

తర్వాత ఎక్కువరోజులు గడవకుండానే బ్రహ్మం అన్న ప్రకారమే పోలీసులకి సుబ్బారావుని చూపించాడు. ఎంత లొంగిపొమ్మన్నా లొంగిపోని సుబ్బారావుని బైనకోడు గట్టు మీద చేలల్లో పోలీసులంతాకలిసి తుపాకుల్తో పేల్చి చంపేసి లొంగగొట్టుకున్నారు. ఊరు, ఊరంతా అవాక్కై చూసింది.

సుబ్బారావుగారిని...పేదప్రజల కష్టాలూ, కన్నీళ్లూ తుడి చెయ్యాలి- అని కలలుగన్న సుబ్బారావుగారిని...కాటూరులో ఎలమర్రులో జరిగిన అన్యాయాలకి, అత్యాచారాలకీ కలవర పడిపోయి, కృతనిశ్చయంతో పేదప్రజల పక్షాన నిలవడానికి నిర్ణయించుకున్న సుబ్బారావుగారిని... తెలంగాణాలో జరుగు తున్న పోరాటం, దానిలో ప్రజలు చూపిస్తున్న చైతన్యం, ప్రజలు పడుతున్న బాధలు—అన్నిటికీ కదిలిపోయి తనూ, తన మిత్రులూ కల్సి ‘వీర తెలంగాణా పోరాటనిధి’ వసూలుచేస్తూ వూరూరూ తిరుగుతూ ప్రజల్ని మేల్కొలుపుతూ. చైతన్యవం తుల్ని చేస్తూ, తన ఆస్తిపాస్తుల్ని మొత్తం అమ్మేసి నిధికిచ్చేసి,

భార్యా పిల్లలు పోలీసుల కబంధహస్తాల్లో నలిగిపోతున్నా వెన్నుచూపక తన జీవితాన్నే ప్రజలకు అంకితంచేసిన సుబ్బారావుగారిని... పోలీసులు కాల్చేస్తోంటే...... వూరువూరంతా నిలబడి కళ్ళనీళ్ళతో చూసింది. సొరాజ్జెమూ చూసింది.

ఉన్నట్టుండి ఒక రోజు పొద్దున్నే బ్రహ్మం మళ్ళీ మాలపల్లి మీదకొచ్చేశాడుపరివారంతో. సొరాజ్జెం పుట్టినప్పటిలానే, మళ్ళీ మైకులూ, రికార్డులూ వూరిలో కలకలాన్ని పుట్టించింది.

బ్రహ్మం పరిస్థితి ఇప్పుడు మరీ బాగయ్యింది. కాణీఖర్చవ్వకుండా అతనిపొలం సాగవుతోంది. 'నారు' నుంచీ కుప్పనూర్పిళ్ళవరకూ! అతనింటిదగ్గర ముగ్గురు నలుగురు వెట్టివాళ్ళు ఎప్పుడూ వుంటారు చాకిరీ కోసం

ఊళ్ళో అతనంటే వున్నభయం, అసహ్యం ఇంక ఎవరన్నాలేవు. అతను గొప్ప దేశభక్తుడయ్యాడు. ఆ ముక్క ఆ మధ్య ఎవరో పేపర్లోకూడా అన్నారు.

ఇప్పుడు అర్జంటుగానూ, ఆదరాబాదరాగానూ మాల పల్లెలోకి అడుగెట్టిన బ్రహ్మం ఎంకడి ఇంటికేసి నడిచాడు.

ఎంకడింటిముందు వుడతలు కొట్టేసిన తాటిపండులా తల కాయ పెట్టుకొని వొంటిమీద అల్యూమినియం సిగ్గుబిళ్ళతప్ప నూలుపోగు లేకుండా సొరాజ్జెం సొతంత్రంగా బజార్ల వెంట పచార్లుచేస్తోంది. దాన్నిచూడగానే బ్రహ్మం మొహం చిట్లించి అనుచరులకేసి తిరిగి "ఎవరది" అన్నాడు.

వెనుకనుంచీ ఎవరో "అదేనండీ! సొరాజ్జెం" అన్నారు.

"సొరాజ్జమా! నేను గుర్తే పట్టలేదే" అన్నాడు బ్రహ్మం.

"అవున్లెండి. మనం గుర్తుపట్టలేం. అదెట్టా తిరుగుతోందో చూడండి" అన్నారెవరో.

ఎందుకంటున్నాడో, ఎవర్నుద్దేశించి అంటున్నాడో తెలియకుండా బ్రహ్మం "తప్పు! అది పిల్లముండ! దానికేం తెలుసు మర్యాదా, మన్ననా!... నిన్నటిదాకా మనల్ని తెల్లోడు దోచుకున్నాడు. ఇవ్వాళ? ఇవ్వాళ మనల్నిమనమే... ఆ... "అని ఆలోచనలో పడ్డాడు. ఆలోచనల్లోంచీ లేచి "...అందువల్ల ఏమిటి? మనది మనమే దోచుకుంటున్నామన్నమాట. దోచుకోవడమంటే దోచుకోవటం కాదు, దాచుకోవటం. అంటే— మనం కష్టపెడతాం...అదే పెడతాం అంటే పెడతాం కాదు

పడతాం. మనమే సుకపడతాం. అందువల్ల... పుసేపద్దాలూ..." అని లేడిపిల్లని చూసిన మృగరాజులా గర్జించి, "దానికో చొక్కా ఏసి తలదువ్వి ఇటు తీసుకురా. దీనితో ఇప్పుడు నేను మన జాతీయ జండా వందనం చేయించుతా" అన్నాడు.

పద్దాలు ఆనందం అంచులు దాటింది. కుక్కలు చింపిన చొక్కా ఏంచెయ్యాలో తెలవక పద్దాలుకిచ్చింది ఓ దొరసాని. అది సొరాజ్జానికి ఎరువుపెట్టినట్టుగానే వున్నా, సరిపోయిందిలే అనుకుని తొడిగి తలగోళ్ళతో వెనక్కి దువ్వి చంకనేసుకు బైల్దేరింది, సంతోషంతో పొంగిపోతూ!

తిరపతి ఆదరా, బాదరా పరిగెత్తుకొచ్చాడు. "సొరాజ్జాన్ని ఆళ్ళకియ్యమాక. ఆళ్ళంతాదొంగనాయాళ్ళు. అప్పుడుసుబ్బారావుగారిని చంపించలా ?"

"ఏనాటి సంగతిరా. ఇప్పుడెందుకురా" అంది పద్దాలు తెల్లబోతూ.

"ఏనాటిదేంటి. మొన్న తొలకరికి రొండేళ్ళేగా. అప్పట్నుంచీ మా జీతగాళ్ళం ఎవరమూ మాట్టాడం అడితో."

"వుప్పుడు సొరాజ్జాన్ని తీసుకురమ్మని కబురెట్టాడుగందరా."

"అందుకే వద్దనేది"

"ఎందుకు పంపవంటే ఏమనేదిరా ?"

"సుబ్బారావుగోరిని సంపావుగదా అను"

అప్పటి దాకా చేతుల్తో కాళ్ళు రుద్దుకుంటూ, చతికిలబడి కూచున్న ఎంకడు "అట్టంటే ఆయనకీ నీకూ సంబంధం యేంటని మళ్ళీ మలబారాళ్ళని పిలుత్తాడురో ఈడో...అసుమంటి పిచ్చిపనులు సెయ్యమాకండి. మన్దేం పోయిందిలే. రోజూ వత్తాడా, రోజూ సేత్తాడా యీ జెండా వొందనం. సమ్మచ్చరానికో, పదిసమ్మచ్చరాలకో. తీసుకుపోవే. ఈడు సెప్పేది నిజవే గానీ బెమ్మం వూరుకోడు. మా కాని మనిషి. మనమిట్టా అనుకుంటున్నామని తెలిసినా బొక్కలోకి తోయిత్తాడు" అన్నాడు.

పద్దాలు గబగబా సొరాజ్జెం ముక్కుపిండి చీరకి రాసుకుంటూ దాన్ని తీసుకుపోయి బెమ్మంగారి ముందుకాళ్ళ దగ్గర వదిలింది.

"బ్రహ్మంగారు" జండా ఎగరేస్తూ సొరాజ్జాన్ని ఎత్తుకుని దాని చేతిలో ఆ జెండా తాడు పట్టించాడు. సొరాజ్జెం జండా తాడు పట్టుకుని వదలమన్నావదలక కాసేపు గడబిడచేసింది.

దాని పిర్రమీద పక్కనున్న మరొకాయన ఒకటి తగిలించిందాకా.

✦ ✦ ✦

తల్లివెంటేపడి "నానూ వత్తానే ఒలమ్మా" అని రాగాలు తీస్తోంది సొరాజ్జెం.

వద్దని చెప్పి, తిట్టి, కొట్టి, చివరికి పద్దాలు కూతుర్ని వెన కాల రానిచ్చింది

సొరాజ్జెం కొన్ని రోజులు తల్లిచేసే పని గమనించింది. అంతే ఎలాగైనా సొరాజ్జానిది చురుకైనబుర్ర గేదెలు ఈగల్ని కొట్టుకోడానికి తోకల్లేపినా "ఒలమ్మా ఈ గీదసూడే...ఏత్తాంది.. ఏత్తాంది" అని గీపెట్టేది. తల్లి ఏ గేదెనకనుంచో పరిగెత్తుకొచ్చి చూసి, పిల్లని రెండుచ్చుకుని మళ్ళీ వెళ్ళేది.

రానురానూ సొరాజ్జం తల్లివెంట వెళ్ళడంమానేసి, తండ్రి వెంట పడ్డం మొదలెట్టింది.

ఎంకడు పొయ్యిలోకి కంప కొట్టుకొస్తానని మూల్లంక బైల్దేరితే నేనూ వత్తానని బైల్దేరింది సొరాజ్జెం.

"...శానాదూరం పోవాలమ్మా. ఈపాలొద్దువుగాన్లే" అన్నాడెంకడు.

"ఊ, ఊ... నేనొత్తా"

"శానాదూరమే..."

"నడుత్తా... ఎత్తుకొమ్మని అడగను"

"ఎండమండిపోతాందే...ఈపాలి నల్లమాటేళెళ్దాం. అప్పుడొద్దూగాని..."

"ఊ.ఊ...నాకే...నేనొత్తా"

"సరే, పా! ..నడవనంటే అక్కడే వొదిలేత్తాలే"

తండ్రీ కూతుళ్ళిద్దరూ ఆ మిటమిటలాడేవేళ మూల్లంకకి బైల్దేరారు- నడివేసవికాలం. గూబలుగుయ్యిమనేట్టు కొడుతోంది వడగాలుపు. దోవంతా- పశువులూ,బళ్ళూ,మనుషులూ తొక్కి తొక్కి-పిండిలాంటి దుమ్ముతోనిండి కాలేస్తే సర్రున సెగపాళాని కంటేట్టు కాలిపోతోంది. తండ్రికన్నా ముందునడవాలని సొరాజ్జెం ఆ దోవెంటే ముందుకు పరిగెత్తింది.

ఎదురుగా వొస్తున్న అనమయ్యని అయోమయంగాచూస్తూ ఆగిపోయింది. అవునుమరి. అనమయ్యంటే మామూలుమనిషి కాదు. ఏడడుగుల ఎత్తూ, ఎత్తుకితగ్గ లావు, చెవులు చేటల్లాగా వుండి మనిషిని చూడగానే భయం పుట్టుకొస్తుంది.

అనమయ్య ఏ కళనున్నాడో "ఎవరమ్మాయివే" అన్నాడు అనమయ్య మాట్లాడితే మామూలు మనుషులు పదిమంది ఒకే సారి కలిసి మాట్లాడినట్టుంటుంది.

ఆ ప్రశ్నవినగానే సొరాజ్జెం దిక్కుతోచనిదానిలాగా అయి పోయింది బిక్కమొగమేసింది.

"ఎవళ్ళమ్మాయివే" అనిగట్టిగా అడిగాడు అనమయ్య అన మయ్య గట్టిగా అడగడం అంటే వందమంది కలిసి ఒకేసారి మాట్లాడినట్టు.

గావురుమంది సొరాజ్జెం.

"ఒసి నీ తల్లి సిగదరగా, ఎవళ్ళమ్మాయివే అంటే ఏడుత్తుం దేరాయిదీ?" అన్నాడు అనమయ్య అప్పుడే అక్కడికొచ్చిన ఎంకడితో.

"నా కూతురేనుండే" అన్నాడు ఎంకడు.

"నీకూతురా? మరి సెప్పిసావదే!"

"పిల్లముండ కదండీ...తవర్ని చూసి జడుసుకుంటాంది లెగండి"

"ఊఁ" అని ఏదో ఆలోచనగా కదిలాడు అనమయ్య.

కూతురితో "ఎవరమ్మాయివే అంటే ఏడుత్తావెందుకే ఎర్రి మొకమా. పలానాళ్ళమ్మాయినని సెప్పాలిగానీ..." అన్నాడు ఎంకడు.

బుర్రూపింది సొరాజ్జెం, కళ్ళు తుడుచుకుంటూ.

మళ్ళ మొదలైంది ముల్లంకకీ మహాప్రస్థానం. తెలగయ్య గారి చేలదగ్గరదాకా వెళ్ళేసరికి పళ్ళ బిగువున నడుస్తున్న సొరాజ్జెం "అయ్యా" అంది.

ఎంకడేలోకానున్నాడో దానెంక తిరిగి దాని మొహం చూశాడు. సొరాజ్జెం ఎండలో వేగినట్టుగా తయారయింది. మొహం మాడిపోయింది.

"ఎర్రిముండా... రావొద్దేఅంటే కాదుకూడదన్నావుగా..." అని రెండు చేతుల్తోనూ పిల్లని పైకెత్తి మెడలమీద కూర్చో పెట్టుకున్నాడు. తండ్రి జుట్టు పట్టుకుని, మెడమీదనించీ అటో కాలూ, ఇటో కాలూవేసి కూచుంది సొరాజ్జెం. కూతురిపాదాలు రెండూ పట్టుకుని ఎంకడు నడక సాగించాడు.

ముల్లంక చేరారు.

తుమ్మా, సీమతుమ్మా, రేగు, జువ్వి, రావి, నేరేడూ, మారేడూ,

గంగరావీ, తాటీ చెట్లతో అదో పెద్ద అడవిలా వుంది.

ఎంకడు సొరాజ్జాన్ని దింపి "నాసేపు పడుకో. నేనుకూడా నడుం వాలుత్తా. లెచింతర్వాత నీకు ముంజికాయలు కొట్టిత్తా" అని గడ్డిమీద నడుం వాల్చాడు.

"అయ్యా, సీమతుమ్మ కాయలే" అంది సొరాజ్జెం అటు చూస్తూ. అంటూనే, "అబ్బా! ఎంత లడ్డాలో" అని అటు పరిగెత్తింది. సీమతుమ్మకాయలు సొరాజ్జానికూ్కడా చేతికందే ట్టుగా వేళ్ళాడుతున్నాయి, ఎర్రగా పండి.

"అయ్యెక్కువ తినమాక. రోగమొత్తంది. ఇదిగో... అట్టా పరుగులు తియ్యమాక. ముళ్ళుంటయ్. పురుగూ, పుట్రా ఉం టయ్. అంతా అడివే. పిన్నిముండా, యిక్కడికిరా! కూసో, నాసేపు... బుద్దిగా వుంటేనే నిన్ను మళ్ళి ఎప్పుడన్నా తీసు కొత్తా... ఇంటన్నావా" అన్నాడు ఎంకడు.

ఏంవినటం! అన్నిరకాల పిట్టలు, అన్నిరకాల చెట్లు, అన్నింటికన్నా అలా చేతికందే లడ్డాలు. ఇటూ, అటూ పరు గులు తీస్తూ మహాసందడిగా కంగారుపడిపోతోంది సొరాజ్జెం. కాల్లో తుమ్మ ముల్లు కసుక్కున దిగనే దిగింది. "అయ్యో!" అని ఒక వెర్రి కేకేసింది.

ఏ పాము కరిచిందో అని హడలిపోయాడు ఎంకడు.

సొరాజ్జెం ఒంటికాలిమీద నిలబడలేక కూలబడిపోయింది.

దుమ్ముకొట్టుకున్న ఆ చిన్నిపాదాన్ని ఎంకడు ఒళ్ళోపెట్టు కుని తన మొరటు చేతుల్తో జీవితంలో చేసిన శ్రమకు గుర్తు లుగా కాయలు కాచిన చేతుల్తో, సులు సూత్రంగా ఆ ముల్లు పైటికి లాగాడు రక్తం బొట్లు చెమరుస్తోంటే గట్టిగా తుడిచి వుమ్మురాసి రుద్దాడు.

తరవాత అక్కడేదో ఆకు నంపాయించి పసరు పిండి కాస్త ఆకు కాలికి పెట్టి గడ్డిపరకల్తో కట్టు గట్టాడు

"కూసోమంటే యినావా?... ఊహుఁ... నీకసలు నా మాటినబడితేనా... అందుకే రావొద్దన్నా. నువ్వెందుకింటా. వుప్పుడు సూడు. ఎంతలోతు దిగిందో ముల్లు ఇంకన్నా కదల కుండా కూచో..." అని సొరాజ్జాన్ని ఎత్తుకెళ్ళి యింకో చెట్టు కింద కూర్చోపెట్టాడు.

పొద్దు వాటారింది. దూరంగా వూళ్ళోనించీ 'కరిమెర్ల' వేపు నించీ బళ్ళొస్తున్నట్టు, ఎద్దులమెళ్ళో గంటలు గణగణమంటు న్నాయి పనుల్లోకి బైల్దేరుతున్నట్టు.

కాస్త ఎండ చల్లబడిందేమో పొలాల్లోకి పెంటతోలుకుం టున్నారు రైతులు.

కొడవలుచ్చుకుని ముళ్ళకంప వెలుగుతున్నాడు ఎంకడు.

"అయ్యోయ్" అని కేకేసింది సొరాజ్జెం. కుంటు కుంటూ నడవబోయింది.

"నడమ్మాక. నెత్తురొత్తంది"

"కాదే... సెప్పు లేసుకున్నావే... కాదే బూడుసులు... అక్కడ దొరికినయ్యే" అని మురిసిపోతోంది సొరాజ్జెం కాళ్ళు చూసుకుంటూ.

సొరాజ్జం కాళ్ళెంక చూశాడు ఎంకడు. ఎరుపూ, తెలుపూ కలిసిన తాటి జీబులు రెండు కాళ్ళకి చెప్పుల్లా తొడుక్కుని యీడుస్తూ తిరుగుతోంది సొరాజ్జెం.

"వుసే, పిచ్చిముండా! తేళ్ళుంటయ్యే అటిల్లో. సూసితొడు క్కున్నా?" అని కంగారుగా అడిగాడు ఎంకడు.

"లేవ్‌లే" అంది సొరాజ్జెం.

కాసేపటూ, ఇటూ తిరిగింది కుంటుతూవే.

తర్వాతనెమ్మదిగా మళ్ళీ తండ్రిదగ్గరకువేరి "నాకు నిజం సెప్పులు కుట్టించవేమే" అంది.

"యిప్పుడెందుకే?"

"ఆఁ. కాళ్ళు కాలవ్, సెప్పులు తొడుక్కుంటే......రోజూ నీయమ్మటొత్తా"

"హొచ్చేం చేత్తావ్?"

"ముళ్ళకంపేరతా"

"నాతల్లే...కుట్టిచ్చుకుందువుగానిలే..."

"ఊ! నా కిప్పుడే కావాలి"

"వుప్పుడెక్కణ్ణించొత్తయ్? మొబ్బులోంచి వూడిపడతయ్యా ఇంటికెళ్ళినతర్వాత మాదిగ మేరీతమ్ముడు లేడూ, అడితో వెబు తాలే... నిన్నుకూడా తీసికెళతా...ఆదివ్వాలిగా... సరేనా?"

"ఊఁ " అని రాగం తీస్తూనేవుంది సొరాజ్జెం

చిన్న మోపుకట్టాడు కంపంతా, ఎంకడు. నెత్తికెత్తుకున్నాడు.

"నడుత్తావా?"

"ఆ"

సొరాజ్జెంవెయ్యొకటి అందిపుచ్చుకుని నెమ్మదిగా అడుగు సారించాడు. సొరాజ్జెం ఓ తాడిచెట్టు సూసి "అయ్యా! ముంజి కాయలు కోసిత్తానన్నావ్‌గా" అంది.

మోపు దింపాడు ఎంకడు.

తలపైకెత్తి తాటికాయల వంక చూసి "ఇయ్యి మరీ ముదురైపోయినియ్యి" అని మరో చెట్టుకింద కెళ్ళాడు. "ఇయ్యిమంచి అదునులో వుండయ్" అనుకుని తుండుగుడ్డ మెలేసి కాళ్ళకి బంధం కట్టుకుని, కొడవలి పళ్ళతో గట్టిగాపట్టుకుని చెరచెరా చెట్టెక్కాడు. పైనుంచి కేకేశాడు-"దూరంగా ఎళ్ళు అవతలికి అదిగో ఆ చెట్టుకిందకి..."

సౌరాజ్జెం దూరంగా నుంచుని తాటిచెట్టెంక చూస్తోంది.

ఎంకడు పరాపరా రెండు చిన్న గెలలు కోశాడు. గెలలు కింద పడీ పడకముందే కాయలు 'చట్' 'చట్'న ఎడా పెడా పరిగేత్తినయ్ గెలలనించి వూడి.

బర్ర్‌న కిందకి జారాడు ఎంకడు. దిగి సౌరాజ్జెం అప్పటికే పోగెయ్యగా మిగిలిన కాయలు పోగేసి చకచకా ముంజెలు కనబడేలా కోసి "గబగబా తిను...నీళ్ళు పోనియ్యమాక. ఇంద ఇయ్యి తాగు..." అంటూ చిట్టిచిట్టి కాయలు అందించాడు.

తనూ గబగబా నాలుగైదు కాయల్లో ముంజెలుతిని "యిక, పా!" అన్నాడు.

"ఇంటికి తీసికెల్దామే..."

"సరే ఆ రొండూ పుచ్చుకో" అని రెండు కాయలకి 'ముచ్చెలు' పైకిలేపితీగలుకట్టి చేతికిపట్టుకోటానికి అమిరేట్లుగా యిచ్చాడు.

"ఇది అమ్మకి, ఇది అన్నయ్యకి" అంది సౌరాజ్జెం వాటిని పుచ్చుకుని.

"మరి నీకూ..."

"నేను తిన్నాగా..."

ఊరువేపు నడుస్తున్నారు, అనమయ్య మళ్ళీ ఎదురయ్యాడు

"ఏరా ఎంకా. ఏమంటాందిరా నీకూతురు" పదిగొంతుల్తో ప్రశ్నించాడు.

"ఇప్పుడడుగు దొరా, ఎట్టాసెపుతుందో సూడండి"

"ఏమే..."అన్నాడు అనమయ్య.

"బయపడమాక... ఏదడిగితే అది సెప్పు"— అన్నాడు ఎంకడు

"ఎవళమ్మాయివే" అన్నాడు అనమయ్య నవ్వుతూ.

"పలానా ఆళ్ళమ్మాయిని" అంది సౌరాజ్జెం ధీమాగా.

"ఎవళమ్మాయివి ?" అన్నాడు పాతిగ్గొంతుల్తో.

"పలానాళ్ళమ్మాయినండే" అంది గట్టిగా.

ఎంకడు మోపు కిందబడేసి పొట్టపట్టుకున్నాడు. "దీని దుంపతెగ! ఎవళన్న అడిగితే, పలానాళ్ళమ్మాయినని సెప్పాలన్నానుండే"

అనమయ్య వెయ్యి గొంతుల్తో నవ్వాడు.

ఊరు చేరేసరికి చీకటి కమ్ముకొస్తోంది. అమరయ్య ఎదురయ్యాడు వంతెన దగ్గర.

"ఎవడ్రాడూ ?" అన్నాడు. వినకుండానే.

"ఎక్కడ్డిరాకంపా ?" అన్నాడు.

"మూల్లం౦లోదుండే... అంతా ముళ్ళకంపుండే..."

"ఊ... తాటికాయలెవరయ్‌రా?"

"మాయే" అంది సొరాజ్జెం కాయలు వెనక్కి పెట్టుకుంటూ.

"ఈ ముండ నీ కూతురెరా?"

"అవున్దొరా..."

"రాలు గాయిలాగుందే"

"తవురిదయుండే..."

"ఎవరి చెట్టుయ్‌రా?"

"తమురుయ్ గాదుండే"

"ఎవరయ్‌రా లంజాకొడకా నాయైతే ఎముకల్లో సున్నం లేకుండా కుమలబొడవనూ". అమరయ్య మొహంమీద నవ్వు వెలుగుతూనే వుంది.

"తాటికాయలకే అంతంత మాటలెందుకుదొరా... మీరే అట్టంటే మాలముండా కొడుకులం యేవైపోవాలింక..."

"మాటలకే నీవాళ్ళు సిలడిందేంటిగానీ... మా చెట్లయ్ కొట్టమాకంర్డా. మద్రాసు నుంచీ మా అల్లుడు పిల్లలు వొత్తన్నామని రాశారు. అళ్ళొచ్చేసరికి కాయల్లేకపోతే నేనూరుమీద పడాలి..."

"నాకు తెలవదేంటుండే. అయినా మన గంగానమ్మ తాటియిరగ్గాసిందలెగుండే. దాన్నెక్కే వోపిక మాత్తరం యెవడికేడిసింది. ఏదోపిల్లముండేదుత్తాందని అయిదుకాయిలున్న వొక్కగెలే కోశానుండే అది కూడా మనూరిది కాదులెగండి. కరిమెల్లాళ్ళది.

"సరే, పో"

"ఎక్కడికుండే. సీకటేళ యెల్తన్నారు?"

"ఇక్కడికేరా...రోడ్డుకి"

"వత్తా దొరా"

"అఁ. పద"

ఇంటికొచ్చేసరికి పద్దాలు ఎక్కడెక్కడో చేలంట తిరిగి తిరిగి వొచ్చిందప్పుడే.

వొణ్ణం వొండుదామంటే ఒక్క సుక్క నీళ్ళు లేవు. ఆ మోపక్కడ పడేసి గబుక్కున కావిడేసుకుని రొండు కావిళ్ళు తెచ్చిపడెయ్యి, నేను సావలేనుగాని యియ్యాల్టికి" అనిరాగాలు తీసింది.

మోపుకిందపడేసి విసుక్కున్నాడు ఎంకడు.

"పోనీ, ఒక్క కావిడే తెచ్చిపొయ్యి" వొణ్ణవయ్యేదాకా నిన్ను లేపన్నే"

"సర్లే ఆ కుండలిట్టా తగలెయ్యి" అని ఎంకడు కావిడి వుట్లు సరిజూచుకుని, కావిడేసుకుని బయల్దేరాడు.

తెల్లగా వెన్నెలొచ్చింది—మాలపల్లెక్కూడా! వెన్నెల ఆకాశం మీద నించొచ్చేది కాబట్టిగానీ, లేకపోతే దొరలు మాల పల్లికి వెన్నెల రానిచ్చేవారు కారేమో!

మాలపిల్లలందరూ "వెన్నెల్లో "వెన్నెలా, నీడ" ఆటలాడుకుంటున్నారు.

సొరాజ్జెమూ, బోడిదీ, దాని తమ్ముడు సంకురాత్తిరిగాడూ మిగతా పిల్లలూ గోలగోల చేస్తూ ఆడుకుంటున్నారు వెన్నెల్లో.

బోడివానితల్లి పిలిస్తే వాళ్ళెళ్ళిపోయారు. సొరాజ్జెంకూడా గుడిశకొచ్చింది. పొయ్యిదగ్గర గొంతుకూర్చుని కుతకుత ఉడుకుతున్న అన్నంవంక చూస్తూన్న తల్లిపక్క కూచుని తల్లి వొళ్ళో తలపెట్టి, "అమ్మా రోజూ యెన్నెల రాదేమే"

"రోజూ వత్తదంటే ఎక్కడన్నా?"

"యా, ఎందుకురాదూ?"

"రాదంతే. కొన్నాళ్ళు ఎన్నెలా, కొన్నాళ్ళు సీకటీ అన్నారు పెద్దోళ్ళు. మనిస్టవేంటి?"

సొరాజ్జెం తెల్లబోయి చూసింది.-"రోజూవొత్తే బాగుంటదే" అని గునిసింది.

"నీ మొకంలే. పున్నవ రోజుల్లో ఎన్నెలొత్తది, అమావ రోజుల్లో సీకటొత్తది. అంతేగానీ..."

అంతలో రత్తొచ్చింది.

"పెద్దక్కా! రెండెండి మిరపకాయలుంటే యిత్తా?"

"సూత్తనుండు" అని "వుండవే" అని సౌరాజ్జాన్ని వొళ్ళో నించి లేపి, లోనకెళ్ళి నాలుగ్గాయలు తచ్చిచ్చి "నీ అత్త ముసిల్ది లేత్తాందా?" అని పరామర్శించింది పెద్దాలు.

"ఆఁలేసినట్టే. యేంలేతఁంది, నాబొందా, దానిబొందానూ"

"వొంటో ఏమన్నా వోపికుందా?"

"వోపిక లెక్కట్టుంచొత్తయ్. పద్నాలుగుమందినికని పడేసింది భూమ్మీద. అందరూ బతకలేదుగాని. యేణ్ణాల్లుగ దారకవేఁలేదు. ఆనపటాలకి తీసికెల్దారంటే తిండానికి కటకటగా వుంటే, ఇంక ఆ డాకటరికేమివ్వాలి, మొందు లేవెట్టి కొనాలి. అక్కడికి మంగలి డాట్టర్తో నాలుగు బిళ్ళలిప్పిచ్చాడు నీ మరిది. అద్దగ్గి సచ్చేదిగాదు..."

"నిజమేలే. నూకలు మట్టమయ్యాకింకెట్టా బతుకుతుంది. అదియ్యాల రేపు మనం. అంతా అకాటికి పోవాల్సినాళ్ళమే. నాల్నాళ్ళు అటూ, యిటూ ఇది బతికిసచ్చేదిగాదు..."

"అంతే, అంతే... వొత్తానక్కా" అని రత్తివెళ్ళిపోయింది.

పిండారబోసినట్టున్న వెన్నెల్లో ఎంకడు చాపమీద పడుకున్నాడు. ఇటూ, అటూ దొర్లుతూ. "అమ్మా సౌరాజ్జెం. కాత్తి ఈపు గోకమ్మా. తెగ దురదెడతాంది" అని బోర్లా తిరిగాడు.

సౌరాజ్జెం ఎంకడి పక్కనే వెల్లికిలా పడుకుని మబ్బుల వైపునుంచి తొరతొరగా పరుగులు తీస్తున్నచందమామని చూస్తోంది.

"అయ్యా! సందమామెక్కడుంటందే?"

"అమ్మా... వుసే... కాత్తీపు గోకమ్మా"

సౌరాజ్జెం తండ్రి వంక తిరిగింది. ఎంకడి శరీరమంతా నల్లగావుండి పేలినచోటల్లా తెల్లతెల్లగా వుంది. సౌరాజ్జెంచిన్న చిన్న చేతుల్తో ఎంకడి వీపుమీద నవరద్దియ్యడం మొదలెట్టింది

"గోళ్ళతో గోకమ్మా"

సౌరాజ్జెం గోళ్ళతో ఒక బరుకు బరికేసరికి గోళ్ళ నిండా మట్టినిండింది. బొటనవేలితో మిగతా వేళ్ళమట్టీ,మధ్యవేలితో బొటనవేలి మట్టీ తీసేసుకుంది.

"గోకూ..."

"...ఈపంతామట్టే"

"మరి మట్టిపిసుక్కునే అళ్ళు ఒంటికె మట్టిగాక బంగార ముంటుందేవేఁ" అంది పద్దాలు లోపల్నుంచొస్తూ.

"వొచ్చా! రా, ఇట్టా కూకుని బాగాగోకు. పిల్లముండకి చెత్తి లేదు" అన్నాడెంకడు.

"ఊఁ, పట్టు" అని పద్దాలు ఎంకడి తాటంతా వూడదీ సేట్టు పరపరా గోకి, "ఏంవుక్క? ఏంవుక్క? ఎన్నడూ ఎరగ వమ్మా యింతవుక్క" అని, "కాసేపొడ్డిగిలతా. రేపొద్దునే రాముడమ్మగారమ్మంది" అని చాపమీద తలపెట్టి నేలమీద పడుకొంది

"ఎందుకు?"

"ఎందుకేంటీ? ఎల్లుండిగావాకటాలెల్లుండేగా సోవయ్య గారి పెద్దినం"

"అవటాలెల్లుండేనా?..యేంటోమారాజు సేతికి ఎవీఁకలేదు

"అఁ... లేదు, లేదు. చచ్చినాడి కళ్ళు చారిడేసి అన్నా డంట ఎనకడికెవడో... ఆడాళ్ళని మాకారాడేవాడు"

"ఆ. ఆడాళ్ళని కారాడని మొగాళ్ళెక్కడుంటార్లే"

"సిగ్గులేఁపోతేసరి. అయనెన్నెనకేసుకొత్తన్నావ్!"

"ఊఁ...అమ్మ...యేంటో, వొళ్ళంతా కుమలబొడిచినట్టే నవుల్తాంది...సొరాజ్జెం నిదరోతన్నావా?"

"లేదే అయ్యా!"

"నా కర్రపట్టుకుని కాత్తి కాళ్ళుతొక్కమ్మా"

"అ ఏ, పిల్లముండ పడుతంది... అయ్యో తగ్గుతుయ్యాలే, వొక్కసారికు తీత్తే" అంది పద్దాలు సక్కకి తిరిగి పడుకుంటూ.

"పడనే...కర్రట్టుకుంటాగా...వొత్తన్నానుండవే అయ్యా!"

కర్రపుచ్చుకుని సొరాజ్జెం నెమ్మదిగా ఎంకడి కాళ్ళమీద కెక్కి, రెండుకాళ్ళమీదా నడవటం మొదలెట్టింది.

"అమ్మ... యెనక్కాళ్ళు... యెనక్క...అఁ... అక్కడే... తొక్కు...బాగా...అఁ..."

సొరాజ్జెం ఎంకడి కాళ్ళ మీద ఎగురుతూ ఆలోచిస్తోంది.

"అయ్యా"

"యేంటే"

"సచ్చిపోయినోళ్ళెక్కడుంటారే?"

"ఆ సంగతిప్పుడెందుకే నీకు? నరకానికో సొరగానికో పోతారు"

"కాల్చుత్తారన్నావుగా, ఎట్టాపోతారు?"

"కాలిచేసినా పోతారు. పోవటంఅంటే ఈ శరీళంతో కాదు లోన జోతుంటుంది. అది పోతంద. అయ్యన్నీ నీకిప్పుడు తెలవదులే. పెద్దయినాక తెలుత్తుంది"

"నీకు తెలుత్తుందా?" అంది పద్దాలు ఎక్కిరింతగా.

"ఆ తెలవకేం?"

"సోవయ్యగోరు ఎక్కడికెళ్తాడేంటి?"

"సోవయ్యగోరు సొరగానికే"

"ఆఁ. ఎల్లకేం ? ఈ పాటికి నరకంలో కుమల బొడుత్తా వుంటారు" అంది పద్దాలు కచ్చిగా.

"కాదు,కాదు. సొరగానికేపోతాడామారాజు. ఎన్నిపూజలు సేయించాడు! అయ్యన్నీ రుదాగా పోతయ్యా? నీకేం తెలుత్తుంది, నీ మొకం"

"ఆ! నీకే తెలుత్తుందిలే. ముగ్గురు పెళ్ళాల్ని మొందెట్టి సంపాడంటారు తెలుసా ?"

"ఆయన పెళ్ళాల్ని ఆయనేవన్నా చేసుకుంటాడు. దానికి దీనికి ఏం సంబందంలేదు."

"ఎందుకనంటా ?" అంది పద్దాలు వెటకారంగా.

"బేంబడి పుటకమరి"

"దేవుడికందరూ సమానమే నంటగా ?"

"అందరూ సమానమేంటి? ఎంత సమానమైనా బేంబళ్ళు దారివేరు"

సొరాజ్జెం తంద్రి కాళ్ళు తొక్కడం ఆపి పడుకుంది.

ఆకాశంలో చందమామ పరుగులు మానలా ! మేఘాల్తో పరుగులాట.

• • •

సొరాజ్జెం, సంకురాత్తిరిగాడూ, బోడిదీ రాముడిగుడికాడ ప్రసాదం తయారయ్యేసరికి తయారయ్యారు రోజూలాగే.

అచార్లు పెద్దవాళ్ళందరికీ గుప్పిటినిండాపట్టి వడపప్పూ, రెండుమూడు కొబ్బరిముక్కలూ పెట్టి పిల్లలదగ్గరకొచ్చేసరికి రెండు వడపప్పుబద్దలూ, చిన్నికొబ్బరిముక్కా పెడతాడు.

ఆరోజుకూడా అలాగే వాళ్ళదోసిళ్ళలో పైనించి ఆపెసళ్లు ఎత్తి పడేసాడు.

"ఇంకాత్తి పెట్టండే" అంది బోడి రోజూలాగే.

"అన్నంతిన్నట్టు తింటానికిదేమన్నా అన్నమనుకున్నావా? పలారం. దేవుడి ప్రసాదం" అని కసిరి మళ్ళీ ఒక్కోపిసరు పడేశాడు అచార్లు.

"రామ, రామ" అనుకుంటూ "పొన్నమ్మగారు" గుళ్ళో నుంచీ బైటికొచ్చింది. డెబ్బైరెండేళ్ళ కిందట ఈమె తండ్రి ఎనిమిదిరూపాయలు తీసుకుని ఈమెని అమ్మేశాడు, 'పెళ్ళి' పేరుతో ఎనభైఏళ్ళ ముసలాయనకి.

అప్పుడు పొన్నమ్మకి ఆరేళ్ళు. పొన్నమ్మ భర్త ఎనభై మూడోఏట చచ్చిపోయాడు. పొన్నమ్మ తొమ్మిదోఏట విధంతు వయ్యింది. అప్పట్నుంచీ రాముణ్ణే నమ్ముకుని బతికింది. ఇప్పుడు ఆమెకు డెభ్భై ఎనిమిదేళ్ళు. కళ్ళు బొత్తిగా కనపడ వంటుంది గానీ కళ్ళజోడు పెట్టుకుంటుంది.

బైటంతా చీకటిగా వుంది. సొరాజ్జెమూ, సంకురాత్తిరిగాడూ బోడిది పలారం తక్కువ పెట్టిన అచార్లని తిట్టుకుంటున్నారు

పొన్నమ్మగారు వాళ్ళని చూసింది.

"ఉసే సొరాజ్జెం"అని పిలిచి,"రామ,రామ"అని రాముణ్ణి కూడా పిలిచి, రెండుమెట్లుదిగి "నన్ను మా ఇంటి దగ్గర దిగ బెట్టండే...అమ్మా! రామరామా!" అని తన భారం ఆ పూట మాలపిల్లలకి అప్పజెప్పింది. అవిడ భారం ఏ నిమిషంలోనూ రాముడు మొయ్యలేదుగానీ, రాముడుతప్ప ఎవ్వరూ లోకంలో లేదంటుందావిడ.

సొరాజ్జెంవాళ్ళకదిఅలవాటే.సంతోషంకూడాను.పొన్నమ్మ వీళ్ళని కాస్తదయగానే చూస్తుంది. ఇంటి దగ్గర దిగబెట్టినాక కొబ్బరిచిప్ప యిచ్చేస్తుందని వీళ్ళకు తెలుసు.

ముగ్గురూ పొన్నమ్మగారి కఱ్ఱపుచ్చుకున్నారు ఒకప్రక్క. రెండోప్రక్క పొన్నమ్మగారు నడుస్తోంది.

"నెమ్మదిగా, నెమ్మదిగా. అంత తొందరెందుకే... రామ రామ"

"కొబ్బరిచిప్ప పొన్నమ్మగోరిచేతిలోంచీ వాళ్ళచేతిలోపడే వరకూ తొందరే మరి.

"పొన్నమ్మగారో, నీకు కనబడదేంటండే?" అన్నాడు సంకురాత్తిరి గాడు.

"కనపడితే మిమ్మల్ని నా కఱ్ఱపట్టుకోనిచ్చే దాన్నంటరా? దగ్గరకొస్తే కఱ్ఱ తిరగేసే దాన్నిగానీ. రామ రామ"

"మరి కనపడకపోతే కళ్ళ జోడెందుకుండే"

పిల్లలు కిసుక్కుమని నవ్వారు.

"ఓర్నీ కడుపుగాలా.. "

"కళ్ళజోడుంటే కాత్తి కనపడద్దేమో?" అంది సౌరాజ్జెం.

"ఓసి, నీ కడుపుడకా. గటిక్కురాలివే"

"కళ్ళజోడుంటే కనబడతందేంటండే నీకు"— సంకు రాత్తిరిగాడు.

"కనపడతందిలే" అని బోడిది తమ్ముణ్ణి కసిరింది.

"—పొన్నమ్మగోరికెక్కడ కోపమొచ్చి కొబ్బరిచిప్ప ఎగే స్తుందో" అని దాని భయం.

"ఆ. వున్నా కనపడదూ, లేకపోయినా కనపడదు. రామ, రామ"

"మరెందుకండీ అదీ?"

"రామ, రామ. ఇసిగించమాకండ్రా"

పొన్నమ్మగారింటికి చేరారు.

వరండా మెట్లెక్కుతూ, "అమ్మ! రామ, రామ! యిందా. ఇది పగలకొట్టుకుని తినిపొండి...ముట్టుకోకండే మాలముండ ల్లారా!" అంటూ చిప్ప కొట్టుకుని ముక్కలు పంచుకున్నారు.

పొన్నమ్మగారు అలిసిపోయి మెట్లమీదే చతికిలబడింది. "అంతా రాముడి లీల. రాముడి లీల"

"రావుఁడి లీలంటే యేంటండే?"

"రావుడిదగ్గిర ఈలుంటుందేమోరా-"సౌరాజ్జెం.

"ఏ వుండే, పొన్నమ్మగోరో రావుడు యీలేత్తాడేంటండే"

"ఒరే! కళ్ళుపోతయిరా! చెంపలేసుకోండి"

"మీకెందుకు పోయినియ్యండే కళ్ళు?"

డెబ్బై ఎనిమిదేళ్ళ పొన్నమ్మ మాల పిల్లలకి జవాబులు చెప్పలేక విసిగిపోయి "రామ... రామ... ఎలాగో కొంపకి చేర్చావు తండ్రీ!" అని నిట్టూర్చింది.

"మేం కాదుండే నిన్ను తీసుకొచ్చింది. రావుడెందుకయిం దుండే" అంది బోడిది.

"మేమే తీసుకొచ్చాం కాదుండే" అంది సౌరాజ్జెం కూడా.

"మీదేముందే మాలముండల్లాలా. అంతారాముడే పొండి పొద్దోయింది.

"మరి మిమ్మల్ని దిగబెట్టమన్నారెందుకుండే"

"పోతారా, పోరా" అని పొన్నమ్మ కర్రతిరగేసి మెట్లమీద కొట్టింది.

పిల్లలు దూరంగా దూకి, నవ్వులతో వీధినబడ్డారు.

* * *

ఇప్పుడు సొరాజ్జెం తల్లివెనకో తండ్రివెనకో పడడం మానేసింది.

పొలాల్లో 'కట్టేతలు' అవ్వగానే పరిగలేరుకోవడానికి మాల పిల్లలందరితో కలిసివెళ్ళేది. బోడిది, అదీ మంచిజట్టు. ఇద్దరూ బురదబురదగా వున్న చేలల్లోనూ, ఎండిన చేలల్లోనూ పడి రోజంతా పరిగేరుకునేవారు. ఎవరెక్కువ ఏరతారో పోటీ పడేవారు. చిన్నోడయినా సంకురాత్తిరిగాడు వీళ్ళిద్దరితో సమానంగా ఏరేవాడు.

ఆ యాడాది సొరాజ్జెం కూడా బాగానే ఏరింది.

"నా పరిగంతాపెట్టి కొత్తసొక్కా కొనుక్కుంటా" అన్నాడు సంకురాత్తిరిగాడు. కళ్ళు కిందకి పైకి తిప్పుతూ. సొరాజ్జెమూ, బోడిదీకూడా 'సొక్కాలే కొనుక్కుందారి' అనుకున్నారు.

అంతలోనే సొరాజ్జానికి చెప్పులు గుర్తొచ్చినయ్.

"నేను చెప్పులు కొనుక్కుంటా" నంది.

"అవుతే, నేను కాళ్ళకిపట్టాలు కొనుక్కుంటా" నంది బోడి.

కట్టేతలయ్యి చాలారోజులైపోయాయి. చేలల్లో రెండోపంట మినుమో, పెసరో, పిల్లిపెసరో, జనుమో చల్లుతారు కోతల్లోనే మొక్కలు తొక్కుతున్నారని చేలల్లో పిల్లలు కనపడితే వూరుకోవడంలేదు రైతులు.

నెలరోజులు కష్టపడి ఏరుకున్న పరిగంత కొలిపించింది సొరాజ్జెం, తల్లితో.

ఒక్కొక్కసోలా లెక్కేస్తోంటే కొలవవలసిన వడ్లు తరగకూడదనుకుంటోంది సొరాజ్జెం. చివరికి వొడ్లన్నీ పూర్తైనాయి.

పదహారు మరకాలు అంది పద్దాలు.

"బస్తా అయ్యిందా?" అంది సొరాజ్జెం.

"బస్తా ఎక్కడే... ఇరవయ్యారు మరకాలైతే బస్తా అవుతుంది"

సొరాజ్జెం బోడితో చెబుదామని పరిగెత్తింది. బోడి కూడా తన వడ్లు కొలిపించుకుంది.

"నాయి పదారు మరకాలయినయ్యి" అంది సొరాజ్జెం.

"నాయి పద్దెనిమిద్దెనయ్, మా తమ్ముడియి పదమూడు"

సౌరాజ్జెం తనకూ్కడా తమ్ముడుంటే బాగుండే దనుకుంది.

"మీకె ఎక్కువ" అంది సౌరాజ్జెం విచారంగా మొహం బెట్టి.

"వుసే, సౌరాజ్జెం! మా అమ్మ మా వొడ్డన్నీలాక్కుందే" అంది బోడి ఏడుపు మొహంతో.

"ఎందుకూ ?" అంది సౌరాజ్జెం తెల్లబోయి.

"మా అమ్మ వొడ్డన్నీ లాక్కుందని మా తమ్ముడు ఏడిచి పారిపోయాడెక్కడికో."

"ఎందుకూ?" అంది మళ్ళీ సౌరాజ్జెం.

"మనం సొక్కాలన్నా ఏవన్నా కొనుక్కుందామనుకున్నాం గదా?" మిమ్మల్ని కోంటాయిన మోసం చేత్తాడు, నేనవ్విమ్మెపెడతాలే" అని మా ఇద్దరి వొడ్డూ లాగేసుకుని రాగవులుఇంది ఎల్తాంటే దాని మీదేసుకుని కొట్టుకెల్లిందే మాఅమ్మ. డబ్బులు అదే తీసుకుంటుందంట"—బోడిది ఏడ్చేసింది.

ఇంత అన్యాయం లోకంలో వుంటుందా అన్నంత బాధ పడిపోయింది సౌరాజ్జెం.

"సంకురాత్తిరిగాడు ఎటెల్లాడు" అంది.

"మల్లాయపాలెం రోడ్డంట పోయాడు"

"మనమెల్లి తీసుకొద్దాం రాయే"

ఆ మాట కోసమే చూస్తున్నట్టు బోడి బైల్దేరింది.

ఇద్దరూ మల్లాయపాలెం రోడ్డులోపడి కొంత దూరమెల్తే గేదెల్ని కాసుకునే బుడ్డాళ్ళతో కలిసి 'కర్రాబిళ్ళ' ఆడుతూ కన్పించాడు సంకురాత్తిరిగాడు.

రమ్మంటే రానన్నాడు. 'ఎక్కడికెళ్తావంటే' 'ఎక్కడికో' అన్నాడు.'చీకటి పడితే ఎక్కడుంటా'వంటే కాస్తమెత్తబడ్డాడు. పైగా ఇంటినుంచి బైల్దేరి చాలా సేపయ్యింది.

"నా డబ్బులు నాకిచ్చేత్తే వత్తా"

"ఇత్తందిలేరా"

ముగ్గురూ బైల్దేరి వూళ్ళోకొచ్చారు.

సౌరాజ్జెం ఇంటికొచ్చేసరికి పద్దాలు లేదు. తన వొడ్లు చూసుకుంటే 'బానలు'కాళి. సౌరాజ్జానికి భోరున దుఃఖంవచ్చేసింది.

అంతలో తల్లి కనపడగానే "నా వొడ్డేయే ?" అని బావురుమంది.

"ఓసి ఎర్రిముండా. దొంగలెత్తుకుపోలేదు.లే నేనే కోంటా యనకి అమ్మేచ్చా! ఎనిమిది రూపాయలొచ్చినియ్" అంది పద్దాలు కూతురి కన్నీళ్ళుతుడుస్తూ. చేతిలో మూడు పంచదార బిళ్ళలు పెట్టింది.

"నాకు చెప్పులు కొనాలి" అంది సొరాజ్జెం.

"కొనుక్కుందువుగానిలే"

బోడికీ, నంకురాత్తిరిగాడికి వాళ్ళమ్మకూడా ఇదే సమాధానం చెప్పింది.

పద్దాలుపడ్లమ్మిందన్న మాటేగానీ ఆమెచేతికి కానీ కూడా ఇవ్వలా కోంటాయన.తన బాకీకింద జమేసుకున్నాడు. కోంటాయన్ని బతిమాలి మూడు పంచదార బిళ్ళలు పెట్టించుకొచ్చిందిపద్దాలు. బోడిదాని తల్లీ అంతే.

పిల్లలు డబ్బులడిగినప్పుడల్లా "రేపిత్తాం, రేపిత్తాం" అని నాలుగు నెల్లుగడిపారు.

సొరాజ్జానికి చెప్పులూ లేవు.

బోడికి పట్టాలులేవు.

దాని తమ్ముడికి చొక్కాలూలేవు.

"ఈసారి పరిగల్లో కొనుక్కుందాం లేయే" అనుకున్నారు. "ఇంకా అర్నెల్లున్నాయి" అని లెక్కలు పెట్టుకున్నారు.

తర్వాత "ఈసారి పరిగల్లో వచ్చిన డబ్బులు మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి" అన్నారు తల్లులు.

◆ ◆ ◆

అన్నంమూట తీసుకెళ్తూ చేనుగట్టున గండి దగ్గిర ఆగిపోయింది సొరాజ్జెం.

పద్దాలు రాత్రంతా వుబ్బసం దగ్గుతో కొట్టుకొని ఎప్పటికో కన్నుమూసి పొద్దున బాగా ఆలస్యంగా లేచింది.

బారెడు పొద్దెక్కిపోయింది. నాలుగు రోజుల్నుంచీ నాట్లు మొదలు పెట్టారు పొలాల్లో. ఆలస్యంగావెళ్ళే కూలీల మీద దొరలుకూసేబూతుకూతలుతల్చుకుంటూ పద్దాలుఆదరాబాదరా కాసిని నూకలుకడిగి పొయ్యిరాజేసి పడేసి, పిల్లని చూడమని చెప్పి, జుట్టు ముడేసుకుంటూ చేలోకి పరిగెత్తింది పద్దాలు.

సొరాజ్జెం పొయ్యిముందు కాస్సేపు కూచుని కంప ఇటూ, అటూ ఎగదోసి నూకలముద్ద వుడకేసి గిన్నిలో పెట్టుకుని,

కాస్తకారం పడేసుకుని, గిన్నె గుడ్డలో మూటకట్టుకుని చేలోకి బైల్దేరింది.

చేని గట్టున గండిలోంచి నీళ్ళు గలగలా పరుగెత్తుతోంటే నరదాయేని నీళ్ళని చూస్తూ నిలబడిపోయింది. నీళ్ళు చిన్న చిన్న శబ్దాల్తో గట్టుకి ఆ పక్క, ఈపక్క గడ్డినికూడా రమ్మని లాగుతూ చేలోకి పరిగెత్తుతున్నాయి!

నెమ్మదిగా గండిలోకి దిగింది సౌరాజ్జెం. అన్నంమూట గట్టుమీద పెట్టి. మోకాళ్ళదాకా వచ్చాయి నీళ్లు. కాళ్ళకిచుట్టు కుంటూ పరుగులు తీస్తున్నాయి. గండిలో ఎంతసేపు ఆడేదో అంతలో బోదెలోకి వొక బురదకొయ్య కొట్టుకొస్తూ తల తింది. పాముని చూడగానే సౌరాజ్జెం రెండంగల్లో గట్టెక్కి అన్నంమూట నెత్తిమీద పెట్టుకుని గట్టెంటే నడవడం మొద లెట్టింది.

పొలాలన్నీ దుక్కి దున్ని నీళ్ళు పెట్టివున్నాయి. ఎత్తు పల్లాలు సరిచేసి నాట్లకోసం తరాలేసి సిద్ధంగావున్న పొలాల్లో నీళ్ళమడుగుల. పెద్ద పెద్ద అద్దాల్లాగా మెరుస్తున్నాయి పొలా ల్నిండా మేఘాలే. తాటిచెట్లు తల్లకిందులుగా వూగుతున్నాయి పొలాల్లో

అక్కడక్కడా చిన్న చిన్న మట్టిగడ్డలుంటే కాకులూ కొం గలూ వాటిమీదికెక్కి పురుగుల్ని ఏందుచేసుకుంటున్నాయి. గట్లవెంటే తిరుగుతూ కేకలేస్తున్నారు—నాట్లువేసే ఆడకూలీల్ని పొలాల ఆసాములు.

ఆడకూలీలంతా కోకలు మోకాళ్ళపైకి ఎగదీసి గోచీలు పెట్టుకుని పొలాల్లో వొంగుని వెనక్కి వెనక్కి నడుస్తూ నాట్లే స్తున్నారు గబగబా

సౌరాజ్జెం విశాలమైన పొలాలమధ్య గట్లమీద నుంచీ, నాట్లువేసే కూలీలవంకా, అజమాయిషీ చేస్తోన్న దొరలవంకా, చేలల్లో నీళ్ళల్లో కనబడే చెట్ల నీడ వంకా చూసుకుంటూ తల్లివున్న పొలానికెళ్ళింది.

పద్దాలు రాత్రి ఒంట్లోబాగుండక అన్నంతినలేదు. కూతుర్ని చూడగానే "ఇంత సేపేంజేసావ్?" అని ఓ కేకపెట్టింది.

సౌరాజ్జెం కిక్కురుమనకుండా నించుంది.

"మాట్టాడవేంవే? ఇంతసేపెక్కడసచ్చావ్?"

"అక్కడ చేనికి గండిపడితే..."

"గండిపడితే... అక్కడ కూరుకుపోయావా ముదనష్టప్ముండా!"

కూలీలందరూ చేలోంచి బైటికొచ్చే నప్పుడు పద్దాలు కూతుర్ని రెండు మొట్టికాయలేసింది.

సారాజ్జెం ఏడుస్తూ గట్టెంట పరిగెత్తింది.

"కాళ్లిరగ్గొడతానుండు" అని పద్దాలు కూతురెంట పడింది గానీ మిగిల్నకూలీలు "పోనియ్యే దాంతోనేంటి" అని కేకలేసి పద్దాలు కోపం చల్లార్చారు.

* * *

పెద్దబడికాడికి సర్కసు వచ్చిందంటే పరిగెత్తుకెళ్ళి అక్కడ ఎలుగుబంటినీ, కోతుల్నీ ఆశ్చర్యంగా చూస్తోంది సారాజ్జెం.

బోడీ, సంకురాత్తిరిగాడూ పరిగెడుతున్నారు వూళ్ళోకి.

"ఒలే బోడీ, వొలే సంక్కురాత్తిరిగా రండిరో ఏనుగుబంటిని సూద్దాం రండిరో" అని కేకేసింది సారాజ్జెం.

సారాజ్జెం కేకవిని పరిగెత్తడం ఆపి ఏడుస్తూ సారాజ్జెం దగ్గర కొచ్చారువాళ్ళు.

ఉత్సాహం వురకలేస్తున్న సారాజ్జెం వాళ్ళ ఏడుపులు చూసి, "ఎందుకే?" అని సగం బిక్క మొహం పెట్టింది.

మాఅన్నియ్యని సెట్టుకక్కట్టేశారంట.కొడతారంటే" అంటూ మళ్ళీ పరిగెత్తింది బోడిది. దానివెంటే సంకురాత్తిరిగాడుకూడా ఏడుస్తూ పరిగెత్తాడు.

ఒక్క క్షణం ఆగి సారాజ్జెం కూడా వాళ్ళిద్దరి వెనకా పరిగెత్తింది.

బోడికన్నా, సంకురాత్తిరిగాడికన్నా పెద్దాడు 'జోజిగాడు' వీళ్ళ తండ్రి సంకురాత్తిరిగాడుపుట్టిన అర్నెల్లకిఎడ్లబండిబోల్తా బడి పొలంలోనే చచ్చిపోయాడు. చచ్చిపోయేనాటికి 'నల్లచంట బ్బాయిగారి' దగ్గరే పాలేరుగా పనిచేస్తూండేవాడు.

తండ్రి పోయేప్పటికి జోజిగాడికి ఎనిమిదేళ్ళు. వాణ్ణి వాళ్ళమ్మ నల్లచంటబ్బాయిగారింటి దగ్గరే చిన్న పాలేరుగా పెట్టింది. తను కూలీనాలీ చేసుకుంటూ, అప్పుడప్పుడూ 'కమ్మోరిళ్ళల్లో' యిళ్ళలకటానికి, వొడ్లు దంచటానికీ, పేడ చెయ్యటానికి వెళ్తూండేది.

'మొగుడు చచ్చిన ముండ'గదాని కొంచెం జాలి చూపే వారు కొందరు.

బోడిదీ, సంకురాత్రిరిగాడూ, సొరాజ్జమూ నల్లచంటబ్బాయి ఇంటి ముందున్న చింతచెట్టు దగ్గరకొచ్చేసరికి అక్కడ చాలా మంది 'దొరలు' నిలబడున్నారు

ఎండబండిమీద అటుగా వెళ్తున్న 'సోవిఁగోరు' (స్వామి గారు) "ఏవైందిరా, పెద్దాడా ?" అని వాకబు చేశాడు.

"ఏవీ లేదులే... మాలాడు... దొంగతనం చేశాడంట. చంటన్నయ్యగారింటికాడ. చెట్టుకట్టేశారు" అన్నాడు.

"చెప్పుచ్చుకొట్టండి లంజాకొడుకుని, మళ్ళీమళ్ళీ చెయ్యకుండా" అంటూవుండగానే సోవిగోరిబండి మలుపుతిరిగింది.

"సేతులిరిసేయాలి దొంగలంజాకొడుకులికి" అన్నాడు అక్కడే వున్న మోహనరావుగారు.

"అరేయ్, పెసాదూ. ఎందుకూరికినే టయిము దండగ్గానీ వొకిసుడు పంచదార తీసుకు రంద్రా! అణ్ణి కాళ్ళూ చేతులూ కట్టి కిందపడేసి, వొంటిమీద పంచదారేసి, రొండు బొట్లనీళ్లు చల్లండి. జన్మజన్మలకీ బుద్ధిరావాలి లంజాకొడుక్క...తీసుకు రారా ఊఁ..."అన్నాడు, మల్లేశ్వరరావుగారు.

హడావుడిగా వెళుతున్న సుందరయ్య 'గారు' అటువచ్చి "ఏం జేశాడీడూ?" అన్నాడు అక్కడున్న యావన్మందినీ వుద్దేశించి.

"దొంగతనం చేశాడంట" అన్నారు ముగ్గురు నలుగురు ఒకేసారి అందరూ "అంట" అనేవాళ్ళే!

"ఏలెడంతలేడు గాడిదకొడుకు. రేప్పెద్దయితే యికమాటిం టాడా? గుడివాడ తాలూకా అంతటికీ గజదొంగవుతాడు కళ్ళు సూడండి. రొత్తుకొడుకు కళ్ళే దొంగ కళ్ళు. కత్తవలు పెట్టి కువలబొడవండి దొంగలంజాకొడుకుని" అని వెళ్ళబోతూ ఆగి వెనక్కితిరిగి "లంజాకొడకా" అని తిట్టి గబుక్కున వాడి మీదపడి ఆ చెంపా, ఈచెంపా వాయించేశాడు. ఈ అనుకోని సంఘటనకి'జోజిగాడు'అప్పటిదాకా కందగడ్డలాగా మొహంతో కళ్ళ నీళ్ళతో వున్నవాడల్లా ఒక్కసారి బావురుమని ఏడవడం మొదలెట్టాడు. వాడేడుపినగానే వాడితల్లి గావురుమంది. జోజి గాడి చెల్లీ, తమ్ముడూ, సొరాజ్జెంకూడా ఏడవడం మొదలెట్టారు

'దొరలంతా' కస్సుమన్నారు ఒక్కసారిగా.

"దొంగేడుపులాపండెహె! ఎదవేడుపులని"అని కేకలేశారు.

ఏడుపులు అణుచుకున్నారు అందరూ.

సుందరయ్యగారు హడావిడిగా వెళ్ళిపోతూ సందుమలుపు దగ్గర ఆగి బిగ్గరగా, "దొంగ్గాడిదకొడుకుని వదలమాకండి. కాళ్ళూచేతులూ నజ్జు నజ్జుచేసి వదలండి. గాడిదకొడుకెవడితో చెప్పుకుంటాడో" అంటూ మలుపు తిరిగాడు.

ఆ మాటలు వినగానే బోడిదీ సంకురాత్తిరిగాడు సొాాజ్జెం మళ్ళీ ఏడవడం మొదలెట్టారు.

"పెసాదుబాబూ! ఈ వొక్కపాలికి వదిలెయ్యండిబాబూ. చచ్చి మీ కడుపున పుడతా. ఆడు దొంగతనంచేసే మణిసి కాదు బాబూ. నాయన్నాయన..." అంటూ అక్కడున్నవాళ్ళ కాళ్ళావేళ్ళా పడుతోంది జోజిగాడి తల్లి.

"అంటే" అని కళ్ళు పెద్దవిచేసి కోపంగా చూశాడు నల్ల 'నంటబ్బాయిగోరు' నేనుచేసి ఆడిమీద పెడతన్నానేంటే?... దొంగలంజా! అబ్బికాదే, నీయమ్మ అసలు నిన్నుతన్నాలి చెట్టుకట్టేసి గుడిసేటి లంజా..." అని ఎగిరి— "అరేయ్ మోహనా, సావిట్లోకెళ్ళి తాడు తీసుకురారా! ఈడిక్కొదండం వేద్దాం. అసలు దొంగతనం చేశాడో లేదో ఆడే సెబుతాడు" అన్నాడు మండి పడిపోతూ.

మోహనరావు త్వరత్వరగా నల్లచంటబ్బాయిగారిచావిట్లో కెళ్ళి పెద్ద తాడొకటి తెచ్చాడు.

జోజిగాణ్ణి చెట్టునుంచి వూడదీసి తాడుకట్టి చెట్టు కొమ్మ మీంచివదిలారు. రెండోకొస ఇద్దరుముగ్గురు పట్టుకునిలాగారు. పొట్టదగ్గర తాడు బిగించి కట్టడం మూలంగా జోజిగాడి పై ప్రాణాలు పైనే పోతున్నాయి. బాధతో అరుస్తున్నాడు తల్లి కుప్పకూలిపోయింది. ఒంటిమీద తెలివిలేదు. పిల్లలు చుట్టూ చేరి గోలగోలగా ఏడుసూ కూర్చున్నారు.

అటూ, ఇటూ చూసి పెసాదుబాబు కాస్త ఎండుగడ్డి తీసుకొచ్చి కొమ్మకిందేశాడు. ఎవరో కిరసనాయిలు తెచ్చిపోశారు, వుత్సాహంగా దానిమీద. మోహనరావు ఆ గడ్డిక నిప్పు పెట్టాడు. భగ్గుమంది.

జోజిగాణ్ణి కొమ్మకి రెండోవైపునించీ మంట తగిలీ తగల నట్టూ, కాలేట్టూ గుంజుతూ కేకలేస్తున్నారు.

దొరల్లో కొందరు "ఊరుకోండిర, ఇక చాల్లేగాని" అని చెప్పి తొరతొరగావెళ్ళిపోయారు ఆ కార్యం కుర్రకారుకివొదిలి.

అంతలో ఎవరో పరుగు పరుగునొచ్చి నల్లచంటబ్బాయి

చెవిలో గుసగుసలాడాడు. నల్లచంటబ్బాయి ఇప్పుడు నిప్పు తొక్కిన కోతయ్యాడు.

"ఆ...రమ్మను, ఏ లంజాకొడుకొస్తాడో. అరేయ్ పెసాదూ మన కుర్రాళ్ళందర్నీ పోగెయ్యరా. మాల్లంజాకొడుకులంతా కర్రలేసుకునొస్తున్నారంట. చూద్దాం, ఇదెందాకపోతందో. ఇంటన్నావా?...... ఇదిగో ఇంకాత్త కిరసనాయిల్దెచ్చి ఈడిమీద పొయ్యి అవొచ్చినాకొడుకులేం చేత్తారో చూద్దాం" అని గంతులేశాడు.

జోజిగాడి తల్లికి తెలివొచ్చి ఇటూ అటూ పిచ్చి పరుగులు తీసింది.

"బాబూ! అయ్యా! మీ పాదాలట్టుకుంటా... నాకొడుకుని రచ్చించండి... అయ్యా! అయ్యా!" అని అందరి పాదాల మీదా పడింది.

"బోడిదీ,సంకురాత్తిరిగాడూ,సారాజ్జెమూ తెగేడుస్తున్నారు.

పెసాదు గబగబా ఇంట్లోకెళ్ళి సీసాతో సీసాడు కిరసనాయిలు తీసుకొచ్చి జోజిగాడిమీద పోశాడు. అది కొంతకింద మంటమీదపడి మంటపెద్దదయింది. పెద్దదయినమంట జోజిగాడిమీదున్న కిరసనాయిలకంటుకుంది.

జోజిగాడు మండుతున్నాడు.

తల్లి పరుగెత్తుకెళ్లి కొడుకుని కావిలించుకుని స్పృహతప్పి పడిపోయింది.

బోడీ, సంకురాత్తిరిగాడూ, సారాజ్జెం ఏడవడం మానేసి మొహాలు ప్రేతకళ పడిపోయి మతి చలించిన వాళ్లలాగా వుండిపోయారు.

జోజిగాడికట్టినతాడు తెగి, వాడు గబుక్కున నేలమీద పడ్డాడు. అప్పటికే జోజిగాడు చచ్చిపోయాడు. జోజిగాణ్ణి చెట్టుకట్టడం దగ్గిర్నించీ, అదంతా పావుగంటసేపట్లో అయిపోయింద.

వాడు చచ్చిపోయాడని తెలవగానే అక్కడున్న జనం ఒక్కొక్కరూ జారుకున్నారు.

అంతలో మాలపల్లి నుంచీ పొలాల్లోంచీ మాలమాదిగలు కొందరు పరిగెత్తుకుంటూ వచ్చారు.

జోజిగాడూ, తల్లీ, బోడీ, సంకురాత్తిరిగాడూ, సారాజ్జెమూ తప్ప మిగతా ఎవరూ అక్కడలేరు.

వచ్చినవాళ్ళంతా చాలా ఆవేశంగా వున్నారు.

కొంతమంది గుడివాడ పోలీసుస్టేషన్‌కి పరిగెత్తారు.

కొంతమంది బడితలేసుకుని శవాన్ని కాపలా కాశారు.

చీకటి పడకముందే పోలీసులొచ్చారు.

ఆ కేసు ఆరు నెలలు నడిచింది. నల్లచంటబ్బాయి ఒక ఎకరం పొలం అమ్ముకున్నాడు. మాలపల్లెలో నలుగురు యువకుల్ని జైల్లో వేశారు. జోజిగాణ్ణి పొలంగట్టున కొట్లాటలో చంపినందుకు.

♦ ♦ ♦

గేదెల వెనక పేడతట్ట లేసుకు తిరగడం, దుబ్బుల్లో తుప్పల్లో దూరి ముళ్ళకంప ఏరుకు రావడం, ఎండనకా వాననకా పొలాల్లో బడి గెంతడం... ఇదంతా సొరాజ్జానికిప్పుడు వుత్సాహాన్నివ్వడంలేదు.

పలకలూ, పుస్తకాలు సంచులూ పుచ్చుకుని చెరువుగట్టు మీదనుంచీ బడికెళ్ళే పిల్లల్ని చూస్తోంటే సొరాజ్జానికీ బడికెళ్ళాలనిపిస్తోంది.

బళ్లోకెళ్ళగానే అమ్మా, ఆవూ, ఇల్లూ, ఈగా అని పంతులయ్య అంటోంటే పిల్లలంతా మూకుమ్మడిగా అరవడం, ప్యాసు బెల్లుకీ, అన్నంబెల్లుకీ పిల్లలు ఉత్సాహంగా బయటికి పరుగులెత్తుకురావడం... ఇదంతా సొరాజ్జానికి సందడిగానూ, సర్దాగానూ వుంది.

తండ్రినడిగింది బళ్లో కెళ్తానని.

ఎంకడీమధ్య వో చిత్రమైన నవ్వు నేర్చుకున్నాడు. ఎవరేమడిగినా ఆ నవ్వు నవ్వుతున్నాడు.

"నూకల్లేవురా. ఎక్కడికన్నాపోయి ఎట్టాగొట్టా ఓ గిద్దెడన్నా వొట్టుకురారా!" అని భార్య అంటే, నవ్వుతాడు నూకలెందుకన్నట్టు.

"యేంటా, ఎదవనవ్వు. నూకలు లేకపోతే పింగారిగానీ, ఆ ఎదవనవ్వు నవ్వమాక" అని ఖయ్యిమంటుంది పద్దాలు.

తిరపతి ఆ మధ్యవోసారి, "ఒరేఅయ్యా! నేనీ పాలేరుపని సెయ్యలేన్రా. దొరలు కాల్సుకు తింటన్నార్రా. ఎక్కడన్నా ఒకెకరమో, రొండెకరాలో తీసుకోరా, దున్నుకు బతుకుదాం" అన్నాడు.

దానికీ ఎంకడు పిచ్చినవ్వు నవ్వాడు.

"ఎకరాలంటెకరాలు. ఎకరాలెక్కడియ్‌రా? ఏంబెట్టి చేత్తా

ఎవసాయం' అని ఎంకడు కుక్కిమంచంలో కూలబడి శానా సేపు నవ్వాడు.

తిరపతి ఇప్పుడిప్పుడే లోకాన్ని తేరిపార చూస్తున్నాడు. తన తాతలు పాలేర్లే, తండ్రులు పాలేర్లే, తానూ పాలేరే రేపు పెళ్ళి చేసుకుంటే తన కొడుకులూ పాలేర్లే మనమలూపాలేర్లే.

మాల పల్లంతటికీ అయిదుగురికో ఆరుగురికో పొలాలు న్నాయి. అదీ ఎంతా? ఎకరవో, ఎకరంన్నరో దుర్గడి కొక్క డికే రెండెకరాలుంది. మా గొప్పొస్తిలే. కొత్త పరుకునోడు. ఆదొరదో, ఈదొరదో మగతాకి సెయ్యడవేఁగా? దిక్కుమాల్నో ళ్ళకి అదీ దొరకదు.

"ఏఁబెట్టిసేత్తా ఎవసాయం" అని తండ్రన్న మాటల్తో పుట్టిడు నిరుత్సాహం వొచ్చింది తిరపతికి.

జోజిగాడి హత్య చూశాక చాలామంది మాల యువకుల ఆలోచనల్లో కొంత కొంత మార్పొచ్చిం.. తిరపతి అందరి కన్నా ముందు పీఠీనుండేవాడే.

సాయింత్రాలు దొరల ఇళ్ళ నుంచి రాగానే కుర్రకారంతా మాలరాములోరి గుడికాడకూర్చుని తమకు జరుగుతున్న 'అన్నే యాల' గురించి ఆలోచిస్తున్నారు ఇప్పుడిప్పుడు.

అందుకే పాలేరుపని మానేసి 'సొతంత్రంగా' ఏవన్నా చేసుకు బతుకుదామని తండ్రినికదిలిస్తే ఆ ఎర్రినవ్వునవ్వాడు తండ్రి.

"ఈడికి పిచ్చెత్తినట్టుందే అమ్మో" అన్నాడు తిరపతి పద్దాలుతో.

"ఏమోరా! నాకూ అట్టాగే అనిపిత్తాంది. ఇదో కర్మొచ్చి పడిందిగావున్నా దేవుడా"అని పద్దాలు పెద్ద మూలుగు మూలి గింది.

బళ్లోకెళ్తానన్న కూతురికి ఆ ఎర్రినవ్వే నవ్వాడు.

"బళ్లోకెళ్తా?... నీ సిగదరగ. దొరల పిల్లననుకుంటన్నా వేంటే? ఏంచేత్తా బళ్లోకెల్లి? పంతులమ్మ పని చేత్తావా? నర్సమ్మ పనిచేత్తావా? ఓసి నీ కడుపుడకా..." అంటూ ఎం కడు తల్బుకు తల్చుకు నవ్వాడు.

సొరాజ్జెం బెదిరిపోయి నాలుగురోజులపాటు బడి సంగ తెత్తడం మానేసింది.

మళ్ళీ ఒకనాడు తల్లి ఇంటికి రాగానే "ఓలమ్మో! నన్ను బళ్లో యెయ్యవే" అని గునుస్తూ అడిగింది.

కూతురు అట్టా అడగ్గానే పద్దాలికి ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది. కూతుర్ని దగ్గరకి తీసుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుని, వూరకుండిపోయింది.

మొగుడు చూస్తే మతిచెడి తిరుగుతున్నాడు. కొడుకుచూస్తే దొరల్తో గొడవలు. తనకిచూస్తే వుబ్బసం దగ్గు. పిల్లముండకి సదువెలాగ?

బడికి పంపాలంటే ముందుముందు మాటల్తో జరిగేపనేనా? గుడ్డలుకొనాలి. పుస్తకాలు కొనాలి. పిల్లకి ఎనిమిదేళ్ళొస్తున్నాయి. అప్పుడే ఏ అనసూయమ్మలాంటి దొరసాని దగ్గరో పనికి పెడితే దాని బతుకది బతుకుతుంది.

"కూలి జేసుకుని బతికే మనబోటాళ్ళకి సదువులెందుకే. అదేవన్నా కూడు బెడతందా ఏవన్నానా?" అంది పిల్లని సముదాయిస్తూ.

తల్లిమాటతో నీరసం వచ్చింది సొరాజ్జానికి. ఇంక అన్న మీదికిపోయింది ఆశ.

ఆ రోజు అన్నొచ్చేదాకా నిద్రోకండా కూర్చుంది. తొమ్మిదయ్యాక తిరపతి వచ్చాడు.

"ఓ రన్నియ్యా, నువ్వు సదువుకోలేదేరా ?" అనడిగింది అన్న వచ్చీరాగానే.

"వుప్పుడడుగుతున్నావేంటే ?"

"చెప్పరా !" అని గారాంపోయింది.

"ఎట్టానదవాలే. నీఅమ్మా, అయ్యా నన్ను సదవనిత్తేనా?"

"అట్టాగెతే ఓరన్నియ్యా, నువ్వునన్ను సదివియ్యరాదురా. నేను మన పంతులమ్మలాగా పేద్ద సదువు సదివి నిన్ను సదివిస్తాగా"

అమాటలనేప్పుడు సొరాజ్జం తనకితెలియకుండానే ప్రాణాలన్నీ ఆ మాటలమీదే పెట్టి అంది.

అందుకే తిరపతి అ మాటలగురించి ముద్దుసెల్లి ముద్దుగా అన్న మాటల్లాకాక గట్టిగా ఆలోచించాడు.

తర్వాత "అట్టాగేనే. నిన్నునేను సదివిత్తానే" అన్నాడుమహా నిశ్చయింగా.

మర్నాడుపొద్దున్న లేస్తూనే తిరపతి తల్లితో "ఓలమ్మ. అయ్యాల్టికాడినుంచి సొరాజ్జాన్ని ఇస్కూలుకి పంపాలే. దాన్ని చితపలకీ గితపలకి పంపమాకే ఇంక" అన్నాడు.

"సొల్లే సంబడం. నీకేం ఎర్రెక్కిందేరా ? దానికి సదువు లెందుకురా ? అదేం వుజ్జోగాలు సెయ్యాల, వూళ్ళేలాలా ? అంది పద్దాలు.

"నీయెమ్మ! యీ యెదవకబుర్లు సెప్పేనే నా బతుకు యిలా కాలిశారు నేనే సదువుకునుంటే యీ పాలికి వుజ్జోగం సేసే వాణ్ణే ఏ బెజవాళ్ళోనో"

"అ, అ. సేసేవాడివే సదూకున్నాళ్ళందరూ వూర్నిండా వుజ్జోగాలు సేత్తానేవుండిరిగా అయినా, నువ్వేమన్నా పెద్ద మోతుబరికిపుట్టావా, కమ్మదొరకు పుట్టావా?—సదువు సదువు అంటా తగూలేసుకుంటన్నావు. మీకు సదువుకునెరాతలేవుంటే మీరు ఏ మారాజులింట్లోనో పుట్టేవార్రా

పద్దాలు, కొడుకుని చిన్నప్పుడు చదివించాలనే అనుకుంది. శిరోమణి తమ్ముడిలాగా తన కొడుకుకూడా తాలూకా ఆఫీసులో వుద్యోగం చేస్తాడని కలలుకూడా కంది. కొడుకు ఒక్కో సంవత్సరం ఎదుగుతోంటే వాడు పుట్టిందీ పెరుగుతున్నదీ బళ్ళోకెళ్ళడానికేననీ చదువుకుని వుజ్జోగంచేసి కుటుంబాన్ని తాతల తండ్రుల పాలేరుగిరీ నుంచీ, కూలిరాత నుంచీ తప్పిస్తాడనీ కలలు కంది.

తీరా వాడికి బడికివెళ్ళే వయసొచ్చేనరికి పద్దాలుకి ఇంకో ఇద్దరు పుట్టి పురుళ్ళనీ, పుణ్యాలనీ మొక్కి ఆ పుట్టినవాళ్ళు చచ్చిపోతే ఆ ఏడుపులూ, మొత్తుకోళ్ళూ, తల్లి అనారోగ్యం... ఆ గోలలతోటే సరిపోయింది.

రేపటి వుజ్జోగం సంగతి చూసుకుంటే యివ్వాల్టి కూడుకి జరుగుబాటు లేదని మనసు బండరాయి చేసుకుని, వాడి బోలిలో బొమ్మరాయి కొట్టలేక చివరికి వాణ్ణి 'కాత్తిఅన్నమన్నా దొరుకుద్దిలే' అని నాగభూషణంగారింటో చిన్నపాలేరుగా పెట్టేసింది వాడికి ఆరేడేళ్ళు రాగనే.

వాడుకూడా బళ్ళోకెళ్తానని మారాం చెయ్యలేదు. ఒకసారెప్పుడో ఆటలాడుకుంటూ బడికిటికీల దగ్గిరికెళ్తే "మాలముండా కొడుకుల్లాలా! పొండవతలికి" అని తిట్టారని తిరపతి మళ్ళీ ఆ ఛాయలకి పోలేదు పదేళ్ళదాకా. కొంచెం పెద్దయ్యాకే తెలిసింది చదువుకుంటే మంచిదని.

కొడుకుని పాలేరుతనానికి పెట్టినకొత్తల్లో పద్దాలికి బెంగతో ముద్దదిగేదికాదు. మాలపల్లిలో పిల్లలు అయిదారేళ్ళ నుంచీ

పాలేరుతనాలు చెయ్యడం పద్దాలు చిన్నతనంనుంచీ చూస్తూనే వుంది. యిప్పటికి తన కొడుకుకూడా అంతంత చాకిరీచేస్తాంటే పద్దాలికి కడుపు తరుక్కుపోతున్నట్టయ్యేది.

అప్పుడప్పుడూ అటుగా వెళ్తూ వాడి చిన్న చిన్న చేతులు అంట్లుతోముతోంటే, వాడి చిన్న చిన్న కాళ్ళు గేదెల దొడ్లో వుచ్చగుంటలు పూడుస్తోంటే, వాడి బుజ్జికళ్ళెంట తుక్కూ దూగరాపడి నీళ్ళు కారుతోంటే ఆమె కడుపుతరుక్కుపోయేది. రానురానూ అదీ అలవాటయ్యింది.

"మాలముండ కడుపున పుట్టినాళ్ళకి సుకాలెట్టావస్తయ్యి. అళ్ళ రాతలెట్టావుంటే అట్టా అవుతుంది" అనుకుని వాళ్ళ ఖర్మకి వాళ్ళనొదిలి దుఃఖాన్ని దిగమింగి వూరుకుంది.

నాలుగురోజులాగ్నాడు సొరాజ్జెం పద్దాల్ని కావిలించుకుని 'సదువుకుంటానే' అన్నప్పుడు పద్దాలు మళ్ళీ పాత ఆశలు కూతురుమీద పెట్టుకోబోయింది. "ఏమో! ఇది కృపావతిలాగా పంతులమ్మ పనిచేత్తదేమో" అనుకుంది కానీ... రోజులు... కాని రోజులు...రోజులెట్టావున్నాయి? పిల్లముండ అనుకోటమే గానీ ఒకరోజు అది చితపలుతేకపోతే పొయ్యిమీద నంగజెట్టా వున్నా 'కింద' నంగతి నడవదు అదీగాక, వారంరోజులాగ్నాడే అనసూయమ్మడిగింది "దీన్ని పనిలోకి పంపుతావేంటే పద్దాలూ" అని.

"నేను కూలికినాలికిపోతే అదే వుడకేత్తందుండే' అంటే, "పోనీ, మాసూలునాటికైనా పంపు"మంది.

పోలిడు గింజలుడకేసేపనికి రోజంతా గుడిసెలోకూకుంటే ఎలా జరుగుతుందని రేపో, మాపో పిల్లని పన్లోకి పంపాలనే అనుకుంది పద్దాలు

"పనికి పంపితే దాని బతుకది బతుకద్ది. నదువులో ఏత్తే ఏంవొత్తంది? ఎన్నేళ్ళు నదవాలి? అందాకా ఇల్లెలా గడుత్తుంది?" అన్నీ ఆలోచించే పద్దాలు సొరాజ్జానికి చదువొద్దనేసింది.

ఇప్పుడు తిరపతి మొండిపట్టుమూలాన "ఏమో! దాని రాతెట్టావుందో!" అని లోపల్లోపల ఆశతో, "ఆడు నదివిచ్చుకుంటానంటన్నాడుగా అదీ సూద్దాం" అని,"మంచిరోజెప్పుడో చూడమంటారా ఆసార్లుగోరిని" అంది.

"మంచి పని ఎప్పుడు సేత్తే అప్పుడే మంచిరోజు. రోజు

లన్నీ వొక్కటేనే. అటిల్లో కొన్ని మంచియ్యా, కొన్ని సెబ్బ రయ్యా లేవు" అన్నాడు తిరపతి

చెల్లెల్ని పెద్ద చదువు చదివించేస్తానని అతనికి గర్వంగా వుంది

సౌరాజ్జెం సంగతి సరేసరి తల్లి వొప్పుకున్నట్టు గ్రహించ గానే రయ్యిన బోడి దగ్గరికి పరిగెత్తికెళ్ళి చేప్పేసింది.

"వాలే, బోడీ, నేను బళ్ళోకెళ్తన్నాను. మన పెద్దబడిలేదూ అందులోకి ఎళ్తన్నా ఇవ్వాల్టి నుంచే మా అన్న ఎలమన్నాడు" అని మహా ఆవేశంగానూ, ఆనందంగానూ చేతులు గాల్లోకి ఎగరేస్తూ వంకర్లు తిప్పుతూ సెప్తూంటే బోడి అయోమయంగా తెరిచిన నోరు తెంచినట్టే వుంచేసింది.

"అయితే, మరి మీకు సితపలెవరేర్తారే" అన్నాడు దాని తమ్ముడు

"ఏమో? మా అమ్మేరుకుంటందేమో?"

"మీ అమ్మ పేడేరుకోవద్దేంటి. చితపలిట్టా ఏరుద్దేంటి?"

సౌరాజ్జెం జవాబు చెప్పకుండా వొచ్చేసింది.

తిరపతి సౌరాజ్జాన్ని తీసుకుని పెద్దబళ్ళోకెళ్ళాడు

సౌరాజ్జెం చేతిలో పలకా, బలపమ్ముకొక్క వున్నాయి.

ఉన్న గౌనుల్లో కాస్త తక్కువ చిరుగులున్నది చూసి తొడి గింది పద్దాలు. తల కూడా కొంత సాపు చేసింది.

తిరపతికి స్కూల్లో పంతుళ్ళంతా బాగానే తెలుసు.

అన్నపూర్ణశాస్త్రి 'గారు' ఎదురుపడి "ఏరా తిరపతిగా హేవిటికథ? హిలా వచ్చావెందుకు?" అనివొత్తివొత్తి అడిగాడు.

తిరపతి కాస్త సిగ్గుతోనూ, ఎక్కువ వినయంతోనూ "ఇది మా సెల్లెండే. దీన్ని యిస్కూలుబళ్ళో చేరుద్దామని తీసుకొచ్చానండే" అని చెప్పుకున్నాడు.

అన్నపూర్ణశాస్త్రి వెటకారంగా నవ్వాడు.

"ఏమి హాలమొచ్చి పడిందిరా? మాల లమ్జా హొందు హులక్కూడా చదువు హోవాల్సొచ్చిందా?హందుహేహన్నారూ హలి హాలమూ అని. పైహో హోడముండకి చదవా? హాడ ముండల్ని చదివిస్తే చేతికందుతారా యిహ? పో, పో! దీనికి చదువెందుహురా? తీసుకుపో తీసుకుపోయి ఎక్కడన్నా పనిముండహా పెట్టు. నాలుగు మెతుహులన్నా దొరుహుతాయి"

అని హితబోధ చేశాడు— కడుపులు నిండిన అన్ని కులాల తరపునా.

తిరపతికి వుక్రోషం వచ్చింది సొరాజెం అప్పటికే బిక్క చచ్చిపోయింది. బళ్ళో చేర్చుకోరేమో ననుకుంది.

"పొంతులుగోరండి! మొన్న బెమ్మంగోరు జెండా ఎగరేసి నప్పుడు ఆడా, మగా అంతా, మాలామాదిగా అంతా సదువు కోవాలని అన్నారండి" అన్నాడు తిరపతి శాంతంగా.

"బ్రహ్మంగారా? అలా అన్నారా? అయితే సరే ఆపక్క నుంచీ లోపలికి వెళ్ళి సోమయాజులుగారుంటారు చూడు"— అని నోరు తెరిచి పళ్ళుచుట్టూ నాలిక తిప్పుకుంటూ వెళ్ళి పోయాడు శాస్త్రి.

సోమయాజులుగారికి తిరపతంటే ఇష్టం.

కండలు తిరిగిన శరీరం వంపులు తిరిగిన భుజాలూ, వ్యాయామం అంటే ఆయనకు అధికమైన ఇష్టం.

తిరపతి శరీరం నల్లరాతి విగ్రహంలానూ, వుక్కుపోత పోసినట్లుగానూ వుండటంవల్లనే సోమయాజులుగారికి తిరప తంటే ఆ కులాతీతమైన అభిమానం.

ఆయన, "తిండి గలిగితె కండగలదోయ్, కండగలవాడేను మనిషోయ్" అని చెప్పకుండా ఏ క్లాసునీ వదల్లేదు.

తిరపతిని చూడగానే ఆయన సాదరంగా ఆహ్వానించి, వచ్చినపని తెలుసుకుని, "అలాగేరా అబ్బాయ్! ఈ పిల్ల ముందని భారత, రామాయణాలు చదివేంత శక్తొచ్చేవరకనా చదివించాలి, మధ్యలో ఆపకుండా" అని బోధించాడు.

తిరపతి 'సరే' నన్నాక—,

సొరాజ్జాన్ని 'అ, ఆ'ల క్లాసులోకి పంపి, తిరపతికి స్కూలు ఆవరణలో వీడ్కోలిస్తూ, "ఏరా, నువ్వు ఏం తింటావురా? నక్కు గుగ్గిళ్ళా?" అని నవ్వి తిరపతి జబ్బలు పట్టుకుని రెండుసార్లు గుద్ది. "సెభాష్! శరీరాన్ని జాగ్రత్తగా కాపాడుకో. చెడుఅలవాట్ల జోలికిపోకు. శరీరం పాడైతే ఏముందిరా, జీవి తమే పాడయినట్లు" అని హెచ్చరించాడు

సొరాజ్జెం మనసు మనసులో లేదు సంతోషంతో వుక్కిరి బిక్కిరైపోయి ఒక మూల కూర్చుంది.

ఆ క్లాసులో అంతా చిన్న చిన్న చిగురుటాకుల్లాంటి... కలువమొగ్గల్లాంటి పిల్లలు. వాళ్ళు నోళ్ళు తెరిస్తే చిన్న చిన్న

దానిమ్మగింజల్లాంటి పేటువయినవి. చిన్న చిన్న మాటలు. రంగురంగుల గౌనులూ, ముద్దుముద్దు నడకలూ, అడుగులూ, శబ్దాలూ...

వాళ్ళకి 'అ, ఆ'లు నేర్పడానికి స్వతంత్ర భారత్ గవర్న మెంటు ఏర్పరచిన టీచరు పేరు సుందర్రావు. పేరులో తప్ప నడకలో, నడతలో, చూపులో, మనిషిలో సుందరత్వం ఏ కోశానాలేదు. అతన్నంతా చెవిటి సుందర్రావంటారు. ఆమాట తప్ప అతనికి యింక ఏ మాటా ఎంత అరిచినా వినపడదు. అంత చెవుడుపుట్ట ఎత్తుపళ్లు-అతని ఎత్తుమూతిలోంచీ కొండ ల్లోంచీ రాళ్లు పొడుచుకొచ్చినట్టుగా పేనుకొరుకుడుమీసాలూ, గిజిగాడి గూడులాంటి తలగూడు గరిమనాభి స్థానం తప్పి తుందా అన్నట్టు విపరీతమైన పొట్ట. ఏ నిమిషంలోనన్నా ముందుకు పడవచ్చుననే వూపుతో 'చెడుగుడు' ఆడుతున్న ట్టుండే నడకతో వో ఎలుగుబంటిలా వుంటాడు.

ఆక్లాసులో, అతన్ని చూస్తే ఏమీ సౌందర్యదృష్టి, కామన్ సెన్సూ లేనివారికైనా మల్లెపూల రాశిలోన ముళ్ళపంది ప్రవే శించిందన్నట్లుంటుంది.

సౌరాజ్యమనే సుందర స్వప్నంలో 'రాక్షసి' రాజు యీ సుందర్రావు.

అతనికి చెవుడుండడం ప్రకృతి అతనికి చేసిన అన్యా యమే కాని అతను ఒప్పుకోడు,తనక్లాసుపిల్లలంతా కుమ్మక్కై, కుట్రపన్ని తనకి వినపడకుండా మాట్లాడ్తారని అతని ఉద్దేశం అందుకే ఆ పసిపిల్లలందర్నీ నిష్కారణంగా వరసబెట్టిబెత్తంతో బాదుతుంటాడు.

సౌరాజ్యానికి పిలల్ని పంతుళ్ళిట్లా బాదుతారని తెలియదు. వారంరోజులు బడికెళ్ళిందో లేదో ఒళ్ళు హూనం అయ్యేట్టు దెబ్బలు తింది.

సుందర్రావు సౌరాజ్యాన్ని మరీ పగబట్టినట్టు బాదుతాడు.

అన్నపూర్ణశాస్త్రి అప్పుడప్పుడూ ఈక్లాసుకివొచ్చి ఆమాటా ఈ మాటా సుందర్రావుతో అంటూ వుంటాడు వాళ్ళిద్దరికి మంచి దోస్తీ చివరకి వెళ్ళబోయేముందు సుందర్రావుచేతిలో బెత్తంతీసుకుని గాల్లోకి నాలుగునార్లు వూపి 'జుంయ్, జుంయ్' మనే శబ్దానికి సంతృప్తిపడి, చివరిసారిగా అయిదో వూపుని, సౌరాజ్యాన్నీ, మరో యిద్దరు మాలపిల్లల్నీ కొట్టడానికి వినియో

గించి సుందర్రావుని చూసి సరసంగా నవ్వి మాల పిల్లలవంక మిడిగుడ్లతో చూసి వెళ్తూవుంటాడు.

అంత చిన్నవయసులోనే సౌరాజ్యంమనస్సులో మనుష్యుల్లో అసహ్యించుకోవాల్సిన వాళ్ళు వుంటారని ఒకవూహపుట్టింది.

స్కూలు పిల్లల్లో మాలపిల్లలు పదిమందికిలోపే. మిగతా మాలపిల్లలు కూడా దాదాపు సౌరాజ్యం లాగానే వున్నా కొంత మెరుగ్గా వుండేవారు. వాళ్ళ తండ్రులకి ఎకరమో, అరెకరమో పొలం,పుట్రా వుండేవి. సౌరాజ్యం మరీ అన్యాయంగావుండేది. ఎవరికీ లేని 'చిన్నతనం' సౌరాజ్యంలో ప్రవేశించింది.

స్కూలు మొదలైన దగ్గర్నుంచీ చాకలివాళ్ళు గోలగోల చేస్తారు రేవులోంచీ, ఆ 'గోల' మధ్యాన్నప్పూట కాస్త తగ్గితే అప్పటినుంచి చాకలి చెరువు గట్టుమీదే వున్న బియ్యంమిల్లు మొదలయ్యేది. 'చుక్ చుక్' మని. ఇంక అది మొదలయ్యిం దంటే ఏ అర్థరాత్రి వరకో మొత్తుకుంటూనే వుంటుంది.

వర్షాకాలంలో స్కూలు పాకల్లోంచీ కారే నీరు వర్షపు నీరు లాకాక కలుంపట్టిన మడ్డిలా మకిలిగా రబ్బిష్ కల్సిన నీళ్ళలా చుక్కలు చుక్కలుగా పిల్లలమీద పడేది. ఆ చుక్కలు బట్టలమీద పడితే, ఇక ఆ మరకలుపోయే మార్గం లేదు. పోగొ ట్టాలని తోమితే అది పెరిగి మరింత పెద్దదయ్యేది.

సౌరాజ్యానికి స్కూలంటేవున్న సరదా రానురానూ తగ్గి, అప్పుడప్పుడూ బడి ఎగ్గొడ్తోంది. తెల్సినప్పుడల్లా తిరపతి హెచ్చరిస్తున్నాడు బడికెళ్ళడం మానొద్దని. రానురానూ బడి ఎప్పుడు ఎగ్గొడదామా అనే ఆలోచనే సౌరాజ్యానికి.

ఎంకడికి పూర్తిగా పిచ్చెక్కినట్టే వొళ్ళంతా నీటిలోపడ్డ శవంలా నీరుపట్టింది. 'ఆకలి'అనడు...పీచుగడ్డం...ఇప్పుడు నవ్వూ ఏడుపూ కల్సి ఒక్కసారే. ఎక్కడికీ వెళ్ళడు.

గుడిశముందు నులకమంచం ఎక్కి దాన్లో కాళ్ళు ముడు చుకుని, వొరిగి వొరిగి పడుకునో, ఎక్కడికి చూస్తున్నాడో తెలియకుండావుండే చూపుతో కూర్చునో వుంటాడు

సౌరాజ్యానికి తండ్రిని చూసే విపరీతమైన ప్రేమ తల్లి ఏపూటకాపూట పొలాలవెంటా, పుట్టలవెంటా, తిరిగి తిండికి తిప్పలుపడుతూవుంటుంది.

ఇప్పుడిప్పుడు తండ్రినిచూస్తూ ఇంటి దగ్గరే వుంటోంది సౌరాజ్యం ఆమధ్య ఓసారి "క్ష" సరిగ్గా రాయలేదని పలకని

నేలకేసి కొట్టాడు సుందర్రావు. అది ముక్కలైంది. ఆ ముక్కలో ఓ పెద్దముక్క పట్టుకుని మర్నాడెళ్ళింది. పిల్లలు దాన్ని బిద్దలు గొట్టారు. పంతుళ్ళు సౌరాజ్జమంటే చూపే దురభిమానం, కక్షా పిల్లలనీ ఆకట్టుకొన్నాయి. వాళ్ళు ఏడిపిస్తారు సౌరాజ్జాన్ని. 'పలకలేదు'గా అనేవంకతో సౌరాజ్జం బడి పూర్తిగా మానేసింది.

తండ్రి తన పనులుకూడా తనుచేసుకోలేని స్థితిలో వుంటే అతని సేవలో ఎంతో శ్రద్ధగా వుండడం మొదలెట్టింది.

ఓ రోజు పొద్దున్న, "ఒరే అయ్యాలెగరా. పొద్దెక్కుతాంది" అనిలేపితే లేవలేదు తండ్రి.

ఎర్రెంకడు చచ్చిపోయాడు. అతను చచ్చిపోగానే ఆ కుటుంబానికి సగం భారం తగ్గింది.

* * *

ఈమధ్య 'మాలరావులోరి' గుడి దగ్గర వాతావరణం మారింది. ఇదివరకులా అక్కడ 'వెలియోవెలకో' పద్యాలు కా దొరల దుండగాల గురించి కబుర్లు సాగుతున్నాయి.

మాలసహదేవుణ్ణి ఆళ్ళ దొర ఎర్రసత్తెంగారు కొట్టాడు సహదేవుడు సిన్నోడో,చితకోడో కాదు.నలభయ్యేళ్ళుదాటినోడు

ఎర్రసత్తెం గుడివాడనించి ఎందుకో మాంచి కోపం మీదొచ్చి 'గొడ్లకి జనుమేశావురా' అని అడిగి 'ఇంకాలేద్దొరా అని సహదేవుడనగానే ఒక బూతు తిట్టు విసిరి, "ఇంతసేపే చేస్తన్నావురా?" అని మీద మీదకెళ్ళి రెండు లెంపకాయ లేశాడు సహదేవుడు తిరగబడేవాడేగానీ తెల్లబోయి వుం పోయాడు అంతలో ఎర్రసత్తెంగారి వియ్యంకుడొచ్చాడు క తరంనుంచి, ఆయన ముందు దొర పరువు కాపాడాలనుకు మాట్లాడకుండా వూరుకుని పనిలోంచీ ఇంటికొచ్చాక ముసు కప్పుకుని పడుకున్నాడు.

సహదేవుడు— తొమ్మిదేళ్ళప్పుడు- ఎర్రసత్తెంఇంట్లో చిన పాలేరుగాచేరి అక్కడే పెద్ద పాలేరు పనిలోకి మారి ముప్పై ఏళ్ళనుంచీ వెయ్యని చాకిరీలేకుండా చేస్తున్నాడు.

ఇంట్లోకి నీళ్ళు మొయ్యడం, గొడ్లనిమేపడం దగ్గర్నుంచీ దుక్కులు దున్నడం, నాట్లువెయ్యడం, కలుపులు తియ్యట కోతలు కొయ్యడం, కుప్పలేయటం, కుప్ప ల్నూర్చటం, వ పురులుగట్టడం దాకా ఒక్కటేమిటి? ఎర్రసత్తానికి సహదేవు చేసిపెట్టని పనులులేవు. ఎన్నాళ్ళు ఎన్నేళ్ళు ఎన్నెన్నిపను

టకీటు. బస్తున్నాడు. ఇరవైయ్యేళ్ళుగా అలసిఒళ్ళో. మనసూ, సర్వశక్తులూ ఎర్రసత్తెం పాలేరు తనానికే అప్పజెప్పాడు.

ఇంటికొచ్చి ముసుగు పెట్టిన మొగుణ్ణి పెళ్ళాం "ఏంట్రా మావా!" అన్నాపలకడూ;

"ఓలయ్యో సూడ్రా" అని పిల్లముండన్నా వులకడూ!

చిరిగినసల్ల దుప్పట్లోనుంచీసహదేవుడి ఏడుపువిని అతని పెళ్ళాం కోటి 'ఓరమావో. ఏంజరిగిందరో? ఇదెక్కడిబాదరో? అసగా వురుమంది.

చుట్టుపక్కల గుడిశెల సీతాళ్ళూ, రావుళ్ళూ, ఎంకటేసులూ, యాకోబులు అంతా పోగయ్యారు, "ఏంటేంటని"

"ఏంలేదు" అన్నాడు సహదేవుడు

"ఏంలేకపోతే ఎర్రేంట్రా? అన్నాడు చిన్నెంకడు.

"ఆడమ్మ గుర్తొచ్చుంటంది" అంది అబ్బిగారి బుచ్చి.

సహదేవుడి తల్లి పెద్ద జబ్బుచేసి మందులేక చచ్చిపోయి నెలదాటలేదింకా.

ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోయారు.

ఏడుపుమానని సహదేవుణ్ణి అడిగింది కోటి.

"ఏంటి మావాఁ? అట్టా కువిలికువిలి ఏడుస్తున్నా? ఏంవైంది?" అని గుచ్చి గుచ్చి అడిగింది

"ఏం లేదులేయే. మనసు బాగాలా. నువ్వేడమాక. అదే సద్దుకుంటాదలే" అన్నాడు సహదేవుడు.

భర్త అ మాత్రమన్నా తనతో మనసు విప్పి చెప్పుకున్నందుకు కోటి మనసు సమ్మదించింది.

సహదేవుడు నెమ్మదిగాలేచి రాములోరిగుడి కాడికెళ్ళాడు అక్కడ ఎదమందినీ చూసి ఆపుకోలేక పక్కన కూచున్న పొట్టెంకడితో గొణుగుతూ సంగతి చెప్పేశాడు. పొట్టెంకడు శామేల్‌తో అన్నాడు.

"ఆఁ సాదేవుణ్ణి కొట్టాడా ?" అని విన్నవాళ్ళంతా అగ్గి మింగినవాళ్ళలా మండిపడ్డారు.

"సిన్నప్పుడు నాలుగు దెబ్బలేస్తె ఏశాడు. నీ వొంటిమీద సెయ్యెట్టేశాడ్రా ?" అని అందరూ సుట్టూచేరారు

ఎర్రసత్తెం పదిపదేనేళ్ళ కిందటకూడా సాదేవుణ్ణి కొట్టకపోలేదు. అప్పుడింత కష్టం తోచలేదు సాదేవుడికి

అప్పటికప్పుడు 'దొర' ఇంటికెళ్ళి "ఏంటీ అన్నేయం.

మేం సుదుసులంగానూ? మాకు మానాభిమానాలూ, సిగ్గు లజ్జలూ లేవా? అసఁడుగుహారి" అన్నాడు శామేలు.

"ఏంటిరా, అడిగేది? పెతీకారం తీసుకోవాల సాదేవుడు గాడు "అణ్ణి" మళ్ళీ కొట్టాల. మేమంతా సూడాల" అన్నాడు తిరపతి.

వాదోపవాదాలు తీవ్రంగా జరిగినయ్. ఎఱ్ఱసత్తెం తమనే కొట్టినంత అవమానంవేసింది ప్రతీవారికి.

అసహనంగా అరిచారు. ఆవేశాలూ, ఆలోచనలూ కల బోసి చివరకు అప్పుడే వెళ్ళాలని తేల్చారు.

"ఇంక పదండెహె" అని లేవాడు తిరపతి

"ఎళదాంగాని ఎళ్లి ఏం మాట్లాడాలిరా!" అన్నారు కొందరు లేవకుండా

"అంతా అక్కడికెళ్లింతరవాత సూసుకుందారి లెగండి ముందు"

"అట్టయితే యింక అయినట్టే, అక్కడ ఏటికొకడూ, కోటికొకడూ లాగుతాడు. ఎఱ్ఱసత్తెం అసాద్యుడు" అన్నాడు కోటేసు.

"ఆ మాటా నిజమే..." అన్నారు ఒకరిద్దరు.

అప్పుడు మళ్ళీ కిందామీదాపడి "తిరపతిగాడు సెప్పినట్లా "వూ" కొడదారి. అడిమాటకి తిరుగులేదు" అనుకొని ఒక్కొక్కరు హెచ్చరించుకుంటూ బయల్దేరారు.

దారిపొడుగూతా సహదేవుడి గుణగణాలే మాట్లాడుకున్నారు. ముప్ఫై యేళ్ళ నుంచీ అడ్డమైన చాకిరీ చేస్తున్నాడన్న యిశ్వాసమన్నా లేకుండా సహదేవుణ్ణి కొట్టటం ఏమిటని విపరీతంగా బాధపడుతున్నారు. సహదేవుడు నెమ్మదైనవాడు ఒక మాట ఎక్కువ మాట్లాడ్డు. కొమ్మైనా విసరని గోవులాంటివాడు.

సహదేవుడూ, మరికొందరు కూలీలూ కలిసి కష్టపడి ఏటేటా ఎఱ్ఱ సత్తెం పొలాలు సూరుస్తున్నారు. ఇల్లు రూపం మార్చారు. పెంకుటిల్లుస్థానంలో డాబా, చుట్టూ ఎత్తైన గోడలు వచ్చాయి. 'ఎఱ్ఱసత్తెం పిల్లల పెళ్ళిళ్ళు 'మా వైభవంగా' చేసుకున్నాడు.

గొడ్లసావిడ రూపం మారింది. పాక పెంకుటి చావిడి రూపం దాల్చింది. గేదెలూ, ఆవులూ, ఎడ్లూ పెరిగాయి వాటికి సౌకర్యం పెరిగింది.

ఎఱ్ఱసత్తెం గుడివాడలో ఒక 'విలాస'వంతమైన జీవితానికి

అలవాటుపడి వూళ్ళోకి రావడమే అంతంత మాత్రం అయిపోయింది.

ఎర్రనత్తెం వున్నాలేకపోయినా ఇంటిదగ్గిరా, పొలాల్లోనూ ఒక్క పొరపాటూలేకుండా పనిచేసే సహదేవుడిమంచితనమూ నిషాప్రత్యమూ, వొళ్ళు దాచుకోకుండా కష్టపడేస్వభావమూ, దొరమీదున్న గుడ్డివిశ్వాసమూ, దాని ఫలితం అదీ!

వానొచ్చేముందున్న ఆకాశం కిందుగా వూరు వీధుల్లోంచి ఎర్రనత్తెం ఇంటివేపు నడుస్తున్నారు "నూల మనుసులు".

సాయంత్రం పాలేర్ని కొట్టానన్న సంగతే గుర్తులేకుండా, గుర్తురాకుండా, చుట్టూ గదులు పెంచుకున్న డాబాలో, దోమ తెరలు కట్టిన ఎత్తైన పందిరిమంచంమీద పడుకుని నిశ్చింతగా నిద్రోతున్నాడు ఎర్ర నత్తెం. రాత్రి పదకొండింటికి తన మీదకి మరికొంతసేపటో మాలపల్లి వస్తోందన్న సంగతి అతనికి తెలిసే అవకాశంలేదు అదొచ్చి మీదపడేవరకూ

అందరితోపాటు నడుస్తున్న సహదేవుడికి 'తనదొర'మీద సాయంత్రంవచ్చినకోపమూ, అసహ్యమూ,ఏవగింపూ కొంచెం కొంచెంగా బలహీన పడుతున్నాయి.

"ఈళ్ళు వాటంచూస్తే దొరని ఒక్కేటుకి నరికేత్తారేమో" అనే అనుమానం వచ్చింది సహదేవుడికి. అలా అనుకోగానే అతనికి వొళ్ళంతా చిరుచెమట్లు పోశాయి ఆ వానగాల్లో.

నరనరానా జీర్ణించివున్న స్వామిభక్తితో సహదేవుడికి ఏం జరుగుతుందో అనే భయం ఆవరించింది.

పక్కనున్న కాంతిగాడితో "పోనీ, ఈ పాలికి వొదిలేద్దా మేరా ?" అన్నాడు.

"ఇంకోపాలి ఆ ముక్కన్నావంటే అణ్ణొదిలి నిన్ను పొడుత్తాం" అన్నాడు కాంతిగాడు.

ఎర్రనత్తెం డాబా ఇంటిచుట్టూ పెద్ద ప్రహరీగోడ వుంది. ఆగోడకి ఎత్తైనతలుపులున్నాయి. అవి లోపగెడ పెట్టివున్నాయి. ఇప్పుడింక ఎర్రనత్తెం కోటలోవున్న రాజే!

ఆ తలుపుల ముందు నుంచున్నాక అందరూ కాస్త యిరుకున పడ్డారు.

వెళ్ళగానే ముందు యిలా చెయ్యాలి, తర్వాత అలా చెయ్యాలి, ఫలానావాడు ఫలానమాట అనాలి, వాడలా ప్రవర్తిస్తే మనమిలా ప్రవర్తించాలి? అని ఖచ్చితంగా, స్పష్టంగా

ఏదీ ముందే అందరూ అనుకోకపోవడంవల్ల అందరికీ కొత్త అనిపించింది అక్కడలా నించోటం.

అందుకే అయిదు సంవత్సరాల్నుంచీ ఆ యింటి చుట్టూ వున్న ప్రహరీగోడా,దాని తలుపులూ, అందరికీ ఇప్పుడు అర్థం అయ్యాయి, కొత్తగా!

అందరూ సహదేవణ్ణి చూసి "పిలవరా" అన్నారు.

అతను కాస్త తటపటాయించి తలుపు మీద కాస్తదరువేసి 'దొరా' అని బిగ్గరగా కేకేశాడు. గొంతు సరిగ్గా పెగల్లా.

దొర లేవలేదుగానీ, 'దొరసాని' మెలుకువగానే వుంది. సహదేవుడి కేక విని వచ్చి తలుపు తీసింది.

తీసినావిడ తీసినట్టే "మాలమంద"ని చూసి బిత్తరపోయింది. ఎందుకిలా అయిందో వూహించడానికైనా ఆవిడికి సాయంత్రం దొర సహదేవణ్ణి కొట్టింది తెలియదు, తనని కొట్టింది తెలుసు గానీ!

సాయంత్రం కవ్వంతో మజ్జిగ చేస్తూ పార్వతమ్మ అనుకుంది "ఎందుకీ ఎదవజన్మ. ఇంతమంది పిల్లల్ని కన్నాను. పెళ్ళిళ్ళు చేశాను. పేరంటాళ్ళు చేశాను. ఆయనమాత్రం ఇన్నేళ్ళొచ్చినా గుడివాడలో సానులెంట తిరగటంమానలా. అసలు కాపరంజేసేదే అక్కడ. పైగా కొడుకాడు ఇంటికొచ్చినప్పుడల్లా. సానులెంటా, సన్నాసులెంటా, బైట తిరుగుతాంటేనే బాగుంటుంది, యింటికి రాకుండా, ముదనష్టపాడు" అనుకుంది.

"ఏంటీ మాలమందంతా అర్ధరాత్రి ఇంటిమీదకొచ్చి పడ్డారూ?" అనుకుంది. ఆమాటే అంది-"ఏంరా సాదేవుడూ? ఏంటీళ్ళంతా ? యెందుకొచ్చారు ?"

"అదే తేల్చుకోటానికొచ్చాం దొరసానమ్మా అణ్ణిపిలు"... తిరపత.

"ఎవణ్ణిరా ?"

"అణ్ణే దొరోణ్ణి "

"అఁ..." ఆమె తన జన్మలో వూహించలా. ఓ మాల ముండాకొడుకు ఎంతో ఆస్తికి వారసుడైన. పెద్దఖాడైన, మర్యాదస్తుడైన, ఇంకా ఎన్నో అయిన తనభర్తని 'వాడు' అంటాడని.

బిత్తరపోయింది రెండోసారి.

"పిలు... పిలు..." అనే కేకలువిని లోపలికి పరిగెత్తింది.

భర్త మంచం దగ్గర కెళ్ళి, "ఇదిగో మిమ్మల్నే" అంది హీన స్వరంతో.

"ఏంటే ? తెల్లారిందా ?"

"అదికాదూ... అళ్ళంతా వొచ్చారు" అంది బెరుకుగా.

"ఎవళ్ళే సరిగ్గా చెప్పేడుస్"

"మాలాళ్ళంతా వొచ్చారు. నా కేంటో భయంగా వుంది."

"మాలాళ్ళంతానా? సాదేవుడు గాడొచ్చాడా?"

"అఁ ముందే వుండాడు మొద్దులాగా నుంచున్నాడు. మాట్లాడ్తల్లా"

"అదా సంగతీ...అందాకా వొచ్చిందీ సరే చూస్తాపద" అని వీరావేశంతో లేచాడు ఎర్ర సత్తెం

"జాగర్త! గొడవెట్టుకోమాకు అళ్ళతో"

"గొడవేంటే, ఇరికి ముండా ఒక్కొక్కణ్ణీ పాతెయ్యనూ? పాలేరోణ్ణొక దెబ్బేస్తే యింటిమీదకి దండెత్తుతారా?" అని ఎర్రసత్తె పంచె సర్దుకుంటూ, ఆవేశంగా వీధి గుమ్మం దగ్గర కెళ్ళాడు.

ఇరవైమందికి తక్కువలేకుండా కనపడ్డారు, అరుగులకింద మెట్లమీద

దొర అరుగుమీద కెళ్ళాడు.

"ఏంట్రా లంజా కొడుకుల్లారా! తెల్లారిందా మీ ఆగడా లకి? నా యింటిమీద ఇంతమందొక్కసారి వొచ్చిపడ్డారు ఎం దుకురా. నేనేమన్నా మీ పెళ్ళాల పక్కన పొడుకున్నానా?... వొక్కడూ మాట్టాడ్డేరా?" అహంకారంతో వూగిపోతున్నాడు ఎర్రసత్తెం

ఎర్రసత్తెంగారింటి ముందు ఏదో కలవరంగా వుందని లేచిన దొరలు యిద్దరు ముగ్గురు అటొచ్చారు.

కుక్కలరువులిని లేచివచ్చిన వొకడు అంతమందిని అక్కడ చూడగానే వెనక్కితిరిగి నలుగురికీ చెప్పడానికి పరి గెత్తాడు అంతకుముందే.

"ఏరా, సాదేవా? ఏవైందిరా? ఈళ్ళంతా ఎందుకొచ్చినట్టు?"

"నువ్వు నన్ను కొట్టావుగా సందేళ. అందుకు అడుగుదా మని వచ్చారు దొర"

"దొర! నేను దొరనని నీకింకా గుర్తుంటే యిట్టాగేనేరా చేసేది? మీరు కిరాతకపు లమ్డికొడుకులురా. చంపుతాకూడా

"చంపుతున్నాందొరా" అంటారు. ఏమడుగుతార్రా? అడగండి. కొట్టావా అనడుగుతారా? కొట్టారా! కొట్టా. ఈణ్ణేకాదు, నా చిన్న కొడుకునీ కొట్టా. నా పెళ్ళాన్నీ కొట్టా. అడగండిరా. ఆళ్ళని ఎందుకొట్టావనికూడా అడగండిరా. నా కొడుకెట్టాగో, నా భార్యె ట్టాగో ఈ సాకేవుడుకూడా అట్టాగే. ఈళ్ళకి నేను పెట్టేప్పుడు పెడతా. కొట్టేప్పుడు కొడతా. నేను కొట్టకపోతే ఎవడు కొడ తార్రా? కొట్టినా నేనే, కోసినా నేనే. పెట్టేవాణ్ణి నాకామాత్రం హక్కులేదా?"

"అప్పనంగా పెడతన్నావేంటండే?" అన్నాడు తిరపతి కోపంగా.

"పెడతన్నా, పెడతన్నానంటావు దయదల్చి పెడతన్నా వేంటి దొరా?" అన్నాడు శామేలు.

మాలాళ్ళు నలుగురైదుగురు ఆ మాటె నాలుగు రకాలుగా అన్నారు.

"ఆడు రేత్తిరీ, పొగులూ రెక్కలు ముక్కలు చేసుకుని, కష్ట పడతాంటే ముస్టి మూడుగింజలు యిడలిత్తన్నావు, అంతేగా! ఆడేం పొట్టు పొరుపులమీద దొర్లటల్లా, పంచ్చ బచ్చ పరమా న్నాలు తినటల్లా. కటికనేలమీద పడుకుంటన్నాడు. గంజి నీళ్ళు తాగుతున్నాడు. ఆడు కష్టపడి మీకు సంపాదిచ్చిత్త న్నాడు. అసాలక పెళ్ళికెదిగిన కొడుకులున్నాణ్ణి, నలబయ్యే ళ్ళాణ్ణి వొళ్ళెరుసుకుని కష్టపడుతున్నాణ్ణి... అణ్ణికొట్టావునువ్వు. నువ్వు తప్పయిపోయిందని చమాపణచెప్పాలి మా నాదేవుడికి తిరపతి తలెగరేశాడు

తిరపతి అలా అనగానే తన పరపతంతా గంగలో కలిసి పోయినంత బాధపడిపోయాడు ఎర్రనత్తెం.

"వురేయ్ తిరపతిగా నువ్వెర్రెంకడి కొడుకువి కాదంటరా. నీకూ ఎర్రెక్కిందరా! ఎర్రిలంజాకొడకా. నీకు ఎర్రెక్కిందిచాలక మాల్లంజాకొడుకులందరికీ ఎర్రెక్కించి అర్ధరాత్రి నా మీదకి యుద్దానికొచ్చావురా! మీదంతా మాలబుద్దేరా. తల్లిరొమ్ము గుద్దే బాపతరా మీరంతా! నా కళ్ళముందునుంచీ ఎల్తారా ఎల్లరా?" అని తిట్లకి లంకించుకున్నాడు.

అతని సహజమైన కులమదం, అధికారమదం, ధనమదం అన్నీ అతన్ని అలా పేలిస్తున్నాయి.

ముగ్గురు నలుగురు పెద్దమనుషులు చేరారు "ఏంటేంటంటూ"

మాలల రక్తం వుడుకుతోంది ఎర్రనత్తెం మాటలకి.

"తిట్ల పంచాంగం కట్టిపెట్టి సాదేవుడితో తప్పయిందని చెప్పుకో బుద్ది తక్కువైందని చెప్పుకో" అన్నాడు తిరపతి.

ఎర్రనత్తెం ఎర్రెత్తి పోయాడు.

'అరేయ్ మాల నాకొడకా. నీ అంతు చూడకుండా వదల్నరా" అంటూ, కత్తి గొడ్డలో తేవడానికన్నట్టు యింట్లోకి పరుగులు తీశాడు.

"రా, రా నీ అంతు సూడ్డానికే యిక్కడికొచ్చాంలే" అన్నాడు అప్పటివరకూ నోరువిప్పని 'పోలిగాడు'.

అంతా ఆవేశంగా వున్నారు. కాని ఏం జరగబోతోందో తెలీకుండా వున్నారు.

అప్పుడు మరికొందరు 'దొరలు'వచ్చారు. గోడలచాటుగా దొరసానులూ వచ్చారు.

మాలపల్లినుంచీ ఘనలీ ముతకా వచ్చారు.

పిల్లా, పాపా పరుగున తీసుకొచ్చారు. పద్దాలూ, సారా జెజ్జూం, బోడీకూడా వచ్చారు.

ఇరు పక్షాల తర్జనభర్జనలు సాగుతున్నాయి.

పెద్దోరి బెదిరింపులూ, చిన్నోరి ఎదిరింపులూ ఎక్కడికక్కడసాగాయి.

మంచివాడూ, తెలివైనవాడూ అని పేరుగాంచిన 'బ్రహ్మంగారు' రానేవచ్చారు.

మాలాళ్ళంతా 'దండాలు దొరా!" అన్నారు.

"దండాలురా! ఏంటిరా అర్ధరాత్రి తగులుకున్నారు. ఏళాపాళా లేదంటారా? చిన్నంతరం పెద్దంతరం లేదంటారా? మీరింతమంది ఒక్కసారిగా యిట్టా రావటం అనేది, అదెంతగోరమైన తప్పో మీకు తెలవదురా. తెలిస్తె మీరిట్టా వొచ్చేవాళ్ళేకాదు. యిప్పుడు, ఈ నిమిషాన మిమ్ముల్నందర్నీ 'బొక్క'లోకి తొయ్యొచ్చురా, మీరిట్టా చేశారని. యిట్టా పలానా వూళ్ళో, పలాన మాలాళ్ళంతా మూకుమ్మడిగా వొచ్చివూరుమీదపడ్డారు అనితెలిస్తే ఢిల్లీనుంచీ గవర్నమెంటు సైన్యాలొచ్చి మిమ్ముల్నందర్నీ చంపి మరీ కవాతు కొట్టుకెళ్తాయిరా పిచ్చి సన్నాసుల్లారా మీరు ఎర్రాళ్ళు. అందుకనే యిటువంటి ఎర్రిపనులు

చేస్తున్నారు. లేకపోతే ఎర్రసత్యంగారు ఎటువంటి వారూ? ఒకరి జోలీ, శొంఠీ ఎరగరే. అటువంటివారిమీదా మీ పరాక్రమం. ఆయనసలు వూళ్లో ఉండడమే తక్కువ అసలాయన ఎప్పుడొచ్చాడు వూళ్లోకి? ఏమండీ వెంకట్రావుగారూ? ఈయన వూళ్ళో కెప్పుడొచ్చారు" అని వెంకటయ్యని అడిగాడు బ్రహ్మం.

వెంకటయ్య 'వెంకట్రావుగారూ!' అనే సంబోధన వినగానే సర్వం మర్చిపోయాడు. అందుకే జవాబు చెప్పలేకపోయాడు అయోమయంలోపడి.

"సందేళొచ్చాడండే దొర" అన్నాడు సహదేవుడు.

బ్రహ్మం వచ్చినప్పట్నించి అక్కడున్న మాలవాండ్ని చల్లబర్చటానికి, భయపెట్టటానికి చెపున్న మాటలు వింటూ చాలా మంది నీరసంతో చల్లబడుతున్నారు.

పోలిగాడన్నాడు— "అది గాదు దొరా. నువ్వే సెప్పు నాయం, అన్నాయం సాదేవుడు ఎంతప్పట్నుంచీ ఏవజాన పని చేత్తన్నాడో తవురికి తెలుసుగందా. ఈయాళ అణ్ణి కొట్టాడంటే యేవనుకోవాల?"

"ఏమిటీ, కొట్టాడా? ఛ! ఛ! ఎంత పనిచేశాడు సత్యం గారు? నేను కనుక్కుంటాను" అన్నాడు బ్రహ్మం.

"కనుక్కోటం గాదులెండి ఆయన్తో ఇప్పుడే ఇక్కడే మాఅందరి సమచ్చానా తప్పయిందని చమాపన సెప్పించాల. అప్పుడే మేమంతా ఇళ్ళకి పోతాం" అన్నాడు మళ్ళీ తిరపతే.

"వుప్పుడే చెప్పిచ్చండి" అన్నారు పోలిగాడూ, శామేలూ.

బ్రహ్మానికి బాగా కోపమొచ్చింది. అంతే ఆ కోపాన్ని లోపలే అట్టిపెట్టుకుని పైకిమాత్రం "ఇళ్ళకి పోం. క్షమాపణ చెప్పందే" అనే మాటుండ చూడరా, తిరపతీ అదంత మంచి మాటకాదు. నాకు తెలవకడుగుతా! ఒరే! తిరపతీ! సాదేవుడికి తండ్రిలాంటాడు గందా సత్యంగారు. ఆయన్తో క్షమాపణ చెప్పించుకుని సాదేవుడుగాడు రేప్పొద్దున వూళ్ళో తలెట్టా లేపుకు తిరుగుతాడురా. అందువల్ల పిచ్చ వూహలు మాని, మీరంతా యిళ్ళకెళ్ళండి. నేను సత్యంగారితో చెబుతా. సాదేవుణ్ణి మళ్ళీ ఇంకోసారి కొడితే... కొడితేగాదు... చిన్న మెత్తు మాటన్నా సరే... నా దగ్గరికి రండి, ఆ పూచీ నాది..." అన్నాడు దొరల తరపున వకాల్తా పుచ్చుకున్న బ్రహ్మం దొరగారు.

ఆ మాటలకి బ్రహ్మం చుట్టూ చేరిన మాలపల్లి పెద్దలు, "ఇంక నడంద్రా బెమ్మంగారు ఈ పాలైతే తనుసూత్తానన్నాడు గందా? ఇంకనడండి. అయిందేదో అయిపోయిందుగా. ఇక అవ్వకుండా చూత్తాన్లే" అన్నారు

చాలామంది యువకులుకూగా నెమ్మదిగా కదలారు.

సహదేవుడు బ్రహ్మం పక్కనుంచీ దూరి గొడ్ల చావిట్లో కెళ్ళాడు. ఒకసారి గొడ్డచమూ సొడ్డామని! ఒకసారి గొడ్లముందు గడ్డివుండో లేదో చూసొచ్చాడు.

తిరపతీ, పోలిగాడూ, శామేలూ కోటేసూ ఇంకాఒకళ్ళిద్దరు కూడా నిరుత్సాహంగా అసంతృప్తిగా ఇళ్ళకి బయల్దేరారు.

గుడివాడనుంచొస్తూ దారిలో కన్నయ్య.

"ఎవర్రా ఎళ్ళేది?" అన్నాడు.

"నేను తిరపతిన్నెగండి."

"ఏంటీయాళ దాకున్నా..." అని తిరపతి చెప్పేఅవకాశం కూడా ఇవ్వకుండానే "ఎట్టుండిరా మీదొర పొలం? తెగుఁజ్జూసిం దన్నారే" అని అడిగాడు.

"మొన్న మొందుగొట్టి ఎరువేసినాక కొత్త తిప్పుకుందండే. పచ్చబడింది"

"జనుమెట్టుందిరా?"

"జనుమెక్కడుందుండే. పురుగు నాకేసింది"

"దేశవంతా అట్టాగేతగలడినట్టుంది తొండంగి బాగుందిరా"

"అది అయ్యిపోయిందుండే. రేపట్నుంచీ గొడ్డకేం తేవాలో తెలవట్లా.

కన్నయ్య మెడమీద కర్ర అడ్డం తిప్పుకుని రెండుచేతులూ కర్రమీదేసుకుని, "వత్తారా" అని వెళ్ళిపోయాడు.

"నీయమ్మ దొరలు! జన్మంతా అరికి శాకిరీయేనేంట్రా? అళ్ళ గొడ్లకి మేతలేకపోతే మనకే-టి?"

"గొడ్లని సూత్తే ప్రేణం వూసూరు మంటుందిరా, జన్మంతా ఎక్కడ సేత్తాంలే కాలం అంతా ఇలాగే వుంటుందా?"

ఒంటిగంట దాకా మాట్లాడుకుని ఇళ్ళకి వెళ్ళారు.

* * *

సహదేవుడి విషయం జరిగినప్పటినుంచీ 'మాలపల్లనా' 'మాల ముండాకొడుకు'లన్నా దొరలకి వొళ్ళు మండిపోతోంది. అంటే వాళ్ళంటే ఇదివరకు ప్రేముందని కాదు. అప్పుడు ప్రేమాలేదు, మంటాలేదు.

అదును చూసి వొక్కో... కొడుకు బొయికలూ యిరగ్గొట్టా లనే చూస్తున్నారు.

"ఏదెలావున్నా తిరపతిగాడున్నాడే, వాడు... రేపు వూరు వూరంతట్నీ మడత పెట్టి తినేస్తాడు వాడి పనిబడితేనే వూరికి సగంపీడ పరగడవుతుంది" అని ఆ వూరుని వుద్దరించే ఆసాములు గట్టిగా విశ్వసించారు.

"అందుకే చీటికి, మాటికి తిరపతితో 'నాగభూషణంగారు' తగాదా లేసుకుంటున్నాడు.

దక్షిణప్పొలం వెళ్ళిరాగానే, "ఏరా, తిరపతిగా! అదేవుడి మాన్యంలో నీళ్ళెట్టా వున్నాయ్‌రా" అంటాడు నాగభూషణం దొర.

"వుప్పుడే దక్షిణప్పొలం ఎళ్ళొత్తన్నా నండే నీళ్ళు సరిపడా పడ్డయ్. కన్నాలు కట్టేసివత్తన్నా. బువ్వదిని ఇటెళ్ళొత్తా"

"కన్నాలు కట్టెయ్యడానికి తొందరయ్యిందన్నమాట. ఆ దేవుడి పొలం చూసే ఓక్కులేక నారంతా చమ్చాయికున్నాక అప్పుడెళ్ళరా. నువ్వా...వొరే, తిరపతిగా, ఇష్టముంటే చెయ్యి సరిగ్గా. లేదూ, "అయ్యా! నాగభూషణంగారూ! నమస్కారం నేనెళ్తన్నానూ. మీ దగ్గిర పాలేరుతనం వొదిలేసినా, నేను రాజకీయాల్లోనే బతగ్గలను" అని నాకో నమస్కారంకొట్టు. నిజంగా నువ్వెళ్తానంటే నేనే కొడతాగా, నమస్కారం" అని పిచ్చిపట్టిన వాడిలా అరుస్తున్నాడు నాగభూషణం ఈ మధ్య తరచుగా.

తిరపతి పాలేరుతనం నుంచి వెళ్ళిపోతే నాగభూషణానికి నిజానికి చాలా దండగ.

తిరపతి వొళ్ళొంచి పనిచేస్తాడు. అతను చేసే చాకిరికి ముగ్గుర్ని పెట్టినా చెయ్యలేరు.

కాని, వూళ్ళో పెద్దమనుషులు ఎదురైనప్పుడల్లా, "ఏం బావా! అడు, ఆ తిరపతగాడెలా వున్నాడు ఊ! పెంచు పెంచు బాగా పెంచు పాముకి పాలుపోసి పెంచారంటలే నీబోటాడే ఎనకటికి

వాడొకరోజున నీ మీదకి కర్ర లేపుతాడు. అప్పుడు నీకు తెలుస్తుంది. "అరే! ఇంతమంది మనాళ్ళు ఇన్నిరకాలుగా చెప్పినా వినలేదే. ఇప్పుడు నేనేం చెయ్యను" అనుకుంటావు. ఆ సమయానికి నిన్నాదుకోడానికి మేమెవ్వరమూ పనికిరాము కూడా.

నా మాటిను. ఏదోవకొంకెట్టి అణ్ణి తీసెయ్యి. నిజమే. అడు చాలా పనిచేస్తాడు. అడు పోతే నీకు మళ్ళీ అటువంటోడుదొరకడు. అదీ నిజమే. కాని...అన్నిరోజులూ మనయేకాదు. ఇటువంటాళ్ళ విషయంలో చాలా జాగ్రత్తగావుండాలి. అణ్ణి మళ్ళీ మనాళ్ళెవళ్ళూ పనికిపెట్టుకోరు. అది నేను రానిస్తా గుర్తుపెట్టుకో" అని హెచ్చరించే బావలూ, బాబాయిలూ, మావయ్యలూ, నాగభూషణానికి ఎందరో–బైటికెళ్తే బజారునిండా!

వాళ్ళన్నారనే కాకుండా నాగభూషణానిక్కూడా తిరపతిగాడు ఎర్రనత్యాన్ని కొట్టడానికెళ్ళినాళ్ళకి నాయకత్వం వహించాడనే సరికి కోపం వచ్చింది.

"నువ్వు నాయకుడివవ్వాలా పోయి" అనంటే తిరపతి మాట్లాడకుండా నుంచోడం మరీ కంపరంగా వుంది నాగభూషణానికి.

"అదేంలేద్దొరా ఏదో చిన్నతనం. తెలిసో, తెలవకో తప్పయిందంటాడు. అనే బాపతుమాటేరాదు అడినోట్టోంచి.

పైగా "చేత్తానేవున్నా దొరా! వుత్తపున్నాని నన్ను తిడతన్నావు నువ్వు. అంతనేను అక్కర్లేదంటే నువ్వే తీసెయ్యి. నేనుగా నేను పని మానెయ్యను" అన్నాడు ఒకసారి తిరపతి.

అందుకే 'బంగారంలాంటి దాపటెద్దు' చచ్చిపోవడానికి తిరపతే కారణమని చెప్పి, "నువ్వు రేపట్నుంచీ పనలోకి రావొద్దురా" అన్నాడు నాగభూషణం.

ఆ ఎడమంటే తిరపతికి ప్రాణం. అయినా నాగభూషణం ఆ మాటనేసరికి అంత దిగులులోనూ నాగభూషణంఅంటే మండిపోయింది తిరపతికి.

మరొకప్పుడైతే, 'పన్లోంచి ఎందుకు తీసేత్తారుండే' అనేవాడో.

'ఊరా పోర్నందాకా నా కివ్వాల్సిందిమ్మ'నే వాడో, ఏం చేసేవాడో గానీ, ఇప్పుడు ఏమీ మాట్లాడకుండానే మర్నాటి నుంచి పనిమానేశాడు.

'పాలేరుపని పోయిందని తెలవగానే పద్దాలు 'ఎట్టా గోరా దేవుడా! పెతీరోజూ కూలిపని దొరుకుతుందా, సత్తుందా? ఇంకి కొంపకి నువ్వేదిక్కు'అని చెంపలేసుకుని గాల్లోకి వోనమస్కారం పారేసింది.

గుడిశ పైకప్పునుంచి చూపు కిందకి నిలిపితే. ఆ చూపుకి సొరాజ్జెం అనిండ పద్దాలుకి.

సొరాజ్జానికిప్పుడు యింటిపనులన్నీ వచ్చు.

"దీన్నెక్కడన్నా పనిలో పెడితే?" అనుకుంది పద్దాలు.

* * *

వడ్లధర పెరిగింది. బియ్యంధర పెరిగింది. అపరాల ధర పెరిగింది. అన్నింటితోపాటు పొలాల ధరా విపరీతంగా పెరిగింది. మాలపల్లెలోనేగాక, కమ్మపేటలోనూ, సాలిపేటలోనూ కూడా కూలేగుడిసెలు పెరిగాయి. దరిద్రం పెరిగింది. రోగాలు పెరిగాయి. దిక్కులేని చావులూ పెరిగాయి. ఏడుపులూ పెరిగాయి. ఏంపెరగలా? అన్నీపెరిగాయి. ఒక్క కూలిరేట్లుతప్ప. మళ్ళీ నాట్లు మొదలవుతున్నాయి. మాలరాములోరి గుడికాడ మాటలు మొదలైనాయి.

తిరపతి యిప్పుడు కూలీగా మారిపోయాడు-దినవారీకూలీగా!

దొరికినప్పుడు పండగ; దొరకనప్పుడు ఎండగ.

'కోమటి' రోశయ్య ఇంటికి దేనికోసమెల్లినా ఇదివరకు ఇచ్చేదాన్లో సగమిస్తున్నాడు. "ఏంటి కోంటాయనా, ఈ అన్నేయం" అంటే "నేనేం చెయ్యనురా గుడివాడలో అట్టా మండుతాంటే" అంటాడు.

"నువ్వు గుడివాడలో అడగాలి" అంటే–

"అడిగితే, ఆళ్ళుబెజవాడలో మండుతాంది అంటన్నారు" అంటున్నాడు రోశయ్య.

ఎక్కడ మండినా మండకపోయినా కూలోళ్ళ కడుపుల్లో మాత్రం మండుతాంది.

మళ్ళీ పొలాల్లో చూద్దామా అంటే పంటలు పండుతూనే వున్నాయ్.

ఏమిటిది?

అందుకే మాలరాములోరి గుడికాడ అంతా కూలీ, నాలీ జేరారు.

కూలివాళ్ళల్లో మాలవాళ్ళేగాక, ఆవూరికి సంబంధించిన పేదజనం అంతా వున్నారు.

సాలెవాళ్ళూ, మంగలివాళ్ళూ చాకలివాళ్ళూ, కుమ్మరివాళ్ళూ, కుంకపువాళ్ళూ అంతా వున్నారు.

... కులవృత్తి వాళ్ళు చేసుకుంటూన్నవారే.

ఈ నటుల్లోనూ, కోతల్లోనూ, కట్టేతల్లోనూ, వేరే కులాల వాళ్ళూ కూడా కూలికిరావడం ఈ మధ్య మామూలై పోయింది. ఏంచేస్తారు? ఏవృత్తి సరైన బువ్వపెట్టలేక పోతోంది. ఆవరికి పేదరైతులు నలుగురైదుగురున్నారు.

వాళ్ళకున్న రెండెకరాలూ, మూడెకరాలూ కుటుంబానికి ఏమూలా సరిపోదు. దాదాపు ప్రతికుటుంబానికీ వారసత్వంగా తీర్చవలసిన అప్పులు... ఆడపిల్లల పెళ్ళిళ్ళూ, వ్యాజ్యాలూ రకరకాల యిబ్బందులు వుంటూనే వుంటాయి. కనుక పేరుకు రైతేగానీ, కూలికి పోక తప్పదు.

ఈసారి వూళ్ళో కూలీలంతా– "కూలీరేటు పెంచుకోవాలి. అంతా ఒక్కమాటమీద నిలబడి నాట్లకి వెళ్ళకూడదు. అంతా ఒక్కమాటమీద నిలబడితే తప్పకుండా కూలి పెరుగుతుంది" అనుకున్నారు.

ఒక నిత్యశంకితుడన్నాడు— "ఓరి వూరుకోండ్రా, గోల సెయ్యక మనం నాట్లెయ్యటానికి రాము అనగానే వూరంతా వూరుకుంటుందా. పొరుగూళ్ళనుంచి తండతండాలుగా వచ్చి పడతారు. 'కో' అంటే కోటిమంది. మనలాంటి ముసలమ్మే తన కోడిపుంజు కుయ్యకపోతే తెల్లారదనుకుందట" అన్నాడు.

"సాలు సాల్లే. శకునపచ్చి ఎదవా! ఏవూళ్ళోళ్ళూ రారు. అళ్ళకు మాత్తరం నాటుల్లేవా? కూలీదొరక్క సస్తన్నారా? ఈ సమయంపోతే మళ్ళా రాదు. ఇదేమన్నా కలుపుతీతలను కొంటున్నావా? వూడుపులు! ఆలీస్సెం అయితే నారు పెరిగి మేటేసుకపోతందా, లేదా? అంతకా, అయితే, ఎవరొస్తారో, అళ్ళతో సెబుదాం. ఎవ్వరూ రారూ అళ్ళు మాత్తరం మడుసులు కాదా? మనకడుపులు కాల్సి అళ్ళు రత్తపుకూడు తింటారా

అసలు అళ్ళకి కూలి పెరగాలనే వుంటంది ఆసలామాట కొత్తె మన సుట్టుపట్టూళ్ళ కూలోళ్ళకూ కూడా చెబుదాం.' యిట్టా రేట్లు పెంచమని మనమంతా అడుగుదామని'. 'సిద్ధాంతం'లో 'దెంటుకూరు'లో, 'పాలపర్రు'లో, 'కోడూరు'లో అంతా మన మాటింటారు. మనాళ్ళున్నారు శానామంది. అళ్ళు మాత్తరం ఎట్టా బతుక్కతారు ఈ కూలికి పనిచేసి" అని తీవ్రంగా తన పథకం గురించి చెప్పాడు తిరపతి.

అందరికీ ఈ పద్ధతి నచ్చింది.

"నిజమే మరి. ఊడుపుల సమయం దాటిపోతే కూలీ లెంత మొత్తుకున్నా లాభంలే... కూలీ చచ్చినా పెరగదు. వూడుపులంటే ఎవరికివాళ్ళే ముందు నాట్లు పడాలనుకుంటు న్నారు కాబట్టి తప్పదు. దొరలకిది పెద్ద కష్టమూ కాదు. వడ్ల ధర పెరిగింది. పొలంధర పెరిగింది. అటువంటప్పుడు కూలో ళ్ళకి ఒక అర్ధరూపాయి పెంచితే వాళ్ళకు నష్టమూ లేదు. కాని మామూలుగా అడిగితే పెంచరు. అంతా కలిసుంటే తప్పదు మరి."

అన్నీ ఆలోచించుకున్నారు. అంతా ఏకమవ్వాలను కున్నారు. ఐయికమత్యంగా వుండి కూలీ సాధించుకోవాలని అంతా గట్టిగా అనుకున్నారు.

ఎప్పటిలాగానే ఆ వూరి మోతుబరిరైతు పురుషోత్తమరావు పాట్టెంకడిక్కబురెట్టాడు- "రేపొద్దున్నే రండిరా, తూరుపొవ్వలా నికి" అని.

దొరలు అనోటా, ఈనోటా విన్నారు- 'కూల్నాకొడుకులు' కూలిపెంచమంటారని. పాట్టెంకడు ఇంకో ఇద్దర్ని తీసుకుని దొర దగ్గర కెళ్ళాడు.

"యెక్కడికి రమ్మంటే అక్కడికి, ఎప్పుడు రమ్మంటే అప్పుడు వొత్తాందొరా. కాని..." ఆగాడు పాట్టెంకడు.

"కానేంటిరా... కానీ, అర్దనానూను..."

"...నీకు తెలవందిగాదు. బీదముండాకొడుకులం గంజి కూ్కడా గతిలేకుండాపోతాంది. ఈపాలి కూలి పెంచాలిదొరా! అర్ధరూపాయి పెంచండి సాలు. ఒక్కసారిగా మేమూ పెంచ మనం. మడిచికి అర్దసాలు"

"సాలంటారా. అర్దేం సాల్తాందిరా. రెండు రూపాయలు పెంచుతాం. తీసుకుందురుగాని.

"అట్టనమోక దొరా రోజులు నీకు తెలవనియ్యిగాదు. బీదోల్లం నువ్వు వొక్కడవు పెంచితే అంతా పెంచుతారు. మా అందరి బతుకులూ నీ సేతులో వున్నయ్ దొరా"

"అవున్రా మీ బతుకులేకాదురా నా చేతిలో వుంది. రైతుల బతుకులు కూడా వున్నాయ్. నాకేం లెక్కలేదు. నేను పెంచుతా. కానీ రైతులంతా నామీద పడ్తార్రా, ఆళ్ళందరి బతుకులూ తీశానని. అయినా, మీరేడవటమేగాని... ఈరోజుల్లో

యెవసాయం చేసేవాడికేం గిడతాందిరా నా బొంద. యెవసాయం అంత దిక్కుమాలినపని లేదురా. మీ కూలి ముండా కొడుకులేసయం. నాలుగు డబ్బులన్నా కళ్ల చూత్తారు"

"అట్టనమోక దొరా"

"అరేయ్ గోల చెయ్యమాకండి. మణిసికి బేడ పెంచుతా మారుమాట్టాడకుండా రేపొద్దున్నే ఏడు కొట్టేసరికి చేలో ఉండండి. నారు పీకించుతున్నా. అప్పుడే మనాళ్ళు ఆకుమళ్ళో దిగుంటారు"

"అట్టాగే దొరా. ఏడింటికల్లా చేలో దిగుతాం. కానీ, 'అర్ద' పెంచు దొరా"

"యేంట్రా? ఇకివతల మణిసి చెప్పేదినేదిలేదా?"

"మేం సెప్పేది మీరూయినండే. మేమూ మదుసులమే"- తిరపతి.

"ఏంట్రా బెదిరిత్తన్నారా"

పొట్టెంకడు— "లేద్దొర. మేమెంతా మా బతుకులెంత? మేం బెదరించేపాటోల్లమా?"

"అరేయ్. అదంతా అనవసరం. మణిసికి బేడ పెంచుతా. వస్తేరండి. లేదూ... ఆ ముక్క చెప్పండి. నా తిప్పలు నేను పడతా. మీరు రాననగానే యింత పొలం బీడడతం దనుకోవద్దురో. సంవత్సరానికి మీకు దొరికేదే మూణ్ణెల్లు కూలి. అది కూడా కాళ్ళదన్నుకొని పిల్లాజెల్లాని ఆకలితో నంప మాకండి. ఒళ్ళు కొవ్వెక్కి లెనిపోని బాధలు తెచ్చుకోమాకండి.

"సగనాకలితో యిప్పుడు చచ్చినట్టు బతకటం కన్నా, పూర్తిగా సావడమే నయం కానీ, దొరా! నీ సేరు సెప్పుకు బతుకుతాం పిల్లాపాపా గలాల్లం. మీమేలు మరవం."

"ఒరేయ్! ఇప్పుడుదాకా నేను చేసినమేళ్ళూ, మీరు గమనించుకోటాలూ, అన్నీ సాలుగానీ, బేడ పెంచుతా, వత్తారా, రారా. ఏదో ఒకటి తేల్చిచెప్పండి."

"అర్ద పెంచితే వొత్తాం దొరా!"

"తలతిక్క లంజాకొడకా! బేడపెంచుతా వొత్తారా,రారా!"

"రాం దొరా!"

"సరే పొండి. నా గుమ్మం తొక్కారా నంపుతా! వొక్కొ నాకొడుకునీ. ఈసారి నా దగ్గిరికి అదనీ, యిదనీరండిజెపుతా! ఇంక ఇదే ఆకరు. మీరు అర్దపెంచమంటే అర్దాపెంచాలి

రెండు పెంచమంటే రెండూ పెంచాలి. ఇంక మేవు సిప్పట్టుకుని, పొలంపుత్రా అయినకాడికమ్ముకుని పోటం నయం, మీతో నాట్లేంచుకుంటంకంటే. నేను నా పొలాన్నలా వొదిలన్నా పెడతాగాని మీకు కానికూడా పెంచను. అదీ సూత్తా"—తనకు ఎంతో అన్యాయం జరుగుతున్నట్టు ఆక్రోశించాడు పురుషోత్తమరావు

తాతలూ, తండ్రులనాటినుంచీ తామేదంటే దానికి సిత్తవనే 'కూలి నాకొడుకులందరి'కీ యివ్వాళ కొమ్ములు మొలిసి తనని అంతా ధిక్కరించడం ఎంత అన్యాయంమరి.

కూలీలు తిరిగి వెళ్తోంటే దొర పాముపడగెత్తినట్టు మెడెత్తి చూశాడు

తన దగ్గిరికొచ్చినాళ్ళు ముగ్గురేగానీ గుమ్మందాటగానే ఇరవై ముప్పయ్‌మంది వాళ్ళని చుట్టేశారు.

"ఓహెూ! కట్టుగానే వున్నారు. వుండనియ్యి..." అని తల పంకించి వాకిట్లోవూసి లోపలికిపోయాడు దొర.

కూలీలందరూ తిరపతితో ముచ్చట్లాడతా నడుస్తున్నారు. అంతా కలిసి వెళ్తున్నారు. తలకి కండవాలు చుట్టేరు. అవి చిరుగులవే. నీరకావుపంచెలు. చంకలవరకూ కోసేసినట్టున్న కబ్బాలు. బలంగాలేకపోడం మూలంగా బారుగావున్నారంతా.

"ఇప్పుడే మవుద్దంటా" అన్నాడు చాకలి గురవయ్య.

"ఏమవుద్ది.ఏమీఅవదు. సందేళకబురంపుతాడు.పావలా పెంచుతానదమంటాడు. మనం రావంటాం. మళ్ళీ నాలుగు తిడతాడు" అన్నాడు తిరపతి, నిర్లక్ష్యంగా.

అందరూ వుల్లాసంగా నవ్వులకు పడ్డారు.

* * *

నర్సయ్యా, రాములూ! ఎక్కడ తగలడ్డార్రా! సాయమ్మ తొందరగా రండిరా..." అప్పటికే వాళ్ళిద్దరూ వాళ్ళతోపాటు చిన్న పాలేరు నాగేశూ, పనిపిల్ల 'లచ్చి' అంతా పరిగెత్తుకొచ్చి పురుషోత్తమరావు ముందు నుంచున్నారు వినయంగా.

"ఇప్పుడేం చెయ్యాల్రా. ఆ లంజాకొడుకులు బేడకో, పావలాకో లొంగక నస్తారంటలే అని ఆకంతా తీయించాను. అళ్ళేమో చెట్టెక్కి కూచున్నారు. మనకిక యీళ్ళు తప్ప దిక్కులేవా? నైజాంనుంచో పడమటనుంచో మనుషుల్ని తెచ్చుకోడానికూడా టయిములేదు. యాటా మన పొలం వూడ్పు

లయినాగ్గాని వేరేదవ్వడాని కిల్లేకపోయింది. మరిప్పుడిట్టా గయ్యింది"

"వుప్పుడుమాత్రం ఏంటయ్యిందిలెండే. తవఁరు పెంచక పోతే ఎవరు మాత్రం పెంచుతార్లెండి పెంచితే తవఁరే పెంచాల మనకే ముందు నాట్లుపడాలి"

"నా ప్రేణంపోయినా బేరకన్నా పెంచన్నా. అళ్ళమొకం మీద కొట్టినట్టు రేపే పని మొదలెట్టాలి"

"యేల్లూర్వెళ్ళి మనుషుల్ని మాట్లాడొత్తామండే" అన్నారు నమ్మినబంట్లు నరసయ్యా,రాములూ.

"సరే. బైల్దేరండి.ఇక్కడున్నట్టు రావాలి మళ్ళీ. రేప్పొద్దున్నే కూలీలు చేలో దిగాలి" అన్నాడు పురుషోత్తమరావు మీసాలు మెలేస్తూ.

రాములూ,నర్సయ్యా సాలిపేటదాటి కాలవొడ్డు ఎక్కుతూండగా మంగలి జానకిరాముడు ఎదురొచ్చి కొంచెం నవ్వుతూ గుడ్లు గుండ్రంగా తిప్పి "ఎందాకా? సందేళ బైలెళ్ళారు" అన్నాడు.

"యేల్లూర్వెళ్తన్నాం మనూరాళ్ళంతా సమ్మె చేస్తున్నారు గందా,వూడ్పులికి రావఁని.అక్కడ మనుషుల్ని మాట్లాడుకొని రేత్రికి రేత్రి తీసుకురమ్మన్నాడు మా దొర అందుకే ఎళ్తన్నాం" కాళ్ళు ఎత్తెత్తివేస్తూ వెళ్ళిపోయారు వాళ్ళిద్దరూ.

'మంగలి జానగ్గాడు' తన ఇల్లుదాటు అదేపోక పోతాంటే అతని కూతురు అయిదేళ్ళది "నాన్నా! నాన్నా! నాన్నాయ్!" అంటూ వెంటబడపోయింద.

"నీ యమ్మ ఇంటికిపో ! 'ముఖ్యమయిన వక్కు' మీద ఎళ్తాంటే ఎదవగోల" అని దాన్ని బెదిరించి మాలపల్లివైపు చరచరా సాగాడు.

పురుషోత్తమరావు మనుషులు వేల్పూరు వెళ్ళారనే వార్త తిరపతి చెవిలో 'వూది' వూళ్ళోకి తిరిగొచ్చాడు.

మంగలి జానకిరావుఁడు అంత ముఖ్యమైన విషయం తిరపతికి చెప్పాడంటే అదేదో తోటి పేదలంటే సానుభూతి వుండి కాదు. దొరలు కూలిజనానికి అన్యాయం చేసేస్తున్నారనేబాధ వల్లాకాదు అవి అతనిఅలవాటు. అతను గడ్డాలూ, క్షవరాలూ చెయ్యడానికి బైల్దేరాడంటే ఒక ఇంటో విన్న సంగతులు మరో ఇంటో చెప్పకుండా వుండలేడు. మొదటి ఇంటోవిన్నదిరెండో

ఇంటో చెబుతాడు. రెండో ఇంటో విన్నది, మొదటి ఇంటో విన్నదీకలిపి మూడోఇంటో చెబుతాడు. మూడోఇంటో విన్నదీ, రెండ ఇంటో విన్నదీ మొదటి ఇంటోవిన్నదీ కలిపి నాలుగో ఇంటో చెబుతాడు. ఇలా అనంతంగా సాగుతుంటుంది అతని వార్తా లహరి.

అదిగో, సరిగ్గా, అలాంటి అలవాటు చొప్పునే తిరపతికి కూడా ఆ విషయం చెప్పాడు.

• • •

గంగరావిచెట్టుకింద నన్నకారు రైతులంతా గొంతుకూర్చుని వూసులుసాగిస్తున్నారు. "రేపు పురుషోత్తమరావు నాట్లెట్టా ఏయించుతాడంటా? ఆకు పీకించి కట్టలు కట్టించాడు. రొండు రోజులుకన్నా ఎక్కువుంటే పాసిపోతంది" అన్నాడు నాగేశ్వర్రావు.

లక్ష్మయ్య కాస్త ఆగి "ఈపాటికి ఏల్పూరు పొలిమేరలు దాటుంటారు కూలీలు" అన్నాడు.

"ఎట్టెట్టా. అంత తొందరగా దొరుకుతారంటావా ? ఆళ్ళకి నాటులు మొదలెట్టారు గందే" అన్నాడు చలపతిగారు.

"ఎక్కడ మొదలెట్టారు. ఎక్కడ మొదలెట్టార్రా. ఎవడూ నీకు చెప్పిందీ?అక్కడ ఇంకా నాలుగురోజులదాకా వూడ్పులు మొదలెట్టలేరు. కాలవొకపక్క రానేలేదు. అయినా అక్కడికెళ్లి మూడు. చేలొకపక్కన వూర్తిగా తడవనన్నా తడవలా నేను వ్వుడే అట్నుంచీ వస్తన్నా... మా చిన్నమ్మాయిని బందర్లో ట్రైనింగులో చేర్పించాగా. 'అంగలూరు' దగ్గిర బస్సెక్కించి 'సిద్దాంతం' రోడ్డు మీదగా వస్తన్నాలే. అసలింకా తరాలో పూర్తవ్వలా" అన్నాడు లక్ష్మయ్య

"ఇంతకీ మన వంగతెట్టాగే బాబాయ్! పురుషోత్తమరావు గారంటే వొక రూపాయిట్టైనా, అట్టైనా సద్దుకుపోతాడు మన బోటాళ్ళకెట్టాగే? ఈళ్ళు కూలి పెంచకపోతే రామంటే ?" అని భయపడ్డాడు. రంగయ్యగారు.

"వొరొరోయ్, రంగయ్యబాబూ! నీకో రహస్యం చెప్పనా? ఇందాక పడమటి చెరువుకి కావిడేసికెళ్తే పురుషోత్తమరావు కనపడి అన్నాడుగందా— "ఏవేఁ లక్ష్మయ్యనూవాఁ! ఈ యాడాది కూలాళ్ళు కూలి పెంచమంటన్నారు. పాపం ఆళ్ళూ

బతకాలికదా? నాదేముంది. నేను పెంచగలను. కాని సన్న కారు రైతులంతా నామీద పడతారుగా. అదే ఆలోచించా. పోనీ,నేను పెంచుతా. అందర్నీ పెంచమని బలవంతం చెయ్యకుండా చేత్తారా అంటే 'నసేమిరా' అన్నారే. అయితే, నేను పెంచను. నావాళ్ళందరిలో నేను మాట పడను. పేణాలైనా యిస్తాగాని, మాట వొదలను అన్నానే. మరి మీరంతాకూడా మనూరాళ్ళని పిలవమాకండి. ఇవ్వాళ కాకపోతే రేపయినా ఆళే ఒగొత్తారు అన్నార్రా"-అన్నాడు లక్ష్మయ్యగారు.

"మరైతే వీరయ్యన్నయ్యా! మన మూలంగానే రేటు పెంచలేదంటావా పురుషోత్తంగారు" అన్నాడు కన్నయ్య చుట్ట దమ్ము లాగుతూ.

"ఒరే, కేశవులూ నేనొక రహస్యంచెపుతా విను. నీకెన్నెకరాలున్నయ్‌రా? నాకెన్నున్నయ్‌రా? రంగడి కెన్నున్నయ్? చలపతి కెన్నున్నయ్. మనందరి పొలం కలిపితే పురుషోత్తమరావు పొలంలో సగంకూడావుండదు. మరి ఈ కూలి పెంచితే మాత్తరం నాకెంత కర్చవుతుంది. ఎకరానికైదేసుకో! నాకున్న అయిదెకరాల కొంద్రకః అయిదయిదులు...... అయిదయిదులెంతరా...వుండు నేనే చెబుతాగాని...అయిదూనూ, అయిదూ పదీ వొక పదేనూ...పాతికా...అయిదయిదులు పాతికమందికీ పాతికద్దలు పన్నెండున్నరయ్యేను, ఎంత పెంచినా. దాని కోసమనిచెప్పి నేను నాలుగురోజులు నాటులు ఆలీసెంగా ఏసి... ఏసిన్నాడే వానొత్తే మళ్ళీ ఏసి... సరిపోతంది ఇంక బేంబ డెవసాయం లాగుంటది నా యెవసాయంకూడా. పెద్దాళ్ళు,ఆళ్లు అట్టాగేన్లేఅంటారు. పురుషోత్తమరావు మనకోసమేంకాదు కూలి పెంచంది. ఆయనకున్న వొంచెకరాలకి ఏ వెయ్యో ఎక్కువవుతాయిగందా. అందుకే కూలిపెంచనంటాంది. ఏలూర్నుంచి కూలాళ్ళని తెచ్చినా ఈళ్ళని బెదిరిత్తానికేగానీ,అంతా ఆళ్ళతో ఎట్టా అవుతుందిరా" అని తనకున్న అనుభవసారాన్నంతా రహస్యాలరూపంలో బైటపెట్టి, ఎదురుగావున్న చెర్లోకి చుట్ట విసిరేసి,వాళ్ళు విరుచుకుంటున్న లక్ష్మయ్యకి అటుగావస్తోన్న జానకిరావుఁడు కనబడ్డాడు.

"వురేయ్! నీ యమ్మ జానిగ్గా. నిన్ను తగలెయ్యా. నీకెన్ని సార్లు చెప్పినా బుద్ధి రాదురా! మన చాకలి రావుఁడు దగ్గిర

లేదంట్రా? ఏంటి గాడిద! ఆ గాడిదటూ నువ్విటూ...ఏంట్రా ఆ ఎదవ నవ్వూ నువ్వూనూ. నేనుప్పుడే అమ్మాయిని బస్సెక్కిచ్చి వస్తన్నా. పొద్దుననగా కబుఁంపా బాలిగాడితో ఇదిగో వస్తన్నాననన్నావంటే. ఈ ఎదవగడ్డమేసుకుని ఊళ్ళన్నీ తిరగాల్సొచ్చింది. నన్నెవడూ అనుకోడురా జానిగ్గా! నిన్నే అనుకుంటారు. ఈయన మంగలెవడ్రా, పొట్టి సోమరిపోతులాగున్నాడు అనుకుంటారు. ఒరే, జానిగ్గా నీకొక రహస్యం చెప్పనా..." అంటున్నాడు లక్ష్మయ్య

"మీరేం చెబుతారండే లక్ష్మయ్యగోరో! నేను చెబుతానినండే మన తిరపతిగాడు లేడండే. ఆడూ, ఇంకా నలుగురైదుగురూ కలిసి ఏల్నూ్రరెళ్తన్నారండే. మన పురుషోత్తమరావుగారి మనుషులు ఏల్నూ్రరే గదండే ఎళ్ళారు. కూలాళ్ళకోసమన్చెప్పి, ఈళ్ళూ అక్కడికే ఎళతన్నారండే రావద్దని చెప్పటానికి... బలే, సందడి సందడవుతుందనుకోండిక" మహా వుత్సాహ పడిపోతున్నాడు జానకి, ఆ మాటలన్నీ తనే చెప్పగలుగుతున్నందుకు.

అట్టా చెప్పినంత మాత్రాన జానకిరావుడి వుత్సాహం తగ్గలేదు. పురుషోత్తమరావు యింటికెళ్ళి చెప్పాకగాని అతని మనసు శాంతించలేదు.

* * *

వేల్నూ్రరులో బజానాకూడా యిచ్చి 'రేప్పొద్దున్నే ఏడింటికల్లా చేలో దిగుతామని చెప్పి మేస్త్రీ దగ్గిర మాట తీసుకుని వెనక్కి తిరిగివస్తున్న నర్సయ్యకీ, రాములికి నారిలో తిరపతీ, ఇంకో అయిదుగురూ అటేవస్తూ కనబడేసరికి ప్రాణాలుపైనే పోయి నందులగుండా, గొందులగుండా పారిపోయి వూరు చేరారు.

తిరపతీ, మిగిలినవాళ్ళూ వేల్నూ్రరు కూలీల్ని కలిసి విషయమంతా వివరించారు.

"అట్టా అయిందా...... మరి ఆ నాలిముచ్చులు ఎదేదో చెప్పారేం? 'జనం చాల్లా, వొకేపాలి అంతా నాట్లు మొదలెట్టారు' అంటే నిజమేఁగావాల్ననుకున్నాం" అన్నాడు మేస్త్రీ.

"లేదన్నయ్యా! ఈ దొరలంతా మనలో మనకి తంపులెట్టి మజ్జలో ఆళ్ళు బాగుపడదామని సూసేరకం. మీరుకూడా అర్ద

యినా పెంచాలని కూకోండి. మేం సమ్మె చేత్తన్నాంకాబట్టి, మీకు కూలి పెంచినా రాకూడదు. మీరు సమ్మెచేత్తే మేమొత్తామా? వుప్పుడే మేం దెంటుకూరులోనూ, సిద్ధాంతంలోనూ కూడా సెబులాం. మీరెవరన్నా ఎళ్ళి అంగలూరులో సెప్పిరండి. అన్నిధరలూ మండుతున్నయ్. మనకి అర్ధ యిమ్మంటే ఆవలిత్తన్నారు. పనులెట్టా అవుతుయ్యో మనవూ సూద్దారి" అతి పట్టుదలగా మాట్లాడే తిరపతిని చూసి ముచ్చటపడ్డాడు మేస్త్రీ.

తిరపతి భుజం మీద చెయ్యేసి తడుతూ, "సెబాస్ రాబిడ్డా! నీలాంటాడు వూరుకొక్కడున్నాసాలు...అట్టాగే కానియ్ అవసరం అయితే మళ్ళీ కలుద్దాం" అన్నాడు హుషారుగా మేస్త్రీ.

అనుకున్నదానికన్నా సులభంగా పని జరిగిందనే సంబరంతో వెనక్కి తిరిగి వస్తున్నారు తిరపతీ, అతని మిత్రులూ.

"అరే యెంకన్నా! నువ్వుదెంటుకూరుపోయి, మీబావయ్యాళ్ళకి జాగ్రత్తగా సెప్పిరారా! కావాలంటే రత్తిగాణ్ణి తీసుకెళ్ళు. ఏరా రత్తిగా పోతావా" అన్నాడు తిరపతి.

"పోతావా, అనమాకెహె. పోరా—అను. అంతే, నువ్వేదంటే మేవూ అదే" అన్నాడు రత్తి మాంచిజోరుగా.

మురుక్కాలవ దగ్గరకొచ్చాక వాళ్ళిద్దరూ వేరే దోవెంట దెంటుకూరు దారిపట్టారు.

పొద్దుగూకింది. కీచురాళ్ళ రొదలో—

పంటకాలవా, మురుక్కాలవా పక్కపక్కగా పోతూ చేస్తున్న గలగలల్లో—

నక్షత్రాల మినుకు మినుకులు కూడాలేని కారుమబ్బుల గాఢాంధకారంలో—

ఒకరికి రెండో వారు కనపడనంతటి చీకటిలో—

తిరపతీ అతని అనుచరులు ఇద్దరూ నడుస్తున్నారు—తప తప బురదతొక్కుకుంటూ జారుతూ పడుతూ లేస్తూ!

డ్రాపుల దగ్గరకొచ్చాక—

పాడుబడిన బావి పక్క నుంచీ, తాటి చెట్ల చాటునుంచి ఆయిదాకారాలు వీళ్ళను చుట్టుముట్టడం గమనించేంత అవకాశం వాళ్ళకు లేకుండానే—

"అమ్మా!" అని తిరపతి గావుకేక,

"అమ్మో!" అని చంద్రిగాడూ.

"అమ్మో!" అని పోలిగాడూ.

"అమ్మో! అయ్యో!" అనే వారి అర్తనాదాల్తో ఆ చీకటిలో పెద్ద మెరుపు మెరిసింది.

వానరాకను తల్చుకుని వొణుకుతున్న పక్షులు, ఆ భీకరమైన కేకలకి కేర్, కేర్ మంటూ చెట్లమీంచి రెక్కలు టపటప కొట్టుకుంటూ ఎగిరాయి ఆ చీకట్లోనే.

చంద్రిగాడూ, పోలిగాడూ పక్కనున్న పొలంలో పడిపోయారు.

డ్రాపుల్లో నిండుగా విపరీతమైన వేగంగా ప్రవహించే నీటిలో తిరపతి పడిపోయాడు.

వాళ్ళ ప్రాణాలు తీసిన ఆ అయిదు ఆకారాలూ అరచేతుల్లో ప్రాణాల్తో. ప్రాణాలు తీసిన కత్తుల్తో చీకట్లో మాయమయ్యారు.

* * *

తెల్లారింది.

దెంటుకూరు వెళ్ళిన ఇద్దరూ ఇంటికొచ్చి తాము విజయవంతంగా ముగించుకొచ్చిన విషయాల్ని తిరపతికి చెప్దామని చూస్తున్నారు.

రాత్రినుంచీ తిరపతీవాళ్ళు రాలేదనితెలిసి మాలవాళ్ళంతా కూలివాళ్ళంతా కలిసి వేల్పూరువైపు పరుగులూ, పరుగులూ తీశారు.

రక్తంమడుగుల్లో, పొలాల్లో చచ్చిపడున్న చంద్రిగాడూ, పోలిగాడూ కన్పించారు.

మూడోరోజున కాలవకి దిగువన పదోమైలురాయి దగ్గర తిరపతి శవం దొరికింది- పోల్చడంకూడా కష్టమయ్యేస్థితిలో.

పోలీసులూ, కోర్టులూ చాలా "కూపీలు" లాగాయి.

కూలిరేట్లు పెంచమని సమ్మె చేస్తున్న కూలీల్లో వాదోపవాదాలు పెరిగి హత్యలవరకూ వెళ్ళిన విషయం వూళ్ళో వాళ్ళందరికీ కొత్తగాచెప్పి ఎంకన్ననీ, రత్తిగాడినీ జైల్లోవేశారు పోలీసులు.

సబిన్‌స్పెక్టరుకీ, సర్కిలిన్‌స్పెక్టరికీ గుడివాడ పాటిమీద యిళ్ళు కట్టించాడు పురుషోత్తమరావు.

అందరికి తెలుసు అంపాలిని, చంద్రిగాడిని. పాలిగాడిని చంపిందెవరో; ఎంకన్ననీ, రత్తిగాడినీ జైల్లో పడేసిందెవరో.

కాని-

పోలీసులు పురుషోత్తమరావు చేతిలో వున్నారు.

కోర్టులు పురుషోత్తమరావు చావిట్లోనే వున్నాయి.

న్యాయం, ధర్మం పురుషోత్తమరావు గుబురుమీసాలచిరు నవ్వుల్లో చిక్కుకుపోయున్నాయి.

కూలోళ్ళలో ప్రతివాడిలోనూ ప్రతీకారాగ్ని రగులుకుంటూనే వుంది. కానీ, ఏం చెయ్యాలో, ఆ కోపం ఎలా తీర్చుకోవాలో ఎవరికి తెలియడం.

పురుషోత్తమరావు సకాలానికి తన పొలాలు ఆవూరి కూలీల్తోనే బేడకూడా పెంచకుండా ఊడ్పించుకుని చాలా ఘన కార్యం చేసినట్టు కులుక్కున్నాడు.

* * *

కొడుకు పోయింతర్వాత పద్దాలుకి 'శిరసుపోటు' జబ్బు పట్టుకుంది.

'శిరసుపోటు' పోగొట్టడానికని మంగలి రాముడు పద్దాలు ముగ్గోడుల్లో పసరు పిండాడు రెండుమాట్లు.

మొదటిమాటు పసరు పిండుతూ అన్నాడు "ఈ పసరు పెబావముందే...ఇది మా దొడ్డ పెబావం చూపుతుందిలే. రేపల్లా యిపరీతమైన పోటొస్తుంది ఎల్లుండి పొద్దునసూడు. వుష్కాకి. అసలు నాదుగా కూడా వుండదు. అట్టా అయితేనే మళ్ళీ నేను నీకగపడేది" అని పసరు పిండేసి వుష్కాకి అయిపోయాడు.

శిరసుపోటు మూడింతలైంది.

సొరాజ్జెం రొండ్రోజులు తిరిగి తిరిగి రాముణ్ణి పట్టుకొని లాక్కొచ్చింది

"ఈసారి ఈ పసరు సూడు. దాని సంగతే సూశావు. ఇది అట్టాకాదు" అని కొత్తపసరు పిండాడు.

పద్దాలు వుక్కిరిబిక్కిరై మంట ససాళానికంటి, కళ్ళు తేలేసి పడిపోయింది.

సొరాజ్జెంగోలుగోల సపేడుస్తోంటే పదిమందీ జేరినసందట్లో డాట్టరు జారుకున్నాడు.

ఒక పూటంతా అయ్యాక కన్ను తెరిచింది పద్దాలు. అప్ప ట్నుంచీ పద్దాలు సరిగ్గా మంచం దిగలేదు.

నుదుటికి శొంఠిపట్టేసి తలకివాసెనకట్టుకుని, మూలుగుతూ ఆ గుడిశెలో ఓ పక్కన పడుంటుంది.

అన్నచావూ, తల్లికి మంచం దిగని తెగుళ్ళూ - సొరాజ్జెం ఎప్పుడూ ఏడుస్తూ వుండేది. చురుకుపాలంతా పోయింది. పేడేరుకుంటున్నప్పుడూ, సితుకులేరుకుంటన్నప్పుడూ మాటా మంతీ ఆడేదికాదు. నవ్వటం మరిచిపోయింది. ఒక్కోసారి ఇవ్వాళ అన్న ఇంటికొస్తాడనుకునేది. మళ్ళీ అన్నలేడని గుర్తొచ్చి కుంగిపోయేది.

సొరాజ్జానికి వుషారుపోతే బోడికి వుషారుపోయింది.ఇద్దరూ మాటామంతీ లేకుండా పిచ్చోళ్ళలాగా కూచునేవారు గుడిసె ముందు.

* * *

పద్దాలికీ,సొరాజ్జానికీ తిండిగడవటల్లా.రోజులుగడవటల్లా.

పద్దాలు ఒకరోజు ఓపిక చేసుకుని అనసూయమ్మింటికి జైల్దేరింది.

బైట అరుగుమీదనుంచున్న అనసూయమ్మ దూరాన్నుంచే పద్దాలు రావడంచూసి ఇంట్లోకెళ్ళిపోయింది.

పద్దాలొచ్చి, "అనసూయమ్మగోరో!... అనసూయమ్మగో రండే!" అని ఇంట్లోకి కేకేసింది.

"యేంటే? వస్తన్నా!" అంటూ అనసూయమ్మవచ్చి మండి గం పక్కనే కూర్చుంది.

అక్కడ వసారాలో అయిదు మంచాలున్నాయ్. ఒక మంచం వాల్చేవుంది. దాని మీద కోళ్ళెక్కి ఎగురుతూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాయి. మధ్యమధ్య కరాబుచేస్తున్నాయి.

దానికి పక్కనే పెద్దకొయ్యపడక్కుర్చీ పెద్దపెద్ద చేతులు బారజాచుకుని వుంది. దానిలో ఆ యింటి యజమాని తప్ప యింకెవరూ కూర్చోరు.

ఎవరూ కూర్చోకూడదని ఎవరూ ఎప్పుడూ చెప్పలేదుగానీ ఎవరూ కూర్చోరు. కూర్చోరు అని తెలిసే చెప్పలేదో!

ఆ యింట్లో మూడు మడతకుర్చీలూ, అయిదు పీటలూ, రెండు చాపలూ వున్నాయి గాని, అనసూయమ్మ వాటిని

ఎప్పుడూ వాడదు కూర్చోవాలంటే మండిగం పక్కనో, కుర్చీ పక్కనో, గోడవారనో, కూర్చుంటూ వుంటుంది చాలామందిలాగానే

మండిగం పక్కన కూర్చున్న అనసూయమ్మ "ఏంటే, పద్దాలూ? పనిమీదొచ్చావ్ నీ దుంపతెగా నీకీ వయసులో రావాల్సిన కష్టంగాదే నీకొడుకు నీగ్గాకుండా పోయాడు గందే యెదవ్వేషా లేసి" అంది.

"అట్టా అనమాకండమ్మా, అనసూయమ్మగోరో! నీకు దణ్ణం పెడతా. నా కొడుకు యెదవ్వేసాలేమీ ఎయ్యలేదమ్మా. అది యావన్మందికీ తెల్సు వాడి మొకాన అట్టారాసుంద. నా మొకాన యిట్టా రాసుంది. ఎవర్నినేం లాబంతల్లీ" అనికాస్సేపు ఏడ్చింది పద్దాలు.

"వూరుకోవే, నీ దుంపతెగా. ఇంతే పేరబ్దం అనుకోవాలి ఏం జేత్తన్నావే?...నీకు పిల్లముండొకటుండాలి కదూ?"

"వుంది తల్లీ అదేలేకపోతే నేనీపాటికి ఏ నుయ్యోగొయ్యో సూసుకునేదాన్ని— ఈ ఎదవజల్మ వొదిలేసి. ఇప్పుడు నేను ఈ రోగాల పుట్టలాగ బతికి మాత్తరం సేసేదేముందిగాని తల్లీ. అది మరీ సిన్నముండ అనసూయమ్మగోరో! దానికి అక్కల్లేరు అన్నల్లేరు. అయ్యలేడు. సివరికి నేనుకూడాలేకపోతే ఎట్టాగమ్మా?

"ఓసి నీదుంపతెగా. ఏంటే? ఇప్పుడు నువ్వు చావకపోతే నేనూరుకోనట్టు మాట్లాడతన్నావూ! అటువంటి పిచ్చిపనులు చెయ్యమాక. పిల్లముండ వుసూరుమంటుంది."

"అందుకేనమ్మా గుండె రాయి చేసుకుని ఈ కట్టెనిట్టా ఈడుతున్నా. నీకు పున్నెముంటుంది. దాన్ని పనిలో పెట్టుకో దొరసాని!"

"అదేంపని చేత్తందే పిల్లముండ"

ఆ మాటలు విని అంత విచారంలోనూ ఆశ్చర్యపోయింది పద్దాలు.

అనసూయమ్మే సంవత్సరంన్నర కిందట సొరాజ్జెం ఇళ్లో కెళ్తోంటే, "పనిలో పెట్టవే, పనిలో పెట్టవే" అని వొకటేపోరింది.

అప్పుడు పద్దాలు, "చిన్నముండ ఏం పని చేత్తంది దొరసానమ్మా?" అంటే

"ఏం రోగమే. ఇళ్ళోకెళ్ళగలిగింది పనే చెయ్యలేదా?

నా దగ్గిరకి పంపు. అన్నీ నేన్నేరుపుతా. ఏవన్నా వత్తే నాలుగు మెతుకులన్నా దొరుకుతయ్. మీకు సదువులెందుకే. పిచ్చి ముండల్లారా. అదేవన్నా వుజ్జోగం సేస్తందా?" అంది.

ఇప్పుడేమో సంవత్సరంన్నర అయ్యాక "అది పిల్లముండ అదేం పని చేత్తందే" అంటాంది.

అనసూయమ్మనోట్టోది నాలికా, తాటిపట్టా అనుకుంది పద్దాలు.

అవసరం పద్దాలుది.

అనసూయమ్మకి మాత్రం అవసరంలేదా అంటే చాలా వుంది. పనిపిల్ల కోసం చూస్తూనే వుంది. అయితే కాస్త బెట్టు చేస్తే వాళ్ళకివ్వాల్సింది తగ్గించొచ్చుగదా అని అంతే.

"అట్టనమాకమ్మా! సొరాజ్జానికి అప్పుడే పదకొండేళ్ళు దాటినియ్. ఇంకా సిన్నపిల్లేంటి దానితోటాల్లంతా కూలిపన్లకి పోతానేవున్నారుగందా... సొరాజ్జం పని బాగానే నేర్చుకుంది తల్లీ! నువ్వేది సెప్పినా అది సేత్తంది" అని బతిమాలుకుంది పద్దాలు.

అనసూయమ్మ కాస్త ఆలోచించుకున్నట్టు వూరుకుని "అయితే, ఏవియ్యమంటావే" అంది.

"మీకు తెల్దా అమ్మగోరూ"

"నాకేంతెలుత్తుందే. పనిముండని పెట్టుకుందామనుకోట వేఁగానీ,పదేళ్లనించీ పెట్టుకుందెక్కడ. సెప్పు ఏవిమ్మంటావో?"

"దీనితోటిదేనుండే నాగి కూతురు సీతి. మనఇందిరమ్మ గారింటికాడ పనిసేత్తాంది. దానికి రొండుపూటలా అన్నంపెట్టి సమచ్చరానికి రొండుగుడ్డముక్కలిచ్చి పందుంయిత్తన్నారుండే"

"ఓసి దొంగలంజా! ఎంతబద్దమాడేవే?"

"ఇక నేను మాట్టాడనండే. మీ యిట్టం..."

"సరేలే... అంతకర్సు నేను పెట్టలేను. ఇందిరమ్మకేమే. ఎంతవాడుకున్నా ఆళ్ళాయన ఒక్కమాటా అనడు. నాకట్టా అవదమ్మా. ఏదో తిండెట్టి, పిచ్చియ్యో, ఎచ్చియ్యో ఒక జత బట్టలిత్తా ఇష్టమైతే పంపు. అదయినా నీకు గడవటల్లేదనీ, వొచ్చి అడిగినప్పుడు ఆదుకోకపోతే నా మనసొగదు కాబట్టి సుమా!"

"అట్టాగేనమ్మా. నీ మనసు నాకు తెల్దా. అందుకేగా ఎవరి

దగ్గరికి ఎళ్ళకుండా నరానరి నీ దగ్గరకొచ్చాను. దానిబతుకది బతికితే సాలుతల్లీ. దాన్ని నీ సేతుల్లో పెట్టి నా తిప్పలు నేను పడతా, పనిచేసే ముండ. రొండు జతలిచ్చి, రొండుబస్తాలన్నా యియ్యి దొరసానమ్మా! నీ పేరు సెప్పుకు బతుకుతాం" అంది దీనంగా పద్దాలు.

"ఉసే, పద్దాలూ! నువ్వింత మొండి ముండవనుకోలేదే నేనూ."

"లేదమ్మా అట్టనమోకండి"

"లేకపోతే యెంటే? రొండు బస్తాలూ లేదూ, నీ మొకవూ లేదు రొండు జతలు గుడ్డముక్కలిత్తాగానీ... అయ్యికూడా నా యిస్టవైనయి... తరవాత నువ్వు మంచియీ, పిచ్చియీ కొత్తయీ, పాతయీ అనొద్దు...మళ్ళీ మాట్టాడక పంపుదాన్ని" అని మండిగం పక్కనుంచి లేచింది అనసూయమ్మ.

"అట్టాగేనమ్మా నా పిల్లని నీ సేతుల్లో పెడతన్నా, కాత్త దయగా సూడండితల్లీ. సిన్నముండ...రేపట్నుంచీ పంపుతా!"

"సాల్లేవే, నీ అంపకాలూ. నేనేం కొరుక్కు తింటానాఏంటి? రేపెందుకు? ఇప్పుడే పంపు. సందకాశి తీసెళ్తింది.

"అట్టాగే దొరసానమ్మా"

తిరిగి ఇంటి కెళ్తాంటే పద్దాలుకి పుట్టెడు దిగులేసింది— 'పిల్లఇంక రేత్రీ పొగులూ గొడ్డుచాకిరీ సెయ్యాల'

* * *

సొరాజ్జెం తెల్లారగట్టేలేచి అనసూయమ్మ యింటి కెళ్ళేది.

అనసూయమ్మ భర్త నిద్రోతూవుండేవాడు.

అనసూయమ్మ వంటయింటో చల్ల శేస్తూవుండేది.

సొరాజ్జెం చీపురు తీసుకుని దొడ్డంతా పాచివూడ్చేది.

అపనయ్యాక పెద్దతొట్టిలో అడుగూబొడుగూ నీళ్ళకుండతో తెచ్చుకుని చావిట్లోకెళ్ళి పేడ తెచ్చుకుని, వీధివాకిళ్ళనిండానూ పెరట్లోనూ కళ్ళాపిజల్లేది.

అప్పటికి తెలతెలవారుతూండేగి. అనసూయమ్మ ముగ్గు డబ్బాతో ప్రత్యక్షమయ్యేది వాకిట్లో.

ఇక ముగ్గుయజ్ఞం మొదలయ్యేది. అనసూయమ్మకి ముగ్గులు పెట్టడమంటే ప్రాణం. ముందెవరున్నారో, వెనకెవరున్నారో కూడా చూసుకోకుండా, తనెట్లావుందో, తన బట్టలెట్లావున్నాయో

కూడా తెలీని తన్మయత్వంతో ముగ్గులు పెట్టుకుంటూపోయేది.

ఈలోగా సౌరాజ్జెం గదులన్నీ వూడ్చేది.

అంట్లు బైటేసుకుని, చిట్టూ, కచ్చికలూ,కొబ్బరిపీచో, అది లేకపోతే నాలుగు గడ్డిపరకలోకలిపి అంట్లన్నీ నిగనిగలాడేట్టు తోమి శుభ్రంగా కడిగేది

కడిగిన బొచ్చెలన్నీ వంటింటో సర్దేసి ఆపనీ ఈపనీ చూస్తూండేది.

ఈలోపు అనసూయమ్మ పిలిచి, "వుసే సౌరాజ్జెం! కోం టింటికెళ్ళి..." అని ఏదో తెమ్మని పురమాయించేది.

కోంటింటికెళ్ళిరాగానే "ఇందాక మర్చిపోయానే" అని మళ్ళీ ఏదో తెమ్మని చెప్పేది. ఆ సరుకు తెచ్చాకా, "ఆవాలు తెచ్చావా"

"నువ్వు సెప్పలేదు గదుండే"

"అబద్ధమాడితే సంపుతా. ఇప్పుడు సెబుతున్నాగా లగెత్తు కెళ్ళి కానీ ఆవాలు తీసుకురా. ఇక్కడున్నట్టు రావాలి.

సౌరాజ్జెం 'లగెత్తుకెళ్ళి' అదీ తెచ్చేది.

"సగం అంట్లు వదిలేత్తంది" అని అప్పుడే కాళీ అయిన అంట్లు కొన్ని చూపుతుంది అనసూయమ్మ.

"ఇయ్యన్నీ అప్పుడు లేవు దొరసానే"

"అప్పుడు లేకపోతేమానె. ఇప్పుడున్నయ్‌గా...... యిక తోముకురా...తొందరగా తోము, తొందరగా తోము..." అని కంగారుపెట్టేవి.

అవి తోమి వొంటింటో బోర్లించాక, పనంతా కాస్త అయిం దనుకున్నప్పుడు చిన్న దొరసాన్ని బడికి చెయ్యిపట్టుకుని తీసి కెళ్ళి బళ్ళో వొదిలిరావాలి. పిల్లలంతా బళ్ళోకెళ్తూనే వుండే వారుగాని, అనసూయమ్మకు భయం.

"చిన్నముండ. ఎల్లేదేమో చెరువుగట్టెంటయ్యే ఏ కాలో జారితే, యింకేమన్నావుందా...దీని చెయ్యివొదలకుండావుచ్చు కెళ్ళి బళ్ళో వొదిలిపెట్టిరా. రాగానే అన్నం తిండువుగాని"

పిల్లని బళ్ళోవదిలి వచ్చేసరికి పదిగంటలుదాటేది. అప్పుడు 'అన్నానికి తగలడు!' అనేది అనసూయమ్మ సౌరాజ్జెం తను యింటికాణ్ణించి తెచ్చుకుని గొల్లచావిట్లో చూరులోదోపి దాచు

కున్న "జరమనిలేరి" పళ్ళెవూ, గ్లాసూ తెచ్చుకుని వొంటింటి గుమ్మం దగ్గరగా బైట కూర్చుంటుంది.

సౌరాజ్జెం అన్నం తినేచోటుకీ, పెద్దతొట్టికీ మధ్య నుంచీ చిన్న మురుగుకాలవ బైటికెళ్తూ వుంటుంది. కోళ్ళు కాలవని ఎప్పుడూ కెలుకుతూనే వుంటాయి. ఎన్నిసార్లు తరిమినా ఇలా పోయి అలా వస్తాయి. సౌరాజ్జెం అన్నం తిన్నంతసేపూ కోళ్ళ మంద సౌరాజ్జెం చుట్టూ తిరిగి ఏడిపించి ఒక ముద్ద అటు విసిరితేనేగానీ వూరుకోవు.

వసారాలో కూకునితింటే ప్రాణానికి హాయిగా వుండునను కునేది సౌరాజ్జెం. సౌరాజ్జాన్ని కోళ్ళు ఏడిపించుకు తినటం రోజూ చూసినా, అనసూయమ్మ "వసారాలో కూకుని తినవే" అనేది కాదు. తనేవీ ఎరగనట్టూరుకునేది.

అన్నం పెడుతూ 'చాలా' అనేది. "ఊ" అనేది సౌరాజ్జం.

"పిల్లముండవి. ఆకల్తెలవదు. ఎక్కువెట్టించుకుంటేపాడు చేత్తావ్. అన్నం పరబ్రెమ్మసొరూపం అన్నారు. ఎగాదిగా పారెయ్యకూడదు. సాలకపోతే మళ్ళీ అడిగి పెట్టిచ్చుకో."

ఎప్పుడన్నా మళ్ళీఅడిగితే-"ఎదవముండా. సంపుతున్నావు గందే. ఇటూ, అటూ తిరగలేక నా కాళ్ళు పడిపోతన్నయి. ఒక్కసారే అడిగిపెట్టిచ్చుకోలేవూ ?" అనేది ఆ పూట దొరసా నమ్మ పెట్టిందాంట్లో పళ్ళానికెగబడి కోళ్ళుతినగా మిగిలిందే సౌరాజ్జానికి ప్రాప్తం.

అన్నం తినడమయ్యాక పళ్ళెం, గ్లాసూ కడుక్కుని, గొడ్ల చావిడి చూరులో దాచేసుకుని గౌనుతోనే మూతి తుడుచుకుని, మళ్ళీ అంట్లన్నీ తోమేది.

గదులన్నీ- కోళ్ళు నానాకంగాళీచేసిపెట్టెయ్‌గదా- మళ్ళీ వూడిచేది.

కోళ్ళని యింట్లోనుంచి గొడ్లచావిట్లోకికొట్టేది. కొట్టి సౌరా జ్జెం వెనక్కితిరిగి వచ్చేసరికి గొడ్లచావిట్లోకెళ్ళిన కోళ్ళన్నీ మళ్ళీ సౌరాజ్జెంకన్నాముందుగా యింట్లోకొచ్చిమంచాలెక్కేవి. ఆ యింట్లో ఓ గదిలో వడ్లగరిసెవుంది. ఆ గరిసెని పొడుస్తూ వుంటే ఆ గరిసె వడ్లని రాలుస్తూ వుంటుందనేసంగతి కోళ్ళకి తెల్సు. నాలుగ్గింజలు తినడం, ఎవరన్నా వచ్చి గదిలో పెట్టి

కొడతారేమో అనే భయంతో బైటికిరావడం, మళ్ళీ లోన కెళ్ళడం... ఇట్లా వుంటుంది కోళ్ళవరస.

వంటింట్లోకి వెళ్ళి అన్నం మెతుకులూ... వీలైతే అన్నమే కుండలోది...

"మజ్జాన్నమవుతాంది గానీ, బళ్ళో కెళ్ళి పాపని తీసుకురావే"

బళ్ళోకెళ్ళి పాపని తీసుకొచ్చేది.

మళ్ళీ తీసికెళ్ళి బళ్ళో వదిలొచ్చేది.

"అళ్ళింటికెళ్ళి అద తేవే"

అళ్ళింటికెళ్ళి అది తెచ్చేది.

"ఈళ్ళింటికెళ్ళి ఇదిచ్చిరావే"

ఈళ్ళింటికెళ్ళి యిదిచ్చొచ్చేది.

అందరికీ మధ్యాన్నపు అన్నాలు అయ్యేవి

మళ్ళీ అంట్లు తోమితోమి సాయంత్రం అవుతూండేది.

సందకాశి తీసి, సందకల్లావిజల్లి, దీపాలు తుడిచి, దీపం గ్లాసుని ముగ్గేసితోమి, దీపాలెలిగించి...

కోళ్ళన్నిటినీ లెక్కెట్టి కమ్మేసేది.

ఎప్పుడూ ఏదో వొకటి ఎక్కడో చీకటిపడ్తున్నా నిట్టలు తొక్కుతూండేది

"ఎర్రీకల కోడి కనపట్టల్లేదు దొరసానీ..."

"చూడు... చూడు..." అంటూ దొరసాని బైటకొచ్చి, ఇద్దరూ కలిసి "భో, భో, భో, భో" అంటూ దొడ్డంతా తిరిగేవారు. కనపడ్డవాళ్ళని వాకబుచేస్తూ.

కాసేపయ్యాక "ఎర్రీకలకోడి" కోళ్ళగూడుదగ్గర "భో. భో" మంటూండేవి.

అన్నీ లెక్క చూసుకుని కమ్మేసి అందరూ అన్నాలు తిన్నాక, అనసూయమ్మ పెట్టిందేదో తిని బాగా చీకటిపడ్డాక యింటికేసి బైల్దేరేది సొరాజ్జెం.

♦ ♦ ♦

పొద్దుకూకి రెండుగంటలయ్యుంటుంది. అమావాస్యముందు రోజులు... చీకట్లో నడిచేవాళ్ళకికూడా కనపడనంత చీకటిగా వుంది.

సొరాజ్జెం త్వరత్వరగా మాలపల్లికేసి వెళ్తోంది ఒక్కటి.

"ఎవురా మడిసి" చీకట్లోంచి ప్రశ్న.

"నేనే"

"నేనే అంటే" అన్నాడు చీకట్లోంచీ చింతడు.

"నేనెవురైతే నీ కెందుకూ ?" సొరాజ్జెం

"ఆహాఁ, అట్టాగా ! నువ్వు సొరాజ్జానివి గాదూ ?"

"ఆహాఁ, అట్టాగా ! నువ్వు సొరాజ్జానివి గాదూ ?" అంది సొరాజ్జెం చింతణ్ణి అనుకరిస్తూ ! చింతడుకూడా సొరాజ్జెం ఈడు వాడే.

"ఊసే సొరాజ్జెం ! నేనూ అట్నుంచేగందా వచ్చేది. నన్ను బిలవగూడదంటే. ఇద్దరం కలిసొచ్చేవాళ్ళంగా"

"ఓరి మానాయనే ! కలవక్కలవక నీతోనే కలవాల్రా నాయనా"

"మొన్న కాలడ్డంపెట్టి పడగొట్టాననేనా ?"

"నేనేం పళ్ళేదు"

"మరి నన్ను పిలవకూడదేంటే...... ఇద్దరం కలిసొచ్చే ఆళ్ళంగా ? ఒక్కదానికీ యింతసీకట్లో బయం ఎయ్యిటల్లా?"

"నాకేం బయ్యం"

"అవున్లే. దెయ్యాలే నిన్నుజూసి జడుసుకుంటయ్"

"బూతాలు నిన్నుసూసి జడుసుకుంటయ్"

ఎదురుగుండా ఎవరో, "ఎవరేఅదీ?" అన్నాడు చీకట్లోంచీ.

"నేను మాలదాన్నిలెగండె" అంది సొరాజ్జెం వాళ్ళమ్మలాగా.

"అది కనపడతానేవుంది లెగండె" అన్నాడు చింతడు వెనకనుంచీ.

"ఎవడ్రా అడూ ?" అన్నాడు, ఎదుటాయన చీకట్లోంచీ.

"నేను చింతణ్ణి లెగండె" అన్నాడు

"ఏ చింతడూ ?"

"బేతోలాళ్ళ చింతణ్ణి"

"ఓరి, నువ్వంట్రా? ఈరబద్దర్రావుగుడివాడెళ్ళాడన్నారు. వొచ్చాడా ?"

"అఁ నందకాడే వొచ్చాడండే కాత్తి సులువుగానే వుందంటండే"

"సర్లే, ఎల్లండి" అని తన దోవకి తప్పుకున్న యిద్దరికీ అనుమతిచ్చి వెళ్ళిపోయాడు చీకటాయన.

* * *

సొరాజ్జాన్నిచూసి— "ఏంటే బుడ్డదానా" అన్నాడు వీర భద్రరావు.

"మా దొరసానమ్మ లలితమ్మగోర్నడిగి నాలు క్కరేపాకు రెబ్బలు తెమ్మందుండే" అంది సొరాజ్జెం.

"మీ దొరసానమ్మకి కరేపాకు రెబ్బల్లేకపోతే కూర గుమ గుమ లాడదేంటే?..." అని పొరుగింటి దొరసానమ్మ మీద కాక సరసం విసిరి... "సర్లే, లోనకెళ్ళిఅడుగు" అని చింతణ్ణి కేకేసి "అరే చింతా! కవతరం నించీ మా తోడల్లుడాళ్ళు వస్త న్నారంటుగానీ,నీబాబుని చేపల్తీసుకురమ్మన్నానని చెప్పిరారా!" అన్నాడు వీరభద్రరావు.

"మా నాన్న యిందాకే మురిక్కాలవకేసెళ్ళాడుండే"

"మురిక్కాలవకెళ్తే అక్కడే దిగడిపోతాడెరా? తొందరగా ఎళ్లి చెప్పిరా"

"సరేలెగండి"

"సర్లెండనిఎళ్లి నువ్వు మీ ఇంటికాడే పాతుకుపోతేకాదు. గేదెలతుక్కడుతులెట్టాలి. ఒక్కపనవ్వాలా. ఇక్కడున్నట్టు లగె త్తుకురావాలి. లగెత్తు"

"అట్టాగేనుండే" అని చింతడు పరిగెత్తాడు.

చింతడు వీరభద్రరావింటిదగ్గర చిన్న పాలేరుగా చేస్తు న్నాడు. చిన్న పాలేరన్నమాటేగాని ఆ చిన్నపాలేరు చెయ్యని పనిలేదు. పైనుంచీ దొరతిట్లు. తిట్లతో అయిపోతే ఫర్వాలా. చింతడి తండ్రి కోటడు చేపలు పట్టుకుని అమ్మి బతుకుతాడు.

చింతణ్ణి పనిలో పెట్టిన దగ్గర్నుంచి కోటడికి కొత్త కష్టం ఎదురయ్యింది.

రెండు మూడు రోజులకోసారి వీరభద్రరావు కబురంపు తాడు చేపలు పంపమని కోటడు 'ఎవరకైతే ఏంటిలే' అని తెచ్చిస్తే చేపలు తీసుకుని తినడం వరకేగాని డబ్బుపూటెత్తడు దొర

"ఏం దొర" అంటే-

"ఈడిక్కాసిని చల్లపొయ్యవే"

"ఈడికాస్త పచ్చడి పడెయ్యవే"అని– యింట్లోకి ఓ కేకేసి తలగుడ్డ దులుపుకుంటూ వెళ్ళిపోతాడు.

ఏ మాటకామాట చెప్పుకోవాలి లలితమ్మ చాలా మంచి

మనిషి. అంచేత వీరభద్రరావుకి తగని మనిషి.

ఆమె ఏ పచ్చడో, అన్నమో, మజ్జిగో లేకపోతే రెండూనో యిచ్చేదిగానీ.

చేపలకి పచ్చడికి మారకం నచ్చదు కోటడికి

"దొరగార్నడిగి డబ్బులుతీసుకోరా...మొన్నిచ్చిన చేపలు ముళ్ళులేవు. మంచి రుచిగా వున్నాయి. అయ్యగార్నడిగి డబ్బులు తీసుకో. మళ్ళీ తెచ్చిపెట్టు" అనేది.

"దొర ఇవ్వడు దొర్సానీ!"

"ఎందుకివ్వర్రా? అడిగి తీసుకో!"

దొర దొరికితేనా అడగటానికి?

అందుకనే చింతడికినచ్చదు వీరభద్రరావుకి చేపలివ్వడం.

సొరాజ్జెం కరివేపాకు కోసుకుని బైటకొచ్చేసరికి చింతడు రొప్పుకుంటూ ఎదురొచ్చాడు.

అక్కడే చుట్టచుట్టుకుంటూ కూర్చున్న వీరభద్రరావుతో, "మా అయ్యింటికొచ్చాడుగానీ, చేపలేమీ పడలేదంటుండే" అన్నాడు.

"అరి మాల్నాకొడకల్లారా! యిష్టం లేకపోతే ఎన్నబద్దాలైనా ఆడతార్రా మీరూ. వురే, నేను యమర్జంటుగా మాట్టాడాలంటున్నానని నీ బాబుని పిల్చుకురారా" అని మళ్ళీ చింతణ్ణి వెనక్కి తరిమాడు.

చింతడూ సొరాజ్జెమూ కల్సి బైటికొచ్చారు.

"ఏరా, నిజంగానే చేపలు పడలేదేరా?"అంది సొరాజ్జెం.

"అళ్ళతో అనమాకగాని..."

"మా అయ్య కరిమెల్లెల్తన్నాడు. బుట్టనిండా చేపలే.అమ్మటానికెళ్ళాడు. 'మా దొర చేపలు దొబ్బటమేగాని, డబ్బులు మాత్రం ఇవ్వడు" అన్నాడు కోపంగా.

"మరిప్పుడేం చేత్తా?" అంది సొరాజ్జెం.

"ఏదొకటి చేతాలే గానీ, మీ దొరసానితోకూడా చెప్పమాక..." అని చింతడు మాలపల్లికేసి పరుగుదీశాడు.

ఆడితల్లి, "గేలం పుచ్చుకుని మళ్ళీ కాలవ కెళ్ళాడూ, ఏమన్నా పడితే మీకే తెచ్చిత్తాడంటన్నెప్పు" అంది.

చింతడు రెండు నిముషాలు యింటిదగ్గరే కూచుని మళ్ళీ దొరింటి కొచ్చాడు.

"మా అయ్య గేలం తీసుకుని 'జంగాలవ కాలవ' కెళ్ళాడంట దొరా! మా అమ్మ సెప్పింది. ఏవన్నా పడితే, మీ కే తెచ్చిత్తాడంట" అన్నాడు చింతడు.

"ఏమన్నా పడతయ్యంటావా ?"

"ఏవోనుండే. నీటురవడెక్కువగా వుందంట. గేలాలకి పడవంటుండే. మావుఁలకైతే పడతయ్యంటుండే"

"నర్లే, ఏంజేత్తాంగానీ, నీ బాబుతెత్తేనరే. లేపోతే ఆ నల్ల కోడిని పట్టుకో. మాతోడల్లుడు రాక రాక వత్తన్నాడు" అని చింతడితో చెప్పి తనలో తను."పైగా అయన్తో మనకో పనొచ్చిపడిందికూడా" అనుకుంటూ లోనకెళ్ళాడు.

లలితమ్మ "ఆడెన్నిసార్లు చేపలిచ్చినా ఒక్కసారీ వొక్క రూపాయన్నా ఆడిచేతిలో ఏశారా ? ఆడూ చేపలమ్ముకుని బతికేవాడేగా. ఊరికే ఎన్నిసార్లిస్తాడూ ?" అంది.

"ఓసినీయమ్మ! నువ్వూరుకోవే! మాట్టాడితే మాల్లంజాకొడుకుల్నీ, మాదిగలంజాకొడుకుల్నీ ఎనకేసుకొత్తావ్. యేం ? యేంతీపరం ? గోసెట్టుకోటం సేతకానోణ్ణి పన్లోపెట్టుకుని సంవత్సరం తిరిగొచ్చేసరికి నాలుగుబత్తాలెవడిత్తన్నాడే, నీబాబూ" అని ఎగిరాడు.

"నర్లే... మధ్యలో మానాన్నెందుకిత్తాడూ. వూరికే యిత్తనట్టే నాలుగు బత్తాలు. చిన్నాడన్న మాటేగానీ ఆడు జెయ్యని పనుందా? వొళ్ళు దాసుకోకుండా పనిచేత్తాంటే యిత్తన్నారు" అంది లలితమ్మ.

"ఓసి నీయమ్మ మాటకి మాటంటావ్. నిన్ను నదివిచ్చి చెడగొట్టాడే నీ బాబూ"

"అ... చదువు. మా గొప్ప చదువు. అయిదేగా నేన్చదివింది" అంది లలితమ్మ.

"అయిదుకే ఇంతింత లాపాయింట్లు తీత్తన్నావు, ఇంకా నదివితే లాయరుపని నువ్వే సేద్దువేమో?"

✦ ✦ ✦

"ఊర పౌర్ణమి" యింకా ఓ వారం వుందనగా పద్దాలు అనసూయమ్మ దగ్గర కొచ్చింది.

"ఏంటే పద్దాలు ? మరీ నల్లవూసైపోయావు ? కనపడితే కొరుక్కు తింటాననుకున్నా వేంటే?" అంద అనసూయమ్మ.

"నీకు నేనే కావాల్సొచ్చిందేంటుండే, కొరుక్కుతింటానికీ" అంది పద్దాలు.

"ఏంటిట్టా వచ్చా?"

"అదే నుండే. ఈరాపోర్న మొత్తాంది గదా, పిల్లముండ సంగతి మాట్టాడదావ(నీ..."

"ఏముందే మాట్టాట్టానికి. దానికేమన్నా కష్టంగుందా మా యింటో? కన్నబిడ్డకన్నా ఎక్కువగా చూసుకొంటన్నా. పిచ్చి ముండ అదికూడా ఇంటో మణిసిలా కలిసిపోయింది మాలో" అంది అనసూయమ్మ. 'ఏమైనా సరే,' నోరు జారకూడ ద'ను కొంది లోపల్లోపల.

"...ఏం లేద్దొరసానీ! వొక పందుం యిత్తారేమో, ఈ సం వచ్చరం అని అడుగుదామని వొచ్చా..." అని నసిగింది పద్దాలు.

పద్దాలు మనసులో 'పందుం' కావాలనీ లేదు. 'పందుం' అనసూయమ్మ యిస్తుందనీ లేదు. 'మాట కదిపిచూద్దాం"అని అడిగింది.

"ఓసి నీ ఆశ దొంగల్దోలా! ఈ సంవత్సరానికే అన్ని పనులూ వొచ్చేసినట్టూ దానికి పందుం యిమ్మంటన్నా? నీకిష్టం లేకపోతే మాన్పిచ్చెయ్‌లేగానీ...... పందుం వొడ్డిచ్చి నేనుంచుకోలేనే తల్లి..."

"రొండుపూటలా అన్నంపెడుతున్నా! రొండుజతల బట్ట లిస్తన్నా —అంటూ పందుం అంటే అయిదు బస్తాలుగాక వో యాభై బస్తాలయినట్టూ; 'రొండుపూటలు', 'రొండు జతలు' అనేవి మాత్రం 'కొన్నివందలు' అన్నట్టు అనసూయమ్మ సాగ దీస్తోంది.

పద్దాలు బెంబేలుపడి, "మరి మీరెన్నిత్తారమ్మా"

"నేనేమీ యియ్యనే. ఇంతకుముందెట్టాజేసిందో అట్టాగే సెయ్యమను"

"అట్టెట్టా జేసుద్ది దొరసానే. పెద్దదవలా ?"

"పెద్దదైతే అన్నం ఎక్కువ తినదా? బట్టెక్కువ కట్టదా?"

"లేద్దొరసానే. మీరేమిత్తారో సెప్పండి"

"ఒక్క బత్తాకూడా యివ్వనే"

"అన్నలియ్యరా ?"

"యియ్యేను"

"దండాలు దొరసానే. ఏరేపిల్లని సూసుకోండయితే" అని లేచింది పద్దాలు.

"యేరేపిల్లని చూసుకోమని మాల్లంజివి నువ్వు చెప్పక పోతే నాకు తెలవదా ?"

పద్దాలికీ, అనసూయమ్మకీ తెగతెంపులయ్యింది. సొరాజ్జాన్ని పద్దాలు ఇల్లిల్లూ తిప్పింది.

రెండుపూటలా తిండిపెట్టి, రెండుజతల బట్టలిచ్చి మూడు బస్తాలవొడ్లు యిచ్చేట్టుగా మాట్లాడుకుని సొరాజ్జాన్ని మహాలక్ష్మమ్మ దగ్గర పనికి పెట్టింది.

సొరాజ్జెం 'మాలచ్చమ్మ' గారింటికి పనికి పోతోంది.

మహాలక్ష్మమ్మ పంతులమ్మ పనిచేస్తోంది. ముక్కుసూటి మనిషి. ఏది మాట్లాడినా తెగేసినట్టు మాట్లాడుతుంది. సొరాజ్జెం పనిలోకి రాగానే మాలక్ష్మమ్మ దాన్ని కూచోపెట్టి వోక్లాసు తీసుకుంది.

"వుసే సొరాజ్జెం ! నువ్వు రోజూవారీ ఏమేం పనులు చెయ్యాలో చెప్తా సరిగ్గా విను. నన్ను విసిగించకుండా చెప్పినట్టుచేసుకుపో !" అంటూ మొదలెట్టింది.

"ఎలుగొస్తా వుండగానే రావాలి.

రాగానే తలోకిలీ, యిల్లూ, దొడ్డీ అన్నీ అద్దంలాగా వూడ్చి చెయ్యాలి.

వూడవగానే తొట్టడుగు నీళ్ళన్నితోడి, పేడకలిపి, కళ్ళాపి కొట్టాలి.

కళ్ళాపి కొట్టినాక నాలుగ్గర్రలెయ్యాలి.

ముగ్గేసినాక తొట్టి శుభ్రంగా కడుగు. లేకపోతే పాసిపట్టిపోతుంది.

కడిగినాక ఇత్తడి బింది తీసుకుని కాలవకెళ్ళు. శుభ్రంగా తోమి కడుగు. ఆ బిందితో నీళ్ళు తెచ్చి తొట్టినింపు.

తొట్టి ఫిండిన తర్వాత తూరుపువెర్లో నీళ్ళుతెచ్చిబాన్నిండా పొయ్యి. బానలో నీళ్ళు వొడపొయ్యి. నలకలూ, గిలికలూ లేకుండా. తర్వాత ఇంకో బిందిడు తెచ్చి-యింట్లో మంచినీళ్ళ కుంటయ్-అట్టాగే పెట్టయ్.నీదుంపతెగ...వాటిమీద మూతలు

... తర్వాత ఏ పురుగో, పుట్రో రోగాలొచ్చి చావాలి.

తర్వాత—

వొంటింట్లో పెట్టిన అంట్లన్నీ తోమాలి.

పొయ్యి రాజెయ్యాలి.

దాలి అంటించాలి.

ఉలవలకుండెయ్యాలి.

తర్వాత—

గీదని కాలవొడ్డున వొదులు. అది మంచి గొడ్డు. ఎటూ పోదు వొడ్డొదిలి. దాన్నక్కడే వొదిలొచ్చి నువ్వు గొడ్డ చావిడంతా బాగు చెయ్యి. నీకెప్పుడు చెయ్యి ఖాళీ అయితే అప్పుడు చద్దన్నం తిను. నీ యిష్టం. నీ యిష్టమొచ్చినంత నువ్వు తిన్నంత తిను. నిన్ను వొద్దన్నాళ్ళు లేరు. పిల్లలూ, నేనూ స్కూలుకి పోతాం.

సౌరాజ్జానికి అపనుల జాబితా వింటే ఏమీ భయమెయ్యలా. పంతులమ్మ వుద్యోగం చేస్తన్నావిడ దగ్గిర పని చెయ్యటం అంటే ఎంతో గొప్పనిపించింది సౌరాజ్జానికి.

“దొరసానమ్మగోరో, మీకు జీతమెంతుండే?” అని కుతూహలంగా అడిగింది.

“నీకెందుకే ఆ ‘అరా’ లన్నీ. నీ పని నువ్వు చూసుకో... సాయంత్రపేళ గీదని తీసుకొచ్చి కట్టేసుకో. దానికి గడ్డీ అదీ ఎయ్యి. ప్రెతీ రోజూ జనపకట్టొకటెయ్యి. వులవలు వుడికినాక అయ్యి తీసుకొచ్చి వొంటింటో వొకమూల పెట్టు. లేకపోతే, కుక్కలో కోళ్ళో అడ్డమైన మందా తినేస్తయ్. ఉలవ నీళ్ళూ అయ్యీ ఎప్పుడన్నా కావాలంటే నువ్వో నేనో తీసుకుందాం. వేరేవాళ్ళకెవళ్ళకీ యివ్వమాక. రసవంతా దాన్లోనే వుంటుంది. గీదకి పెడితే కాసిని పాలన్నా యిస్తుంది. కమ్మగా తాగొచ్చు...... వుసే... నీపేరేంటో...”

“సౌరాజ్జవుండే”

“నామతిమండా. వుసే, సౌరాజ్జెం! ఇల్లంతా నీమీదే వొదిలేసి పోతా. ఏంచూసుకుంటావోమరి... అ... సందకాడ సందకాశీ తీసి గీద పాలు పితకాలి...”

“నాకు రాదమ్మగారో!”

“ఓసి పిచ్చిమొకందానా! ఇన్నేళ్ళొచ్చినియ్ పాలు పితక

టం రాదంటే. రొండ్రోజుల్లో నేర్చుకోవచ్చులే. పెందళకడే అన్నంతిని పోదువుగాని...నాకేంలేదే సౌరాజ్జం! కాస్త నువ్వు చేసాయంగావుంటే నాలు" అని మాలక్ష్మమ్మ సౌరాజ్జ మేమేం చెయ్యాలో చెప్పి ఆ నాటినుంచీ ఆ యింటి పనికి సౌరాజ్జాన్ని 'రాణి'ని చేసేసింది.

అనసూయమ్మింటికన్నా సౌరాజ్జానికి మాలక్ష్మమ్మ యింటిలో పని చెయ్యడం సులువుగా వుంది. పనెక్కువగా వున్నా పైగా కడుపునిండా అన్నం.

* * *

మహాలక్ష్మమ్మకి చిన్నప్పుడే పెళ్ళయింది. భర్త కొండలరావు గుడివాడలో గుమాస్తా వుద్యోగంచేస్తున్నాడు. కుటుంబానికిగానీ అతనికి అతనుగానీ ఎందుకూ పనికిరానివాడు కొండలరావు.

ప్రతి నెలా జీతాలు రాగానే జీతం అంతా పూర్తిగా అయిపోయేవరకూ నిద్రాహారాలుమాని పేకాడతాడు.

అటెనక నిద్రాహారాలు మాని డబ్బుకోసం వేటాడతాడు.

అటెనక మళ్ళీ పేకాడుతాడు.

అటెనక మళ్ళీ వేటాడతాడు.

చేతిలో డబ్బు అయిపోయినప్పుడల్లా అతని బొటనవేలు "పేకాడదాంరా! పేకాడదాంరా!" అంటుంది.

చూపుడువేలు- "ఎక్కడతెచ్చి ఆడదాం?" ఎక్కడతెచ్చి ఆడదాం?" అంటుంది.

మధ్యవేలు-"అప్పుతెచ్చి ఆడదాం. అప్పుతెచ్చి ఆడదాం" అంటుంది.

వుంగరంవేలు-"అప్పెలా తీరుద్దాం! అప్పెలా తీరుద్దాం!" అంటుంది.

చిటికెనవేలు-"పెళ్ళాం మీదకి తోసేద్దాం! పెళ్ళాంమీదకి తోసేద్దాం!" అంటుంది.

అతని బుర్రా, మిగతా అవయవాలూ అన్నీ 'పేకాట' గురించే ఎప్పుడూ ఆలోచిస్తూ తన్మయత్వం చెందుతూ వుంటాయి.

"బాబ్బాబు ప్రాణంమీదకొచ్చింది, అర్జంటుగా వొకొంద రూపాయలు సర్దు" అంటాడు సమయానికి ఎదురుపడిన మనిషితో.

"నా దగ్గర లేవయ్యా" అని రెండో మనిషనగానే,

"ఆమాటనొద్దు. మీరు కాదంటే నాకు మరణమే శరణ్యం. పిల్లలుగలాణ్ణి. వాళ్ళ నన్యాయం చెయ్యొద్దు" అంటాడు.

అప్పివ్వకపోతే కొండలరావు పిల్లలకి అన్యాయం చేస్తున్నాను కాబోలని, ఎదుటివ్యక్తి జెంబేలుపడిపోయి జేబులోకి చెయ్యిపోనిస్తాడు. అసలలా జెంబేలుపడేవ్యక్తినే ఎన్నుకుంటాడీయన.

సరే! ఆయన కాస్త మెత్తబడ్డట్టు గమనించగానే, "మీకు నేను రెండొందలకి నోటు రాసిస్తాను. మీరు నాకు నూటపాతికివ్వండి చాలు" అంటాడు.

"నాకెందుకయ్యా అన్యాయంగా నీడబ్బూ" అని అతను యిచ్చినంతవరకే రాయించుకుంటాడు.

తర్వాత కొన్ని నెలల్లోనే, "నా డబ్బేమయింది" అని వస్తాడు గదా అతను ?

"డబ్బా! డబ్బెక్కడిది? డబ్బుంటే మీలాగా యిట్టా బజార్లెంట ఎందుకు తిరుగుతాను ?" అని హాస్యాలాడ్తాడు.

డబ్బిచ్చినాయన నెత్తీనోరూ బాదుకుంటాడు.

అప్పుడు ఆయన్నిచూసి ఈయనజాలి పడ్తాడు. "పాపం డబ్బు అప్పలిచ్చి నష్టపోయేడే!" అని.

అప్పుడు చిరునవ్వుతో, "ఒక మార్గం వుందండీ. మీరా పని చెయ్యండి" అంటాడు దూరంగా ఆలోచిస్తూ, "ముందు మీరో పదిరూపాయలు నాకివ్వండి" అంటాడు.

ఆ పదీ అందగానే దాన్ని జేబులో పెట్టుకొని వెంటనే ఒక కాగితంమీద మహాలక్ష్మమ్మ అడ్రసురాసి ఆ కాగితం ఆయన చేతిలో పెడ్తాడు తనఅప్పు తీర్చేసినట్టు.

"ఏంటయ్యా ఇది ? ఈ ఆడకూతురి అడ్రసు నేనేం చేసుకోను?" అంటాడు రుణదాత.

"నాలిగ్గిసుకోండి" అని కాసేపు వేళాకోళా లాడి, రెండు మూడు వెకిలినవ్వులు నవ్వి అప్పిచ్చినవాడి మనసుకి గాటు పెట్టి కారం రాసి అప్పుడంటాడు–"మీరు తిన్నగా ఈ అడ్రసు గలామెదగ్గిర కెళ్ళండి. ఆమె నా భార్యే. వెళ్ళి మీకు నేను రాసిచ్చిన నోటు చూపించి. "ఇదిగో అప్పు తీరిస్తే తీర్చు. లేకపోతే మీ ఆయన్ని బొక్కలోకి తోయిస్తాను. మరి చూసుకో"

అని చెప్పు, ఆవిడ స్కూల్లో వున్నప్పుడు వెళ్ళి అప్పడిగా వంటే ఆ సాయంత్రమే డబ్బు నీ చేతిలో పడిపోతుంది. మనిషి చాలా గడుసుది గానీ, పరువుదగ్గర దాని గడుసుదనంఅంతా తీసికట్టులే."

అప్పిచ్చినాయన వుషారుగా బయల్దేరి మహాలక్ష్మమ్మని స్కూల్లో పట్టుకుంటాడు

మహాలక్ష్మమ్మ అభిప్రాయం — "మొగుడనేవాడు ఎంత భ్రష్టుడైనాసరే మొగుడు మొగుడే! అసలు మొగుడన్నాక భ్రష్టుడు గాకుండా ఎలా వుంటాళ్ళే" అని.

పంటల్లోవీ, పెట్టెల్లోవీ అక్కడివీ, ఇక్కడివీ, కలిపి అతని నోటు చెల్లబెడ్తుంది

మహాలక్ష్మమ్మ భర్త ఆ రోజూ, ఆ మర్నాడూ మాత్రం ఇంటికి రాకుండా మూడోరోజు ఎవరిదో 'బేల' మొహం అప్పు తెచ్చి, దాన్ని తగిలించుకుని ఇంటికొస్తాడు. అన్నంతినకుండా మంచంమీద పడుకుని కళ్ళనీళ్ళెట్టుకుంటాడు.

"ఏడిచింది చాల్లే. ఇంక తగలడు" అని అన్నం పడే స్తుంది మహాలక్ష్మమ్మ.

పెళ్ళయిన కొత్తల్లో మహాలక్ష్మమ్మ భర్తని మాటమాటకి "యేవండీ, యేవండీ" అంటూ వుండేది. తన నేర్పుతో, ఓర్పుతో భర్తని మార్చేస్తాననుకునేది. తొందర్లోనే తనబలం తనకి తెలిసొచ్చింది. చివరికి 'సచ్చినాడు' 'రాల్నాడు'లాంటి తిట్లు అలవాటు చేసుకుని పేకాడే భర్తని పెంచడం అలవాటు చేసుకుంది.

* * *

సొరాజ్జెం శుభ్రంగా బాధ్యతగా పని చెయ్యడం గమనించిన మహాలక్ష్మమ్మకి సొరాజ్జెమంటే గురికుదిరింది. అందుకే సొరాజ్జెం ఏంఅడిగినా లేదనేదికాదు. కాదనేదికాదు.

"దొరసానమ్మగోరూ. చద్దన్నం యింతమిగిలిందేముండే"

"ఆరాల్నాడొస్తాడని వుడకేశానే. తగలడలేదుగా. కుడి త్రొట్టో పడెయ్."

"కూత్తట్టిపెట్టి మా అమ్మకి తీసికెళ్తానుండే."

"తీసికెళ్ళవే. ఆ ఉలవచారుకూడా తీసికెళ్ళు!...... మీ

అమ్మ ఏంతింటందే? ఎప్పుడు చూసినా సగంచచ్చిన మణిసి లాగే వుంటంది!"

"ఏంతింటందుండే, దాని మొకం. అదేం తినదుండే"

"ఏం తినకపోతే ఎట్టా బతుక్తారే?"

"అదేనేంటుండే? మాలపల్లిలో మా అమ్మలాంటాళ్ళు శానామందుండారుండే. రెండుమూడు పూటలకోసారి గుక్కెడు గంజినీళ్ళు తాగుతార్లెగండి. అదేనుండే కూడూ, కూరా, అంతా పూట పూటా తినేరాతుంటే మాలపుటకెందుకు పుడతార్లె గండే."

"ఓసి, నీ దుంపతెగ. నీకీ మాటలెవరు చెప్పారే? మాల పుటక పుడితే తిండి తినొద్దేంటే?"

"ఎట్టా తింటారుండే, పుటకే మాలపుటకైతే, మాలోళ్ళకి తిండేంటి, సుకవేంటి లెగండే"

"ఓసి పిచ్చిదానా! అందరి బతుకులూ అంతేలేవే—

"కమ్మ పుటకపుట్టి నెనేం బావుకుంటున్నానో చూస్తున్నా వుగా?"

"మీకేం లెగండే. రొండు శేర్లు పాలిచ్చే పాడి గేదుంది. పంట చేనుంది. మారాజులాంటి వుజ్జోగంవుంది. పొయ్యి మీదకుంది. పొయ్యికిందకుంది. మాతో మీకేం సాపచ్చేముం డెమ్మగోరో!"

"ఓసి, నీ దుంపతెగా? ఎన్ని చదివావే? అన్నీవున్నాయి, అయిదో తనమే తక్కువనీ"

"అట్టా అనబాకండే. దొరగోరు మంచోరే లెగండే! ధర్మ రాజు లాంటోరు!"

"అ ధర్మరాజే! మంచిమాటన్నావులే. ఆనాడాధర్మరాజూ ఇట్టాగే ఏడిపించిచచ్చాడేమో. ఈరాల్నాడు నచ్చినా రొండు సోకాలెట్టి ఊరుకొందును. వుండెవర్ని వుద్దరిస్తున్నాడే?" అని మహాలక్ష్మమ్మ కళ్ళనీళ్ళు తిప్పుకునీ—"సరేలే! ఈ ఏడుపె పుడూ వుండేదేలే లెగు! లెగిసి కొట్టుకెళ్ళిరా. ఓంతపొందు" అని సొరాజ్జాన్ని బైటికి తరిమింది.

సొరాజ్జెం బయటికి పరుగుదీస్తోంటే వెనకనించీ పెద్దపెద్ద కేకలేసి పిల్చి—"వుసే! మా దొరసానమ్మ మొగుణ్ణి ఇట్టా

తిట్టింది, అట్టా తిట్టిందని ఎవరితోటి అనమాక. బాగుండదు" అని హెచ్చరించింది.

"నేనెందుకు చెబుతానుండే కస్టం సుకం ఆమాత్రం అనుకోకుండా ఎవరుంటార్లెగండే" అనేసి పరిగెత్తిందిసొరాజ్జెం.

వెళ్ళింది వెళ్ళినట్టే చేతులూవుకుంటూ వెనక్కొచ్చింది– "కొంతన్నా సెల్లెయ్యకపోతే అప్పెట్టనన్నాడుండే కోంటాయన"

"అడి గుడ్డుతోడా. అడికేమొచ్చిందె పోయేకాలం. వూరిడిసి పారిపోతారనుకున్నాడేంటే, ముదనష్టపాడు. యాభై రూపాయలు గట్టి వారమన్నా దాటలేదు గదంటే. ఎట్టా ఇవ్వనంటాడో నేనెళ్ళి అడిగొస్తాగానీ, సంకిట్టా పడే:, వర్లక్షుమ్మగార్నడిగి, గబిక్కిన తోడుచుక్కట్టుకురా చల్లన్నీ పిల్లి పారబోసి చచ్చిందిగా?... ఏ సరుకు గావాల్సినా అందరిళ్ళల్లో మొగాళ్ళా గుడివాడనుంచీ తెచ్చుకోటంలేదూ? అగ్గిపెట్టి కూడా ఉడిదగ్గిర కొనకుండావుంటేసరి ఉడి తెగులు కుదురుతుంది. గుడివాడనుంచీ నాకేమహరాజు తెచ్చిపెడితాళ్ళే... వుసేప్, ఎంకావా! అని మహలక్ష్మమ్మ వీధిలోపోతూన్న చాకలి ఎంకావని చూసి ఒక గావుకేకెట్టింది.

"ఏంటుండే" అంటూ ఎంకావ గుమ్మంకాడికొచ్చింది.

"పిల్లముండనిపంపితే ఎల్లగొట్టాడుగాని ఒకసారి కోంటింటికెళ్ళి పద్దురాసుకోమని సవాశేరు చింతపొండు తెచ్చిపెట్టవే"

"అయ్యో! మంగలాయన ఇంటికెల్తాన్నానుండే. మా ముసిలోడు ఎగశాసా, దిగశాసాతో గిలిగిల్లాడతన్నాడండే. మంగలాయన దగ్గిర ఏదన్నా మందుతెద్దారని... సాయింత్రపేళ తెచ్చిపెడతాలెండె చింతపొండు"

"సాయంత్ర పేళేం జేసుకోనే?...సర్లే...నువ్వెళ్ళు అడికి వుబ్బసమా?

"మరేనండే... ఇంతెత్తు ఎగిరి పడతన్నాడుండే. వత్తానమ్మగోరో. ఏమనుకోకండే"

చాకలి ఎంకావ ఎళ్ళగానే మాలక్ష్మమ్మ సంచి తీసుకుని బైల్దేరింది.

సొరాజ్జెం వుట్టిమీద పాలు పొయ్యి సెగనబెట్టి 'కోపా' పట్టుకుని తోడంటుకి పరిగెత్తింది. వర్లక్షమ్మగారింటో చేమంతి

పూలుంటాయని సౌరాజ్జానికి వాళ్ళింటికెళ్లాలంటే సంబరం. ఒక పువ్వివ్వమంటే యిస్తుందావిడ.

సౌరాజ్జెం చేతిలో కోపా చూసి వర్లక్షమ్మ మొహం వికారంగా బెట్టి– "నీదుంపతెగ. చల్లకూడా నువ్వే ముట్టుకుంటావంటే? మీ దొరసానమ్మకి మరీ మతిలేకుండా పోతాందలే." అంది.

"ఏంటుండే, మేం మడుసులం గావేంటండే?"

"ఆఁ. మడిసివే. మాలావు మడిసివి. పాలల్లోకి తోడుంచుకోవాలని చల్ల ఈగేప్పుడు గుర్తుండదేమో నీకూ, మీ దొరసానమ్మకినీ"

"పిల్లి పారబోసిందుండే చల్లంతా!"

"మీ దొరసానమ్మెక్కడికెళ్లిఁది, ఎక్కడా నడినప్పుడు లేదు. వాన కురిసెలిసినట్టు"

"కోంటింటికెళ్ళిందుండే"

"ఇందాక నువ్వొళ్ళినట్టున్నావుగా?"

"ఇవ్వనన్నాడుండే"

"ఏం తీసగమొచ్చిందో..." అంటూ కోపాతో చల్ల తెచ్చిచ్చింది. "ఈసారి నువ్వు రామాక"

సౌరాజ్జానికి పువ్వు అడగడం యిష్టంలేక మాట్టాడకుండా వొచ్చేస్తాంటే, "ఒసే మాల్దాన ఒక పువ్వు కోసుకోవె!" అంది వర్లక్షమ్మ.

"వొద్దులెగండే" అని కోపంగా వెళ్ళిపోయింది సౌరాజ్జెం.

* * *

సౌరాజ్జెం ఏడాదినుంచీ పైటలేసుకుంటూ వుంది.

మహలక్ష్మమ్మగారింటోజేరి మూడేళ్ళయింది.

పద్దాలు జీతం పెంచమంటే మహలక్ష్మమ్మ నసేవిరా అంది.

"పిల్ల పెద్దదైంది గదుండే మూడేళ్ళనాడిచ్చినదే ఇత్తారా వుప్పుడుకూడా?" అంది పద్దాలు.

"పెద్దదైతే పూటపూటా పెద్ద'వాయి'లు మింగదూ? కొత్త పని చెబుతున్నానా జీతం పెంచడానికి?"అంది మహలక్ష్మమ్మ.

పద్దాలు కాస్సేపు అడిగి వెళ్ళిపోయింది. తర్వాత కోపం

పట్టలేక ఎవరిదగ్గిరో నోరు జారినమాట నిజమే పద్దాలు—
"మొగుడు జేసిన వందలూ, ఏలూ అప్పులు తీరుసుద్దిగానీ, రెక్కలు ముక్కలు సేసుకుని చాకిరీ చేసేదానికి వొకరబస్తా జీతమెక్కువజెయ్యటానికి మాత్రం ఆతల్లికి మనసొప్పలా!" అంది ఇంకో దొరసానమ్మ దగ్గిర.

ఆ మాట మహాలక్ష్మమ్మకి చేరనే చేరింది.

సొరాజ్జెం ముందు, పద్దాల్ని తిట్టిపోసింది. "నా మొగుడు చేసే అప్పులు నేను దీరుస్తా! దానికెందుకంట! మాలలంజలు చెప్పాలా నాకు? మాల్దానికి తెలిసినపాటి తెలవదా నాకు? పది పుట్లిచ్చి పనిచ్చేవాళ్ళెక్కడన్నా వుంటే చూసుకోవే" అని తిట్టిపోసింది.

సొరాజ్జెం పనికెళ్ళడం మానేసింది.

మహాలక్ష్మమ్మ మళ్ళీ రెండు మూడుసార్లు కబుర్లంపింది గానీ సొరాజ్జెం ఎళ్ళనంటే ఎళ్ళనంది.

* * *

తర్వాత ఎర్ర సూర్యంగారింట్లో పనికి కుదిరింది.

ఎర్రసూర్యం పాతికెకరాల రైతు.సొంతెవసాయవే. అంతా పాలేళ్ళే చూస్తారు.

రెండుపూటలాఅన్నంపెట్టి రెండుజతల బట్టలిచ్చి పంధుం వొడ్డిస్తారు. కొంచెం మంచి జీతవే.

అక్కడే 'గొడ్డకాడి బుడ్డోడు'గా వంకురాత్తిరి గాడుకూడా చేరాడు. వాడికి రెండు పూటలా అన్నం పెట్టి రెండు బస్తాల వడ్లిస్తారు.

వంకురాత్తిరిగాడి పనల్లా అవుల్ని, గేదెల్నిపొలాలవెంటా, గట్లవెంటా తిప్పుకురాడం. కాలవలోపడేసికడిగి ఇంటికి తోలుకొచ్చి వాటికి కుడితులెట్టి మేతెయ్యడం. దొరసానో, దొరో, పెద్దపాలేరో పాలుతీస్తోంటే దూడనిలాగి కట్టెయ్యటం... ఇట్టా వుంటాయి వాడిపనులు.

ఖాళీగా వున్నప్పుడు సొరాజ్జానికి సాయం చేస్తూంటాడు.

వాడికి చిన్నప్పట్నుంచి సొరాజ్జెమంటే ప్రేమే.

సొరాజ్జమేమో అస్తమానూ వాణ్ణి ఆటపట్టిస్తుంది.

"గొడ్డకాడి బుడ్డోడి పెళ్ళెప్పుడోయ్!"-

గొడ్డన్ని చేలోన పడ్డప్పుడోయ్!"-అని పాడి, వాణ్ణి వుడికిస్తంది.

సంకురాత్తిరిగాడికి-కా తొమ్మిదో ఏడే. పీలగా, నా-తరప లాగ ఆరేళ్లాడిలాగా కనపడతాడు.

గొడ్లు అడు చెప్పినట్టు వినవేవినవు గొడ్లని మళ్ళేసినంత సేపూ ఆడు ఎక్కడాలేని తిట్లు తిడతానే వుంటాడు.

"వుసేయ్! నీయమ్మ నీ కొమ్ములు కోయించుతానుండు. చేయ్, నీ...మొండితోకదానా! నీకు తోకలేకపోయినా నీయమ్మ నీపొగరు తగ్గలెదే...ఛేయ్...బాణా కొమ్ముల్దానా సేయ్ దిగు, దిగు! దిగూ! వొచ్చానంటేనా...!" అంటూ కాలవలోకి దిగిన గొడ్లనీ, దిగని గొడ్లనీ వరసబెట్టి తిడుతూ, ఇటునుంచి అటూ అటునుంచి ఇటూ కాలవలో అడ్డం పడుతున్నాడు సంకురాత్తిరిగాడు ఆ సాయంత్రపేళ.

కాని, ఆ గేదెలుఒక్కటీ వీడి మాటినక తలోక దిక్కునా గట్టెక్కి కాలవ అవతలున్న చేలోకి దిగిపోయినయ్. ఆ చేను నల్లచంటబ్బాయి బావగారిది.

అప్పుడా చేను కామందు అక్కడే వున్నాడు గొడ్లు చేలో పడటంచూసి, "వురేయ్! ఎవడ్రా ఈ గొడ్డని తోలుకొచ్చిన గాడిదకొడుకూ, రేయ్! బుడ్డలంజాకొడకా! నీకేం ఆగుతుయ్యని ఈటిని కడగటానికి తోలుకొచ్చావురా మాల్లంజాకొడకా. నీయమ్మ చేనంతా నాశనం చేశావుగదరా! సమయానికి నేనున్నాకాబట్టి సరిపోయింది. బుడ్డలమ్మికొడకా! నీయమ్మ దొంగనాకొడకా! ఇట్రారా!" అని తిట్లవర్షం కురిపించేస్తూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వొచ్చి సంకురాత్తిరిగాణ్ణి అందుకుని చెవులులాగి నెత్తిమీద పటపటా నాలుగుదెబ్బలేసి వాడు పారిపోతోంటే వీపు మీద పెద్దపెద్ద చరుపులు చరిచాడు.

బుడ్డోడు ఘొల్లున ఏడుస్తూ ఇటూ అటూ పరిగెత్తాడు.

"లమ్మికొడకా! మళ్లీ కనపడు, నరికేత్తాను నీ అన్నని చూశావా, అప్పుడు కోదండం ఏశారు. అట్టాగేయిత్తాను" అని చేనుకామందు మళ్లీ తిట్టి చేలోకెళ్లిపోయాడు.

సంకురాత్తిరిగాడు గొడ్లని తోలుకురావాలని చూసి అవి

మాటినక తలో వెపూ పీరుగూతీస్తాంట, కం్రతీసంస్, ఎయ్యిమ్మ మంద..." అని మళ్ళీ ఏడవడం మొదలెట్టాడు.

అంతలోకే వాళ్ళ పెద్దపాలేరు- 'బండనాగ్గాడు' వొచ్చి పరిస్థితి చూశాడు.

అవతలిగట్టు మీదనుంచీ చేను కామందు గావు కేకలేసి పెద్దపాలేరుకి చబున్నాడు.

"ఈ బుడ్డలంజాకొడుకుని నువ్వే నం్రటా పంపింది బండ నాగ్గా! నీయమ్మ మీకు బుద్దుల్లేవేరా? అడేం మళ్లేత్తాం్రడా మీ మందనీ నాచేనంతా సితకదొక్కించాడు. చూ్రడాఇటొచ్చి... షరేయ్! ఈ సారిట్టా జేశాడంటే కోదండం ఏయింపేత్తాం్రనోయ్ ఆణ్ణి! ఆడుసూడు ఆ పిల్ల నా కొడుకు ఎట్టా ఏడుత్తున్నాడో..." అని ఏవేవో కేకల్తో మాట్లాడుతున్నాడు

బండనాగ్గాడు బుడ్డాడి ఏడుపుజూసి నవ్వుతూ, "వురే. ఆపరా యింకపిచ్చికంశా. గీదల్ని మల్లెయ్యలేక ఏడుత్తున్నా?" సిగ్గులేనెదవ...పా! తోలుకుపా. ఇంటికి" అన్నాడు.

"అయ్యి నా కాగట్లా!"

"ఎట్లా ఆగుతయ్- ఆటిని నవడతీత్తాంటే- గొడ్డుని బాది నట్టు బాదాలిగానీ."

"బాదొద్దని దొరసాని చెప్పింది"

"దొరసానమ్మ చెప్పిందా? దొరసానికే దొరసానిబాగానే సెప్పద్ది ఒక్కవూటు గీదల్ని బాదకుండా మలెయ్యమను తెలి సొచ్చుద్ది. అయినా దొర సంగతే తెలవదు దొరసానికి ఇంక గొడ్డు సంగతేం తెలుత్తుందిరా. పద, పద..."అని, "ఏయ్!... ఇటు...ఇటు... గుడ్డిమందయినియ్యేంరా ఇయ్యా! ఇంటిదారి మరసిపోయినట్టున్నయ్...నీ మందగాల!..." అని గేదె వెన కాల పరిగెత్తి ఏది దొరికితే దాన్ని చేతిలో కర్రతిరగేసి చచ్చేట్టు బాదడం మొదలెట్టాడు.

అవి ఎక్కడివక్కడ అటొకటీ, ఇటొకటీ పరిగెత్తుతుంటే, "ఇంటికి నడవండి. లేకపోతే ఇవ్వాళ తాటొలిశానే! అని వాటికి అర్దరేశాడు.

"నంపురాత్తిరిగాడని ఎవ్రళ్లా పేరెట్టింది? సన్నాసిగాడని పెడితే బాగుండేది. నీపిచ్చి సిగదొరగా" అని దోవ పొడు

సూతా సంకురాత్తిరిగాడితో సరసాలాడుతూనే ఇంటికి జేరారు.

సంకురాత్తిరిగాడు దొడ్లోకెళ్ళిచూసే సరికి గీదలన్నీ దేని కట్టుగొయ్యదగ్గర అది నుంచుని ప్రత్యక్షమయ్యాయి.

అప్పుడనుకున్నాడు బుడ్డోడు—

"గొడ్డుని గొడ్డుని బాదినట్టు బాదాల్సిందే గావాల"

• • •

భానుమతి!! చాలా అందగత్తె అని పేరు ఆవూళ్ళోనూ, చుట్టుపక్కల వూళ్ళల్లోనూ. చందనం బొమ్మలాగా తెల్లని తెలుపు. పెద్దజుట్టు. తీర్చిదిద్దినట్టు కనుముక్కుతీరు. సన్నని నడుము చక్కనిఎత్తూ. ఏచీరకట్టినా చీరలకేఅందంవస్తుంది. అంతా అంతా పురాణం శాస్త్రిల్లుగారు హరికథల్లో వర్ణించే అందగత్తెల వర్ణనచేస్తే సరిపోతుంది. హరికథలు వినేప్పుడు శాస్త్రిలుగారి వర్ణనలు వింటూ ఆడాళ్ళంతానవ్వుకుని "ఆవిడ మన బానుమతమ్మ లాగుంటందేమో?" అనుకుంటుంటారు.

ఈ అందగత్తె ఎఱ్రసూర్యం 'కట్టుకున్న మనిషి' సిల్కు చొక్కా, గ్లాస్కోపంచె, సెంటు ఘుమఘుములూ, వుంగరాలూ, వేళ్ళమధ్య సిగిరెట్టూ, నోట్లో కిళ్ళీ ఇదీ సాధారణంగా ఎఱ్ర సూర్యం వేషం . ఈ వేషంతో ఎప్పుడూ గుడివాడ పాటిమీదే తిరుగుతుంటాడు.

"ఎందుకూ ఎప్పుడూ గుడివాడెళ్తావు?" అంటే

"ఇంట్లో ఎంతసేపని కూర్చుంటాం? పూరికే అలా వెళ్లి కాఫీ తాగొస్తా రాజు హొటల్లో" అంటాడు.

అతను కొన్నినిజాలు కూడా చెప్తాడు. కానీ అన్నీచెప్పడు

రాజూ హొటల్‌కి వెళ్లి కాఫీతాగే మాట నిజమే. తర్వాత పక్కనే వున్న కిళ్ళీబడ్డీలో "మాంఛి" కిళ్ళీ వొకటి తీసుకుని రిక్షా ఎక్కి "పోనీయ్‌రా!" అంటాడు.

అక్కడ రిక్షావాళ్ళకి ఇటువంటి వాళ్ళని "ఎక్కడికి"అని గానీ. "ఎంతిస్తారు?" అని గానీ అడిగే అలవాటు లేదు.

అతనూ పోనిస్తాడు. సందులూ, గొందులూ తిప్పి ఓచోట ఆపుతాడు. ఇతను దిగి రిక్షా అతని వంక తిరిగి వొక వెకిలి నవ్వు నవ్వి "ఇక్కడేవుంచు" అని వెళ్ళిపోతాడు.

అట్నించి తిరిగొచ్చి సెంటర్లో దిగి కొంచెంసేపు అటూ,

ఇటూ తిరుగుతూ రోడ్డునపోయే ఆడవాళ్ళని చూస్తూ ఎవర్తో కొంతదూరం వాళ్ళతోపాటు నడుస్తూ, అలా అలా గడిపి, మరో రిక్షా మాట్లాడుకుని వూళ్ళోకి వొస్తాడు.

స్నానంచేసి భార్య తనకోసం వొండి, తినైనా తినకుండా వుంచిన పదార్థాలన్నీ సుష్టుగాతిని, పోయి పడుకుంటాడు.

భానుమతికి మొదట్లో భర్తప్రవర్తన బాధనిపించినా పురాణాల్లోకెళ్ళి సావిత్రీ, అనసూయా, అరుంధతిల కథలూ, వారి పాతివ్రత్యమూ తల్చుకుని, కళ్ళనీళ్ళు కంఠంలోనే మింగి వాటితోనే తృప్తిపడుతూవుండేది.

ఒక సాయంత్రంపేళ సారాజ్జెం కోళ్ళని కమ్మేస్తావుంది. ఎర్రికల కోడి పెద్దచెట్టు బుట్టెక్కి ఎగిరి గొడ్ల సావిడి మీదకి దూకింది. దాన్ని తరుముకుంటా పరిగెత్తిన సారాజ్జెం నాగళ్ళ గదిలోంచి ఒకాడమనిషి రావటం చూసింది. అటెనకే 'దొర' కూడా బయటికొచ్చి "పెద్ద కొమ్ముల్దానికింకా పాలు తియ్య లేదంట్రా? ఇంతసేపేంచేత్తన్నార్రా?" అని పాలేళ్ళమీద కేకలు మొదలెట్టాడు.

సారాజ్జానికి కాళ్లూ చేతులూ వొణికినట్టయ్యింది. ఎర్రికల కోడిని దొరకబుచ్చుకుని దొడ్లోకి తెచ్చి కమ్మేసి "దొరసానికి చెబుదామా, వద్దా, చెబుదామా వద్దా అని గుంజాటన పడింది.

ఆఖరికి వుండబట్టలేక పొయ్యిముందు కూర్చున్న దొరసానమ్మ దగ్గిరకెళ్ళి, "దొరసానే!...ఇందాకుండే...కోళ్ళని కమ్మేత్తాంటే...అదెవతో మన నాగళ్ళ గదిలోంచొచ్చిందండే..." అని చెప్పేసి దొరసానమ్మ ఏంచేస్తుందోనని ఆరాటంగా అటే చూస్తూ నించుంది.

భానుమతమ్మ పొయ్యిలో పుల్లలెగదోస్తా, వొంచిన తలెత్తకుండా "అదెవరే?" అంది.

"ఏఁవోనుండే... ఆ సీకట్లో నాకు తెలవలేదు. తెలిసిన మడిసి కాదుండే?"

"ఆకాశంమీదనుంచీ వూడిపడిందేంటే? నీకు తెలవని మనిషెవతుందేవూళ్ళో? ఎట్టాగుండేది? అంతందగత్తా?"

"ఏవోఁనుండే... సరిగ్గా సూళ్ళేదుండే... సీకట్లో తుమ్మ మొద్దులాగుందండే దొర ఇట్లాంటి పనులు జేత్తాంటే మీరెంఉకూరుకుంటారండే?" అంది సారాజ్జెం కోపంగా.

భానుమతికి అప్పటికే ఏడుపు కంఠందాకా వచ్చేసింది. "వూరుకోకేం చెయ్యమంటావ్. ఖరోసుకోవాలి. ఆ పనీ చేత్తాలే ఎప్పుడో"

"ఛీ! అటాగాదుండే. దొరగార్ని కేకలెయ్యండే"

"పిల్లముండవి. నీకేం తెలుస్తుందిలేవే" అని భానుమతి అక్కడే కూర్చుని వలవలా ఏడ్చేసింది.

సౌరాజ్జానికి మనసంతా కలిచినట్టయింది.

'మహాలక్ష్మమ్మగారైతె మొగుడిమీదెంత కోపం వుంటే అంతా ఎళ్ళగక్కుతుంది. మొకం మీదే టపాటపా తిట్లుతిట్టి పోస్తంది. ఈ దొరసానమ్మకి ఏడవటం తప్ప సేతకాదు. పిచ్చిది" అనుకుంది సౌరాజ్జెం. దొరమీదకోపం మరీ ఎక్కువైంది సౌరాజ్జానికి భానుమతి ఏడుస్తోంటే సౌరాజ్జెం బిక్క మొహం పెట్టి—"యాడవమాకండే! అమ్మగోరో" అంది దొరసానమ్మని ఓదారుస్తూ భానుమతికి సౌరాజ్జాన్ని కావిలించుకోవాలనిపించింది.

"నీకున్న మనసెవరికీ లేదే సౌరాజ్జెం" అని మరింతసేపు ఏడ్చింది.

* * *

నెల తిరక్కుండానే సౌరాజ్జెం భానుమతి గారింటో పని మానుకోవల్సొచ్చింది

ఆ రోజు భానుమతి వున్నదున్నట్టు గుడివాడ బయల్దేరింది వనజాక్షికి నెప్పలొస్తున్నాయని వాళ్ళపిల్లాడొచ్చి భానుమతిని కంగారు పెట్టాడు. బంధువుల్లో ఎవరికేసాయం కావాలన్నా భానుమతిని పిలుస్తారు. వనజాక్షి భానుమతికి పిన్నమ్మ కూతురు కూడాను

భానుమతి చేతిలోపని సౌరాజ్జానికప్పజెప్పి బండి కట్టించుకుని వనజాక్షిని తీసుకుని గుడివాడ అస్పత్రికి వెళ్ళిపోయింది బండెక్కేముందు సౌరాజ్జానికి ఇంటిజాగర్తలు మరీ మరీ చెప్పింది—"ఇయ్యాల్టికి ఇంటికి పోమాకే సౌరాజ్జెం. మీ అమ్మని పిల్చుకొచ్చి ఇక్కడే పడుకో. దొరెప్పుడొత్తాడో తెలవదు. వొస్తే నువ్వెళ్ళొచ్చులే. లేపోతే ఇల్లొదిలి పెట్టమాక.

నా గాడికికూడా సెప్తాతే నేను. పుస్తులూ, గిరులూ, బొచ్చి బోరీ అన్నీ బైటే వుండియ్" అని చెప్పెళ్ళింది.

గొడ్లకి మేతేసి, రాత్రి నాగ్గాడెళ్ళిపోయాక, ఆ లంకంత ఇంటికి మిగిలింది సంకురాత్తిరిగాడూ, సొరాజ్జెమే. పనులన్నీ తేసుకుని ఇద్దరూ బిక్కుబిక్కుమంటూ వీధివేపు దాబా పట్ల మీద కూర్చున్నారు.

"మాఅమ్మని పిల్సుకురారా" అని సొరాజ్జెం సాయంత్రపేళ సంకురాత్తిరిగాడితో అంటే "ఎవరూ వొద్దులేవె. మనం పడుకోలేమేటే" అన్నాడు. ఇద్దరూ అలాగే అనుకుని వూరుకున్నారు. ఆరు దాటేప్పటికే ఇద్దరికీ ప్రహరీ లోపల అంతపెద్దింట్లో అడివిలో వున్నట్టుంది. ఆ యిల్లు కాస్త పెడగా వుంటుంది వూరికి. పైగా చుట్టూ చెట్లు. చీకటి రోజులైతే ఆరూ, ఏడయ్యేప్పటికే అడవిలో వున్నట్టుంటుంది.

"బయవేత్తందే" అన్నాడు బుడ్డోడు.

"ఏడిశావ్. ఏం బయ్యం?" అని దబాయించింది సొరాజ్జెం కానీ, దానికి భయం భయంగానే వుంది.

"రోజూ దొర రాడుగందా? దొరసానొక్కతీ ఇంతింట్లో ఎలాగుంటుందిరా?"

"ఏమో మరి. ఆంజినేలోర్ని తలుసుకుంటుందేమో?"

"అయితే మనవూ తల్చుకుందాంరా?"

ఇద్దరూ కాస్సేపు మాట్లాడుకోకుండా కూర్చున్నారు.

గోడమీదనించి పిల్లి దూకిన చప్పుడైతే, "ఓలమ్మో!" అని సంకురాత్తిరిగాడు ఎర్రికేకేశాడు

"సీ సన్నాసెదవా! వూరుకోరా" అని తిట్టింది సొరాజ్జెం.

"మీ అమ్మని తీసుకొత్తానే"

"నేనీదిగుమ్మంలో కూకుంటా. పరిగెత్తుకెల్లిరా. ఇక్కడున్నట్టొచ్చెయ్యాలి"

"వుప్పుడే వొచ్చేత్తానే" అని పరిగెత్తాడు సంకురాత్తిరిగాడు.

సొరాజ్జెం వీధరుగులమీద కూర్చుంది.

ఒక్కతె వీధిలో కూర్చోవాలంటే అక్కడా భయంవేసింది. అరుగుమీదనించి గడపలోకి ఒక్కదూకు దూకి వీధితలుపులు మూసేసి గజగజ వొణుకుతూ నించుంది. రోజూ మసిలేటల్లే

దొరసానమ్మ లేకపోయేసరికి ఇల్లంతా బావురుమంటాంది.

ఆలోచిస్తూ కూర్చున్న సౌరాజ్జానికి వీధి తలుపులమీద చప్పుడవ్వగానే ఎగిరి గంతేసి తలుపుతీసింది— "వొచ్చేశా రంట్రా?" అనే కేకతో.

తలుపు తియ్యగానే దొర కనపడ్డాడు.

తలుపులు తియ్యగానే 'మాలది' కనపడింది.

సౌరాజ్జానికి భయమంతా తీసేసినట్టుపోయింది. "హమ్మ. దొరొచ్చాడు బియ్యంలేదు అనుకుంది.

సూర్యానికేదో "శుభ"సూచకం కనపడింది, ఇంట్లో అడు గెట్టగానే.

"నువ్వెళ్ళలేదేవే ఇంకా ?" అన్నాడు.

"లేద్దొరా. దొరసానమ్మ గుడివాడెళ్ళింది బండి కట్టిచ్చు కుని. వనజాక్షమ్మగోరికి బాగా నొప్పులొస్తన్నాయంట. ఆస్ప టాలకి తీసికెల్లింది"

"నువ్వొక్కదానివే వున్నావా ?"

"అవునండే. మా అమ్మని తీసుకొత్తానని సంకురాత్తిరిగా డెల్లాడుండే వుప్పుడే"

"వత్తుందా?"

"ఎందుకురాదుండే? రొండు కోళ్ళున్నయ్ గదుండే. ఆటిని కమ్మేసి, కూడుంటే తినేసి వత్తుందుండే. మీరు రారేమో ఈ రేత్రికి ముగ్గురం ఇక్కడే పడుకుందారనుకున్నావుండే"

"నేనొత్తేయేవే. పడుకోండి"

"ఎందుకులెగండే. తవరొచ్చేశారుగదా! నేనెల్తానుండే"

"ఎళ్ళొచ్చుగానీ..." అంటూ చొక్కావిప్పి, "ఇదిలోపలె ట్టిరా" అని చొక్కా అందించాడు. సౌరాజ్జెం చొక్కాపట్టుకుని పడగ్గదిలోకెళ్ళింది.

ఎఱ్ఱసూర్యం వీధితలుపులేసేసి గదిలోకెళ్ళాడు.

సౌరాజ్జెం బైటికొస్తావుంటే, "కాసిన్ని మంచినీళ్ళు తీసుకు రావే" అన్నాడు.

సూర్యం ఇంటికొస్తూ బాడవపొలాని కెళ్ళాడు. చంద్రి తాటి గూబలేరుకుంటూ కనపడింది. చిమ్మ చీకటిపడింది అప్పటికే. సూర్యానికి ధైర్యంవచ్చి దగ్గిరికెళ్ళి "ఏంజేత్తన్నావే?" అన్నాడు.

ఈ దొర ఎవ్వారం అందరికీ తెలిసిందే.

చంద్రి కొంచెం పెద్దదిగనక జంకక్కుండా, "కనపడతం లేదేంటండే?" అంది.

"ఎహ్హె హ్హె హ్హె" అని వెకిలినవ్వు నవ్వి చెయ్యట్టుకో బోయాడు.

చంద్రి చెయ్యి విదిలించేసి– "ఇదేంపనుండే, ఎల్లండి సాలుగాన" అని ఛీత్కరించేసింది.

"ఏంటేయ్? అంతబడాయ్ చేత్తన్నావ్? ఒకూళ్ళోవాళ్ళం. అమాత్రం మంచీచెడ్డా లేదేంటే? పదిరూపాయలిత్తీసుకో. నేనివ్వనన్నానా?"

"మర్యాదగా ఎల్లండిక్కణ్ణించి పది రూపాయలిత్తారంట పది రూపాయలు! ఆ డబ్బేదో మీ ఆడోళ్ని సంపాయించుకోమనండి" అనేసింది చంద్రి.

"నీయమ్మ!" అని పెద్ద బూతుతిట్టుతో మీదకురకబోయాడు.

చంద్రి తటాలున గంపలోంచి కొడవలి తీసింది. వెనక్కి జంకాడు.

"మీరన్నమాటే మీకప్పజెపితే అంత పవురుశంవొచ్చింది మీకు. మేవట్టా కాదనుకున్నారేంటి?" అని చంద్రి కొడవలి రయ్యిన వూపి చరచరా నడిచి వెళ్ళిపోయింది.

పెద్ద నిరుత్సాహంతో ఇంటికొచ్చేసరికి ఇంటి దగ్గిర మళ్ళీ వుత్సాహం వొచ్చింది.

"మంచీళ్ళు తీసుకోండే" అని సొరాజ్జెం స్టీలు గ్లాసుతో మంచీళ్ళందివ్వ బోయింది.

ఎఱ్ఱసూర్యం సొరాజ్జెం చెయ్యట్టకొని గ్లాసు కిందబెట్టి వెకిలినవ్వు నవ్వుతూ "ఇట్రావే" అని సొరాజ్జాన్ని మంచం మీదకి లాగాడు.

అప్పుడు గ్రహించింది సొరాజ్జెం దొరవూహ.

"ఇదేంటండే... వుండండే... మంచోరేనుండే" అని సొరాజ్జెం పెనుగులాడి వొదలించుకుంది.

"పది రూపాయలిస్తానే. మీ దొరసానికి చెప్పన్లే"

"ఛీ లెగండే!" సొరాజ్జెం కోపంగా పరిగెత్తబోయింది.

మళ్ళీ చెయ్యెడిసి పట్టుకున్నాడు.

"కరిచేత్తానుండే... ఏంటనుకున్నారో..." అని కళ్ళల్లో నిప్పులు కురిపించింది సౌరాజ్జెం

సూర్యానికి పాపభీతి లేదు.

పశుబలం, కులబలం, ధనబలం వాణ్ణి ప్రోత్సహిస్తున్నాయి.

సౌరాజ్జెం దిక్కులేని తనం, చిన్నతనం, కులం తక్కువ తనం—వాణ్ణి మరింతగా ప్రోత్సహిస్తున్నాయి

"తప్పలేదే... కుశాలా దబ్బిత్తారా!"

"మీ అబ్బెవడికి ఎక్కువాలండే, పోవలండే" అని సౌరాజ్జెం గిజుక్కుని చాపడివేపు పరిగెత్తింది.

"సౌరాజ్జెం! తలుపుతియ్యి!" అని సంకురాత్తిరిగాడి కేకతో సూర్యం చచ్చిన పీనుగయ్యాడు.

సౌరాజ్జాన్ని వదిలిపెట్టి గదిలోకిపోయి తలుపేసుకున్నాడు.

సౌరాజ్జెం వీధి చాపడి తలుపు తీసేసి బయటపడింది.

ఆ మర్నాడు సాయంత్రం భానుమతమ్మకి అసలు సంగతి సంకురాత్తిరిగాడు చెప్పాడు.

సౌరాజ్జెం మళ్ళీ ఆ గడప తొక్కలేదు.

• • •

ఎర్రసూర్యం తన కూతురిమీద తలపెట్టిన దుర్మార్గం తెలుసుకున్న పద్దాలు ఎవ్వరికి చెప్పుకోలేక కుమిలిపోయింది.

ఎదిగున్న కూతుర్ని పనికి పంపడం తనదే తప్పని అలా పంపాల్సిరావడం తన కర్మని నమ్మి ఆ విషయాన్ని ఎవటికీ చెప్పవద్దని సౌరాజ్జానికీ,సంకురాత్తిరిగాడికీ చెప్పి, సౌరాజ్జాన్ని తనవెంట అప్పుడప్పుడూ దొరికే కూలిపనులకి తీసికెళ్ళడం మొదలుపెట్టింది.

సౌరాజ్జెం కూలిపనుల్లోకి పోతోంది ఆర్నెల్లనించీ.

పద్దాలూ, సౌరాజ్జెం, బోడి, కోటీ, రత్తీ మరోనలభైమంది ఆడకూలీలు!పెద్దరామయ్యగారి ముప్పయ్ఎకరాలూ నాట్లెయ్యడానికి చేలో దగబోతూ చీరలు గోచీలుపెట్టి ఒక్కొక్కళ్ళూ చేలో దిగి చేనంతా తిరుగుతున్నారు

—ఎంత ఎగదోసినా చదువురాని– పెద్దరామయ్యగారి

మూడో అబ్బాయి శివప్రసాద్ అందర్నీ అదిలిస్తున్నాడు.

"దిగండే! ఓసి మీయమ్మ. రావటవే ఎస్టేటులు చూట్టా నికొచ్చే రాణుల్లాగా పొద్దు బారెడెక్కేంతర్వాతొస్తారు. వొచ్చిం తరా. తగట్లంట గజ్జెలగుర్రాల్లాగా కదంతొక్కుతారు. మీకిచ్చే కూలిలో సగం దండగేనే లంజిల్లారా! దిగండి దిగండి'

"ఏవుయ్యో! చిన్నదొరవుగందా అని వూరుకుంటావుంటే అడ్డవైనకూతలూ కూత్తన్నవే. కాత్త నోరు కట్టు"

"యేంటే, నీయమ్మ. నోరుమూసుకోమంటన్నావేంటే?"

"ఎందుకుండె, అట్టా మోటునూ టలంటావు"

'మోటుమాటలేంటె? మీరాలీసింగా వొత్తే తప్పులేదేంటి?"

"ఆలిస్సెం ఎక్కడుండే? రోజూ వొచ్చేయేళకొచ్చాం"

"ఆ గడియారం సూత్తం మాకు రాదులెగుండే. పొద్దు సూత్తె తెలవదేంటుండే"

"ఇకసాలుగాని, పని మొదలు పెట్టండే, మీ అమ్మ!"

నాగ అందుకుంది "ఏవండో! సిన్నబ్బాయిగోరో! ఎందుకండే నోరట్టా పాడుచేసుకుంటారో? పన్జేంచుకునే యిదంగా సెంచుకోండి కూలి తీసుకుని పని సెయ్యటానికి వొచ్చాంగాని, యిట్టా బండబూతులు తింటానిగ్గాదంతే!"

ఆడకూలీలకి "చిన్నదొర"కి వాగ్వివాదం జరుగుతోండగా దూరంగా తాటిచెట్ల కింద నుంచి గట్లమ్మట బడి గునుకేసుకుంటూ వొచ్చే "పెద్దదొర" కనబడ్డాడు.

"సర్లే సదవండి, సదవండి బూనాన్నొస్తన్నాడు.దిగండి తొందరగా. ఎంకటేసిగా, పడెయ్యరా కట్టలూ" అని కంగారు పడిపోయాడు చిందొర.

కూలీల్లో కొంచెం కొంచెం రగులుకుంటున్న కోపాలన్నీ పెద్దరామయ్యని చూడగానే చల్లారిపోయినియ్. ఆ పెద్దొర వొచ్చాడంటే యింకా మొదలెపెట్టలేదని కేకలు గోల.

'వెంకటేసిగాడు' వరి అకు కట్టలు కూలీలందరికీ అందేట్టుగా సుతారంగా విసుర్తున్నాడు.

మొత్తానికి పెద్దరామయ్య గట్టుమీద కొచ్చేసరికి అంతా తీవ్రంగా పనిలో లీనమైపోయారు.

ఆయనొచ్చి "ఏంటిరా, ఇడ, పెసాదో, ఈపాటి కొక ఎక

రవఁన్నా అయ్యుంటుందనుకుంటా వత్తే వుప్పడే సేలో దిగి నట్టుందే" అని కేకలేశాడు.

"ఎక్కడవుతుందే ఇప్పుడేవచ్చారు, అంతా తినీ తేపి"

"ఎందుకుండే అట్టా అబద్దాలాడతారో? వొచ్చిన వాళ్ళని వచ్చినట్టు పనిలో దిగకుండా పోట్టాటేసుకున్నారు గాదుండే?"

"ఏం పోట్టాటే" అన్నాడు పెద్దరామయ్య.

"ఏం వుంటుందండే. పేరు పేరునా అడ్డమైన కూతలూ కూశాడుండే.

"ఏరా! నీయమ్మ కడుపుగాలా! వొచ్చినాళ్ళతో పని చేయించుకోవటం యిట్టాగేనా!"

"నేనేమనలేదు నాన్నా!"

"వురే నోరెత్తమాక. ఎళ్ళి అకుమడికాడ తగలడు. ఆళ్ళని తొందరగా అకు పీకి అందిచ్చమను ఎళ్ళెళ్ళు."

కొడుకుని ఎప్పుడూ ఆడకూలీల దగ్గర వుండకుండా చెయ్యాలని సూస్తావుంటాడు పెద్దరామయ్య.

"వూఁ!వూఁ! కానివ్వండి, కానివ్వండి...వుసే పద్దాలూ!ఏవ క్కడైవతే? సరిగ్గా వూడవటవేఁరాదూ దానికి? అట్టాగేనా నాటే సేది పెద్దరామయ్యగారి పొలంలోదిగిందని తెలుసాదానికి?... దగ్గిర దగ్గిర ఎయ్యిండి! జోడుకర్రెయ్యమను జోడుకర్ర. ఎయ్యండెయ్యండి...ఎవరే అది? నాగమ్మకూతురా? ఇంత పెద్దదయిందా అదీ?..."

"కాదుండే. నాకూతురే" అంది పద్దాలు.

"నీ కూతురా? ఓసి, నీకడుపుడకా! పెద్దదయిందే ఎప్పుడో బెమ్మంగారు జెండా ఎగరేసినప్పుడు చూశా. రాజలక్ష్మా,ఏంటి పేరూ? ఆయనే పెట్టాడు గదూ?" అంటూనే ఎత్తులు నీళ్ళల్లో కొడుతున్నాడు.

"సొరాజ్యముండే"

"ఏదోఒక రాజ్జంలే!...జోడెయ్యండి, జోడెయ్యండి. ఒసే నాగీ. ఏంటా పెళ్ళినడకా? కలుపు, కలుపు...రండి, రండి! పొద్దెక్కుతాంది. ఈవజానయితే రేత్రి ఏ జామవుతుందో యిద వ్వాలంటే"

"ఏదుండే?"

"ఆ పెద్ద గట్టుదాకా యివ్వాళ్ళ పూర్తిసెయ్యాండే"

"ఆ పెద్దగట్టు దాకానా? ఎన్నెకరాలుండే"

"ఎన్నున్నయ్యే. ఎనిమిది"

"యేమెనిమిదుండే. పదకొండు పన్నెండెకరాలుంటయ్యి"

"పన్నెండేంటే, నాకున్న నలభైఎకరాలూ యియ్యే"

"లేపోతే ఏంటుండే? పెట్టింది నలభైమందిని... ఎకరానికేడుగుర్నేసుకున్నా అరెకరాల కన్నా అరెకరంకూడా అవ్వదుండే. నువ్వేమో, పెద్దగట్టుదాకా అంటన్నావ్. ఎంత తక్కువేసుకున్నా పదెకరాలకి సెంటుకూడా తక్కువ వుండదు గదుండే" అని నలుగురూ నాలుగు పక్కలా వాదించారు.

సౌరాజ్జానికి నవ్వొచ్చింది, పెద్దొరని చూస్తొంటే.

'తక్కువ కూలిచ్చి ఎక్కువ పనిచేయించు కుందారని బలేఆశమ్మో ఈ దొరలకి' అనుకుంది సౌరాజ్జెం కొత్త విషయం గ్రహించినట్టు.

* * *

ఒకనాడు సందేళ సౌరాజ్జెం పేడ ఏరుకుంటూ సాయిత్రక్కని 'పెసాదుగారి' గడ్డివామి పక్కనించి దొంగలాగ రావటంచూసి తెల్లబోయి దూరంగానిలబడింది. కాస్సేపటికిపెసాదు గోరుకూడా సిగరెట్టు కాల్చుకుంటూ అటేపు పొలం గట్టుమీదనుంచీ వెళ్ళిపోయాడు.

'సాయిత్రక్క' బిక్కుబిక్కులాడతా తొందర తొందర నడకతో సౌరాజ్జాన్ని చూడనట్టు దాటెల్లబోయింది.

"అక్కణ్ణించొత్తన్నావేంటే సాయిత్రక్కా?"

"ఎక్కణ్ణించే?"

"ఛీ! ఎందుకే ఎదవబతుకు... నలుగురు పిల్లల తల్లివి సిగ్గులేదంటే?"

సాయిత్రక్క బూకరించలేదు. మొకం వేళ్ళాడేసింది.

"ఇంకేంజెయ్యమన్నావే?"

"సావు కాలవలోబడి"

"నా పిల్లల్ని నువ్వు సూడ్తైతే...నత్తాలే...నాకేవఁన్నా సంబడం అనుకున్నావేంటి?" అంటూ పలికిలో బెండకాయలు చూపించి- "ఇదుగో, ఇయ్యిచ్చాడు. రూపాయిడబ్బులిచ్చాడు.

పిల్లల పొట్టలెట్టా నింపుతాయనుకున్నావేంటి పూట పూటా? నీ తాగుబోతుబావయ్యే కష్టపడి పోషిత్తాడనుకున్నావేంటి? నీలాగా బాదరబందీ లేకపోతే నేనూ సెప్తతాను కవుర్లు"

"అయితే మాత్తరం"

"ఇంకేం దారుందో సెప్పు. శక్తీ ఎల్లలం అందరం పడాలి కాలవలో అ మదనపోయన వారం రోజుల్నుంచీ మాటేసి మాటేసి ఇంకుండా లాక్కుపోయాడే. మాలముండ కనపడితే నిలవనిత్తారేంటి పెద్దోళ్ళు?...సిన్నదానివి నువ్వు జాగర్తగుండు నాబతుక్కేవుం గాని. నేనెట్టాగూ సెడ్డముండనే" అని కంఠం బొంగురుపోయి ఏడ్చింది.

తర్వాత్తరవాత పొరాజెగం పొలల్లో, బోదెల్లో, వాముల్లో కుప్పల్లో, పంట కళ్ళాల్లో సీతల్ని, దమయంతుల్ని, అహల్యల్ని ఎంతమందినో అట్లా చూసింది.

అందరూ సిగ్గుతో చితికిపోతూ కనపడతారు.

చంకలకింద బుట్టల్లో కాసిని వొడ్లో, కాయకూరలో, చేమ దుంపలో, వరికంకులో, పెసలో, మినుములో ఏదో ఒకటి దొరికాయని సంబరంగా తీసుకుపోతారు.

డబ్బున్న మర్యాదస్తుల సంగతులన్నీ వాళ్ళ గంపల్లో చూస్తే బయటపడతాయి.

* * *

మాల పల్లంతా వొక్కసారి గుప్పుమంది. 'బెమ్మంగారు' 'టాక్టర్' తెచ్చాడంట. అదే దుక్కి దున్నుద్దంట కుప్పలు నూర్సేత్తుందంట. పొలాన్నుంచీ వడ్లూ గడ్డీ, గడ్డీ గాదం అదే తెచ్చేత్తుందంట. అసలు సోద్దెంతెలుసా, దానికి ఎడ్లని కట్టక్కర్లేదంట

'బెమ్మంగోరు' ఇంజినిం పంపుకూడా తెచ్చారంట. దాన్తో నీళ్ళుకూడా తోడుకోవచ్చు. మిగతా దొరలందరికీకూడా గంట కింతని తీసుకుని నీళ్ళు తోడిచ్చేత్తాడట! ఈ వార్తలతో మాల మాదిగపల్లెలు అట్టుడికి పోయినట్టుడికిపోయినయ్యంటే వొట్టు.

ఒకవైపున వూడ్పులు దగ్గిరకొస్తున్నాయ్. నీళ్ళు తోడటాలూ దుక్కులు దున్నటాలూ, తరాలెయ్యటాలూ, పనులన్నీ పోయి నట్టు బెంబేలెత్తిపోయారు కూలీలంతా.

నాలుగేళ్ళ క్రితం కూలీ పెంచాలని పట్టుబట్టి అ గొరం జరిగక ఎక్కడివాళ్ళక్కడ చతికిలబడి కూచున్నారు

ఈ సంవత్సరమన్నా కూలి కొత్త పెంచమని అడగాలనుకుంటాంటే యింతలో ఈ దుమారం

కూలీనాలీ, పిల్లాజెల్లా అందరూ బెమ్మంగారి టాకటర్ని, చుట్టూజేరి, చూసొచ్చారు. దాన్ని చూశాక బెదురు తగ్గింది. వూళ్లో పన్లన్నీ అది చెయ్యలేదనీ, ఎప్పట్లాగే కులీలు కావాలనీ, మళ్ళీ కొత్తవార్తలు బైల్దేరినయ్.

"ఈసారేవన్నాసరే, కూలీ పెంచమని అడగాల్రా" అని శామేల్ పదిమందిలో పెట్టాడు.

"ఓరిసొల్లేరా పెశావం. పెంచమంటారంటు పెంచమంటం. అనాడు పెంచమన్నందుకేగామూ మనాళ్ళకాగతి పట్టింది. జల్మలో అడగొద్దు. అరికి బుద్దిపుడుద్దా. అరే పెంచుతారు. లేదూ, మన కర్మనుకుని చేద్దారి. పెంచమనావొద్దూ, తగ్గించమనావొద్దు" అన్నాడో బెదిరినమనిషి.

"ఓరూరుకోరా, బుద్దిలేనోడా! సత్తాం, సత్తాం అని కూడు లేకుండా సేసుకుంటావేంటిరా ? తాతలనాడిచ్చిన కూలే ఇవ్వాశిత్తావంటే ఎవడ్రా సేత్తాడు ? సలే సత్తాంగానీ, ఎన్నాళ్ళు నోరు మూసుకునుంటాం ?" అని ఛీత్కరించాడు శామేలు.

తర్జనభర్జనలు జరిగి చిట్టచివరికి బెమ్మంగార్ని పట్టుకుందామని తేల్చారు

"బెమ్మంగోరు కాత్తి మంచిమణిసే. నాలుగైదేళ్ళ కోపాలన్నా మాలపల్లెట్టుందొ అజ కనుక్కుంటాడు. ఆయన్నడుగుదారి. ఆయనే పెంచుతాడు"

అడామగా అంతా అవునంటే అవుననుకున్నారు.

బెమ్మంగారింటి కెళ్ళారు

అఇల్లు ఇదివరకటిల్లుకాదు అడిపడగొట్టేసి రెండంతస్తుల మేడొకటి లేపాడు.

సొరాజ్జెంపుట్టాక బెమ్మంగారు 'కాంగిరేచు'లో జేరినందుకు చులాగ్గా పైకి పొయాడు ఇప్పుడు అ వూళ్ళోవున్న బూముల్లో మూడొవంతు అయనవె.

కూలాళ్ళంతా అనుకున్నట్టు అయన ప్రతీ నాలగైదేళ్ళకీ

మోలపల్లలో కడుగెట్టి ముక్కుమూసుకుని, ముక్కున పట్టిన మూడుముక్కలూ అక్కడ చీది—

వాళ్ళందరూ 'కాంగిరేసు' కే ఓటెందుకెయ్యాలో,

గాంధీగారు ఏం చెప్పారో,

ధర్మరాజు ఏ రకమైన మోసంవల్ల ఓడిపోయినా ధర్మం ఎలా గెల్చి ఎలా రాజయ్యాడో,

హరిశ్చంద్రుడి సత్యవ్రతం,

శ్రీకృష్ణపరమాత్ములవారి గీతాబోధ.

సీతమ్మవారి కష్టాలూ,

...అన్నీ చెప్పి, అందువల్ల కాంగిరేచుకే మీరు ఓటెయ్యండని చెపుతూ వచ్చాడు.

కూలి వాళ్ళంతా బెమ్మంగారికి తెలియని విషయం లేదని ఏకాభిప్రాయానికెప్పుడో వచ్చినా ప్రతి నాలుగైదేళ్ళకి వాళ్లని కల్సి, ఆ అభిప్రాయాన్ని వాళ్ళతో తిరగరాయించుకుంటూంటాడు బెమ్మంగారు.

ఇప్పుడంతాకల్సి బ్రహ్మంగారి మేడ ముందాగేసరికి బ్రహ్మం బైటికొచ్చి—

"ఏంట్రా? అంతా వొక్కసారి బైలెల్లారు?" అని కుశలప్రశ్న లేశాడు.

"ఏమే పద్దాలూ? నీ కూతురెట్టా వుందే?" అన్నాడు గుంపులో వున్న పద్దాల్నిచూసి.

తన కూతుర్ని గుర్తుంచుకుని బెమ్మంగారడగ్గానే మూర్ఛ వొచ్చినంత పనయ్యింది పద్దాలుకి.

"ఇదేనండే. తవరే సూడండే" అంది పొంగిపోతూ పద్దాలు.

మూర్ఛవచ్చినంతపనయ్యింది బ్రహ్మంగారికి సొరాజ్జాన్ని చూడగానే.

"ఓసినీ ఇదేనా? మన సొరాజ్జాన్ని నేను గుర్తుపట్టలేక పోయానేవేఁ? ఎంతెదిగిపోయిందీ?...అఁ......గుర్రంలాగా ఎదిగిందే!"

"ఏం ఎదిగిందిలెండే వూనకాళ్ళూ,వూనసేతులూ అదీనీ. కడుపునిండా తిండిలేదుండే మీ సొరాజ్జానికి" అంది పద్దాలు బెమ్మంగారికి మనసు కరిగించాలని.

"తిండిలేక ఏమైందే? మీకేమే? కష్టపడి పని చేసుకుంటారు. కడుపునిండా తిని కంటినిండా నిద్రపోతారు. రాళ్ళు తిని అరాయించుకుంటారు...సొరాజ్జెం ఇట్టారావే! ఇట్టారా!" అని బెమ్మం పిలుస్తాంటే సొరాజ్జెం కొంచెం బెదురుతో సిగ్గు పడింది.

"ఎళ్ళవే" అని నలుగురైదుగురు సొరాజ్జాన్ని కసిరారు.

సొరాజ్జెం నాలుగడుగులు దగ్గిరికెళ్ళి నుంచుంది. గళ్ళ పరికిణీమీద మందారం రంగు పైటపంచె, సింతపూల రవికె, గట్టిగా బిగించి అల్లుకున్న జెడా– చారెడేసి కళ్ళూ, నడుం దగ్గిర సన్నగా వొంపుతేలినవీపూ... బెమ్మం కళ్ళబడి వుత్సాహంకలిగి, "ఎంతదాని వయ్యావే సొరాజ్జెం!" అంటూ ఆ పిల్లవీపుమీద చెయ్యేసి, వీపంతా నిమిరి భుజమంతా నిమిరి వుత్సాహం తీరక మళ్ళీ వీపుమీద చెయ్యి పోనిస్తాంటే సొరాజ్జెం సిగ్గుపడిపోయిందానిలాగా దూరంగా జరిగిపోయింది. మోసానికలవాటుపడని సొరాజ్జెం శరీరం బెమ్మం నిమురుళ్ళకెదురు తిరిగింది.

నాత్రో జులనాడు పచ్చిగడ్డిమోపులోంచి కాళ్ళజెర్రి వీపు మీద పాకినప్పటికన్నా రోతేసింది సొరాజ్జానికి లోపల్లోపల.

సొరాజ్జెంతో పలకరింపులయ్యాక అసలుసంగతి కదిలింది కూలి పెంచాలన్నారు కూలిజనం.

"ఓస్! అంతేగదా? అలాగేలెండ్రా" అన్నాడు బెమ్మం గారు.

తెల్లబోయారంతా. యింత సులబంగా పనైపోయిందేంటా అని.

ఇంత పెంచాలని వీళ్ళూ అడగలేదు.

ఇంత పెంచుతానని అతడూ చెప్పలేదు.

"సర్లె అ సంగతి నే సూత్తాలెండి" అన్నాడు బెమ్మం.

కూలీజనం కేరింతలు కొట్టుకుంటూ తిరుగుముఖంపట్టారు

"అప్పుడప్పుడూ కనబడతావుండవే సొరాజ్జెం" అని సొరాజ్జాన్ని కళ్ళనిండా చూసి వొదల్లేక, వొదల్లేక వొదిలాడు బెమ్మం.

వారం రోజులుగడవకుండానే బ్రహ్మంగారిట్రాక్టర్ నైజాం

ఉంచ కూలిల్నితెచ్చి వూళ్ళో దించిందని పిడుగులాంటివార్త!

వూళ్లో కూలిజనం స్తంభించి పోయారు.

మళ్ళీ వెళ్ళి మరోసారికూడా తెచ్చి దించుతుందట!

బ్రహ్మంగారి చావిట్లోనూ, రాజేంద్రప్రసాదుగారి చావిట్లోనూ నైజాం కూలీలు అప్పుడే ఎండు చేపల్ని ఆదరా బాదరాగా కాల్చేస్తున్నారు

వూరంతా ఎండుచేపల వాసన వ్యాపించింది.

పెద్దపెద్ద తలగుడ్డలు చుట్టుకొని వొంటిమీద సరైన బట్టల్లేకుండానే నైజాం కూలీలు బజార్లలో అమాయకంగా తిరుగుతూ కనపడ్డారు

వూళ్ళో కూలివాళ్ళంతా మళ్ళీ బ్రహ్మంగారింటి కెళ్ళారు కోపతాపాలతో.

"వూళ్ళో కూలీల్ని పస్తాడుకోబెట్టి నైజాం కూలీల కన్నం బెడతారంటండే?" అని ఒక్కొక్కరూ ఒక్కో పద్ధతిలో అడిగారు. కోపంగానో, కొంచెం కోపంగానో, మరి కొంచెం కోపంగానో!

బ్రహ్మం అన్నాడు, తాపీగా, అరేయ్! గొడవ సెయ్యమాకండి. మీరు కూలీ సాలదన్నారు. పెంచకపోతే తప్పదన్నారు. పెంచకపోతే పని సెయ్యరన్నమాటేకదా? పెంచేశక్తి దొరలకి లేదురా పెంచేటట్టయితేనే, మిమ్మల్నిపన్లోకి రమ్మనాలి. లేకపోతే, మాదారి మేము చూసుకోవాలి అవునా?కాదా? అనవసరంగా తగూలెందుకు మనకి?...నేనేమీ పురుషోత్తంరావుని కాదు—మీలో ఒకర్నో ఇద్దర్నో చంపి అదే కూలీకి మిగతా వాళ్ళని పిల్చి మీలో మీకు తగూలు పెట్టడానికి...కాంపవుందే-అదంటే నాకు పరమ అసహ్యం మనిషిని మనిషి పీడించుకోకూడదు...నేను మిమ్మల్నెవర్నీ కొట్టాలా తిట్టాలా!... మీ చేతులు నేనేమీ కట్టెయ్యాలా! మీకాళ్ళకి బందాలెయ్యాలా! మీ కడుపులు మీరు పట్టుకుని, ఎక్కువ కూలెక్కడ దొరికితే అక్కడికి ఎళ్ళండి ఎవరు కాదంటారు? పాపం మీ బతుకు దెరువు మీరు చూసుకోవలసిందేకదా?...మీరు మాత్రం ఏం చేస్తారు? నేను మాత్రం ఏంచేస్తాను-

పేదవాడి కోపం పెదవికి చేటని కూలిజనం వుడికిపోతూ వెనక్కి తిరిగారు— అంతకన్నా ఏంచెయ్యాలో తెలవక.

◆ ◆ ◆

మాలపల్లిలో సగం జనానికి పనుల్లేవు. నైజాం కూలీలు మూడు విడతలొచ్చారు. వాళ్ళతో పూటకూలీలకి చిన్నచిన్న ఘర్షణలుకూడా జరిగాయి బజార్లలో.

పూళ్ళో కూలిపని దొరుకుతుందనేమాట మరిచిపోవల సొచ్చింది. దొరికినవాళ్ళు ఎంత కూలీ ఇస్తే అంతతో సరి పెట్టుకున్నారు.

పూళ్ళో కూలీల రోగాలణిగాయ్- అని ముసిముసినవ్వులు నవ్వుకున్నారు దొరలు. రోగాలేంఖర్మ. వాళ్ళ బతుకులే అణి గాయి. ఆకళ్ళతో, ముసలీముతకా తెగుళ్ళతో, చచ్చినపిల్లల్తో కూలిన కొంపల్తో కూలిపల్లికి కూలిపల్లే అణగారింది. ఎప్పుడూ ఒక మాట మీదుండే కూలీలు జానెడు పట్టుపిలల్తో ఎక్కడ కక్కడ చెల్లాచెదురయ్యారు.

బొత్తిగా దారీతెన్నూలేని ఇరవై ముప్పై కొంపల్లో పద్దాలు కొంపనికూడా లెక్కేసుకోవాలి. సొరాజ్జెం బోదెలెంటా, గుంట లెంటా తిరిగి నత్తల్నీ, పీతల్నీ పట్టుకొచ్చినా, కలేదుంపలు తవ్వుకొచ్చినా పూటగడవడం గగనంగా తయారయ్యింది.

రామీ, నాగీ, గూడూరు వెళ్ళిపోయారు, అక్కడ 'అభ్రకం' గనుల్లో కూలి దొరుకుతోందని.

కొందరు మగాళ్ళు గుడివాడ, బెజవాడా వెళ్తున్నారు, రిక్షాలు తొక్కి బతుకుదామని.

నెల్లూరువైపు మరీ ఇంత 'పచ్చిపాతకం' లేదంట--అంది సావిత్రి, ఒకనాడు పద్దాలుతో.

"నాకు చావన్నా రాదు. నేను నస్తే పిల్ల ఎట్టాగొట్టా బతుకుద్ది" అంది పద్దాలు ఏడుస్తూ.

"నాల్లే పూరుకో. నువ్వు సావగానే, తూరుపుసెర్లోపడి, నేనూ నత్తా" నంది సొరాజ్జెం.

"ఊరుకోండే! సచ్చేం సాదిత్తాం పేణాలున్నంతవరకూ బతకక్క తప్పుతుందా?" అని కేకలేసింది సావిత్రి.

"ఇంకేం బతుకే, ఎత్తుబారం బతుకు. గుడిశొదిలి బైట కడుగేసే ఒపికలేదు. ఎక్కడికెళ్ళాలన్నా..." అంటూ పద్దాలు బావురుమంది.

సావిత్రి కాస్సేపు మాట్లాడి వెళ్ళి దిగాలి, మధ్యానపేళ,

"వుసే పద్దక్కా! పద్దక్కా" అంటూ గావుకేకలేసుకుంటూ వొచ్చింది—"నెల్లూరాయనొచ్చాడే నలబై,యాబైమందిపనాళ్లు కావాలంట. మనం ఎల్దారి పదండే. లచ్చికీ, ఎంకికీ సెప్పేసొత్తాను" అని నోట్లో మాట నోట్లో వుండగానే పరిగెత్తింది.

"మూటలట్టుకోండే" అని దూరంగా ఒక కేకపెట్టి మాయమైంది.

"ఏం కట్టాలే మూటలూ?" అని కాళ్ళూ చేతులూ ఆడక కూలబడిపోయింది పద్దాలు. సొరాజ్జెవే చొరవచేసి ఒక పాత చీరలో నాలుగు గుడ్డలూ, ఒక పాత గంపలో కాసిన్ని కుండలూ సర్దింది.

కోడీ,కుక్కా ఎప్పుడోఅఖరయ్యాయి. ఆరెండు మూటలూ కట్టేటప్పటికి గుడిసెలో మిగిలిందేవీలేదు. పాతబొక్క నులక మంచం, రెండు ఓటి కుండలూ ఒక మూలకిసర్ది చాప గుడ్డ కప్పి గుమ్మం తడిక్కి తాడు బిగించేశారు.

ఇద్దరూ చెరోమూటా ఎత్తుకున్నారు.

లచ్చీ, ఎంకీ చిన్నచిన్న మూటల్తో అటే వొచ్చారు.

సావిత్రి యిలా కనపడి అలామాయమైతే "ఒలే,సాయిత్రీ సాయిత్రీ"అని కేకలెట్టారు. పద్దాలు గుడిసె ముందు నిలబడి.

ఆ మురికి సందులు కూలీల కేకల్తో సందడితో కల కల్లాడాయి.

అందరి నెత్తిమీదా ఒక్కో గోనె సంచి, లేకపోతే కొంచెం పెద్ద తట్టా. కాళ్ళకాడ ఇద్దరో ముగ్గురో పిల్లలు.

వూరెల్తున్నాం అనే సంబరం పిల్లలకి.

తడపల్లాగ వేళ్ళాడిపోతన్నారు చిన్నాపెద్దా. వాళ్ళు ఎంతదూరం నడవాలో, ఎక్కడికి చేరాలో ఎవరికీ తెలీదు. ఎవడో ఒక "పెద్దమడిసి" రాగానే ఆ మడిసెంటబడ్డారు, కూలి నాలీ ఎంతిస్తారో బేరంలేదు, వల్లకాదులేదు.

"పదండెహె" అని ఒకళ్ళనొకళ్లు కసురుకుంటున్నారు.

ఒక్కళ్ళకీ కాలు సాగదు.

గుడిసెల్లోకి మళ్ళీ దూరతారు.

అక్కడేదో మడులో, మాణిక్యాలో వుండిపోయినట్టు మళ్ళీ ఆ ఓటికుండలుచూసుకుని బైటికొచ్చి తడికలుబిగిస్తారు.

పద్దాలు రెండుసార్లు గుడిసెలోకి దూరి బైటికొచ్చింది.

గంటసేపటికి కదిలింది కూలీ గుంపు కాళ్ళీడ్చుకుంటూ.

ఆ మురికి సందులు వదలడం వాళ్ళకెంత దుర్భరంగా వుందో, వాళ్ళలో పుట్టిపెరిగిన వాళ్ళకే తెలుస్తుంది.

పుట్టినప్పట్నుంచీ వున్న వూరు.

యాభై ఏళ్ళవాళ్ళుకూడా వున్నారు. ముందుకడుగేస్తూ, "మళ్ళా ఎప్పుడు తిరిగొత్తావో(?" అని ఎంకి వూరువేపు తిరిగి దణ్ణం పెట్టింది.

నలుగురైదుగురూ అపనేఁచేశారు.

"ఇంకేం తిరిగొత్తాం?" అన్నారెవరో.

"అట్టా అనొద్దమ్మా" అంది పద్దాలు.

సొరాజ్జెం వెనక్కి, వెనక్కి చూస్తూ నడుస్తోంది

పదహారేళ్ళ సొరాజ్జెం వున్నవూళ్ళో పొట్టగడవకవూళ్లంట పడింది.

[అంతం కాదిది ఆరంబం
ఆరంబానికిది అంతం.]

అంకితం

రాయడానికి ఇన్‌స్పిరేషన్ ఇచ్చి
చలం గారికి.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPL4125 0 B 139.
పుస్తకం పేరు	సౌందర్యం
తారీఖు	26/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	119
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO 1, 2,
తయారు చేసినది	Ruksana
పేజీలు విడదీసినది	Ruksana
స్కాన్ చేసినది	Ch. Ramya
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good.